PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 44 సంచిక : 285 | విజయవాడ, సోమవారం 19 మే 2025 | 6 + 8 పేజీలు వెల : 5.50

Vol 44 No 285 | Vijayawada, Monday 19 May 2025 | Rs 5.50

అంబేద్కర్ స్ఫూర్తితో కుల నిర్మూలనకు ఉద్యమాలు

- పిఎవికెసిటి కార్యదర్శి వి శ్రీనివాసరావు

2

పంజాబ్ బల్లే బల్లే

- ప్లే ఆఫ్స్ ముంగిట శ్రేయస్ సేన
- రాజస్థాన్‌పై 10 పరుగులతో గెలుపు



6



హైదరాబాద్‌లో తీవ్ర విషాదం

అగ్నిప్రమాదంలో 17 మంది దుర్మరణం

మృతుల్లో 8 మంది చిన్నారులు, ఐదుగురు మహిళలు

ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్ పాతబస్తీ గుల్జార్‌హౌజ్ సమీపంలోని రెండతస్తుల భవనంలో ఆదివారం జరిగిన అగ్నిప్రమాదం తీవ్ర విషాదాన్ని నింపింది. ఎనిమిది మంది చిన్నారులు, ఐదుగురు మహిళలు సహా మొత్తం 17 మంది దుర్మరణం చెందారు. మృతులకు తెలంగాణ ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా ప్రకటించింది. స్థానికుల కథనం ప్రకారం... గుల్జార్‌హౌజ్ సమీపంలో జి ప్లస్ 2 భవనంలో మొదటి అంతస్తులో నగలు, ముత్యాల వ్యాపారులు ప్రహ్లాద్ మోదీ, పంకజ్ మోడీ, రాజేందర్ మోడీ కుటుంబసభ్యులతో నివాసం ఉంటున్నారు. గ్రౌండ్‌ఫ్లోర్‌లో నగల దుకాణం నిర్వహిస్తున్నారు. ఈ దుకాణంలోని ఎసి కంప్రెషర్ పేలి మొదటి అంతస్తుకు మంటలు వ్యాపించాయి. దట్టమైన పొగతోపాటు ఒక్కసారిగా మంటలు వ్యాపించడంతో మొదటి అంతస్తులో నివాసం ఉంటున్న వారు పొగకు ఉక్కిరిబిక్కిరై అపస్మారక స్థితికి చేరుకున్నారు. ప్రమాదం జరిగిన వెంటనే అగ్నిమాపక సిబ్బంది, డిఆర్‌ఎఫ్, జిహెచ్‌ఎంసి సిబ్బంది స్పందించినప్పటికీ ఇంట్లోకి వెళ్లేందుకు మార్గం లేకపోవడంతో లేడర్ సహాయంతో సహాయక సిబ్బంది మొదటి అంతస్తులోకి వెళ్లి తలుపులు బద్దలు కొట్టి లోపల చిక్కుకున్న వారిని బైటకు తీసుకొచ్చారు. ఘటనా స్థలంలోనే ముగ్గురు మృతి చెందారు. ఆక్సిజన్ అందక అపస్మారక స్థితిలోకి చేరినవారిని హుటాహుటిన అంబులెన్సుల్లో ఒవైసి, డిఆర్‌డిఎ, యశోద, ఉస్మానియా ఆస్పత్రులకు తరలించారు. చికిత్స పొందుతూ 14 మంది మృతి చెందినట్టు పోలీసులు తెలిపారు. ఉస్మానియా ఆస్పత్రిలో పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను కుటుంబసభ్యులకు అప్పగించారు. అగ్ని ప్రమాదంలో కుట్రకోణం లేదని పోలీసులు చెప్పారు. బాధిత కుటుంబాలకు కేంద్రం తరపున సాయం అందిస్తామని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. ప్రమాద ఘటనపై ప్రధాని నరేంద్ర మోడీ, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ సిఎం రేవంత్‌కు ఫోన్ చేసి ప్రమాద ఘటనపై ఆరా తీశారు.

మృతుల వివరాలు....

ప్రహ్లాద్ (70), మున్ని (70), రాజేందర్ మోదీ (65), సుమిత్ర (60), హమేయ్ (7), అభిషేక్ (31), శీతల్ (35), ప్రియాన్స్ (4), ఇరాజ్ (2), ఆరూష్ (3), రిషబ్ (4), ప్రథమ్ (1.6), అనుయాన్ (3), వర్ష (35), పంకజ్ (36), రజిని (32), ఇడ్డు (4).



రోబోతో మంటలు అదుపులోకి..

ఆదివారం ఉదయం ఆరు గంటలకు ప్రమాదం జరగ్గా, 6.16 గంటలకు అగ్నిమాపక మిగతా 5లో

టిడిపి వర్కింగ్ ప్రెసిడెంట్‌గా లోకేష్?

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో



టిడిపిలో నారా లోకేష్‌కు కొత్త పదవి వచ్చే అవకాశం ఉంది. ప్రస్తుతం పార్టీలో జాతీయ ప్రధాన కార్యదర్శి హోదాతో పాటు కార్యకర్తల సంక్షేమ నిధి బాధ్యతలు నిర్వహిస్తున్న ఆయనను పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా చేసే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది. ఇప్పటికే తాను ప్రాతినిధ్యం వహిస్తున్న విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖలే కాకుండా ఇతర శాఖలకు సంబంధించిన కొన్ని ప్రాజెక్టులను కూడా చూసుకుంటూ కీలకంగా వ్యవహరిస్తున్నారు. పార్టీ అధినేతగా ఉన్న చంద్రబాబు నాయుడు పూర్తిగా పాలనపైనే దృష్టి సారించారు. పార్టీ కార్యాకాలపాలపై ఆయన అంతగా దృష్టి సారించడం లేదని, ఎక్కువగా లోకేష్‌కే అప్పగించారని పార్టీ నేతలు చెబుతున్నారు. ఒక పదవిలో ఒక వ్యక్తి మూడుసార్లు కంటే ఎక్కువ ఉండకూడదని ఇటీవల జరిగిన పొలిట్‌బ్యూరో సమావేశంలో తీర్మానం చేశారు. జాతీయ ప్రధాన కార్యదర్శిగా లోకేష్ మూడుసార్లు కంటే ఎక్కువగానే కొనసాగుతున్నారు. ఈ నేపథ్యంలో వర్కింగ్ ప్రెసిడెంట్ పదవి అప్పగించే అవకాశం ఉందని చెబుతున్నారు. టిడిపిలో వర్కింగ్ ప్రెసిడెంట్ అనే పదవి లేదు. ఈ నెల 27, 28, 29 తేదీల్లో కడపలో ఆ పార్టీ మహానాడు జరగనుంది. ఈ మహానాడులో లోకేష్‌కు వర్కింగ్ ప్రెసిడెంట్ పదవి ఇవ్వాలంటూ తీర్మానం ప్రతిపాదించి ఆమోదించే అవకాశం ఉందని పార్టీ వర్గాలు అంటున్నాయి.



5

సిపిఎం సీనియర్ నేత రఘుపాల్ కన్నుమూత

రాజ్యాంగమే సర్వోన్నతం

సిజెఐ జస్టిస్ గవాయ్



న్యూఢిల్లీ : భారత రాజ్యాంగమే సర్వోన్నతమైందని, మూలస్తంభాలుగా ఉన్న వ్యవస్థలన్నీ కలిసి పనిచేయాలని భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బిఆర్ గవాయ్ తెలిపారు. మహారాష్ట్ర, గోవా బార్ కౌన్సిల్ ఏర్పాటుచేసిన సత్కార కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగం ఏకైక సర్వోన్నత శక్తి అని, న్యాయవ్యవస్థ, కార్యనిర్వాహక వ్యవస్థ, చట్టసభలు సమన్వయంతో రాజ్యాంగం ప్రకారమే పనిచేయాలని స్పష్టం చేశారు. దేశ ప్రాథమిక నిర్మాణం బలంగా ఉందని, రాజ్యాంగంలోని మూడు స్తంభాలు సమాన ప్రాధాన్యత కలిగి ఉండాలని, ఒకదాని పట్ల ఒకటి తగిన గౌరవాన్ని చూపాలని చెప్పారు. దేశం ఆర్థికంగా, సామాజికంగానే కాకుండా సాంస్కృతికంగానూ బలపడుతోందని, ఈ పురోగతిని కొనసాగించాలని అన్నారు. రాజ్యాంగంలోని అన్ని అంగాలు ఒకదానికి ఒకటి సహకరించుకోవడమే ప్రజాస్వామ్య సారాంశమని, ఇది భారత సమాఖ్యకు ప్రాథమిక ఆధారమని చెప్పారు.

కోర్టు గౌరవాన్ని ఎవరైనా దెబ్బతీస్తే రాజీపడేది లేదని చెప్పారు. ఈ కార్యక్రమంలో జస్టిస్ గవాయ్ వెలువరించిన 50 ముఖ్యమైన తీర్పులను వివరించే పుస్తకాన్ని విడుదల చేశారు.

రాజ్యాంగ ప్రాథమిక నిర్మాణ పరిరక్షణ కోసం

ఐక్యం కావాలి

- బిజెపియేతర సిఎంలకు స్టాలిన్ లేఖ



చెన్నై : రాజ్యాంగ ప్రాథమిక నిర్మాణాన్ని పరిరక్షించేందుకు బిజెపియేతర ముఖ్యమంత్రులంతా ఐక్యం కావాలని తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్ కోరారు. 'తమిళనాడు ప్రభుత్వం వర్సెస్ రాష్ట్ర గవర్నర్' కేసులో సుప్రీంకోర్టు తీర్పును సవాలు చేస్తూ... రాష్ట్రపతి సుప్రీంకోర్టులో 14 ప్రశ్నలను లేవనెత్తారని తెలిపారు. ఈ ప్రశ్నలు... గవర్నర్లు, రాష్ట్రపతికి గడువు విధించిన సుప్రీంకోర్టు తీర్పును ప్రశ్నార్థకం చేయాలని, రాష్ట్ర స్వయం ప్రతిపత్తికి ముప్పు తేవాలనే ఉద్దేశంతో రాసినవని పేర్కొన్నారు. ఇటువంటి సూచనలను వ్యతిరేకించాల్సిన సమయం వచ్చిందని, రాజ్యాంగ ప్రాథమిక నిర్మాణాన్ని పరిరక్షించేందుకు ఐక్యతను చాటుకోవాల్సిన సమయం వచ్చిందని తెలిపారు. ఈ కీలకమైన అంశంలో తక్షణ, వ్యక్తిగత జోక్యానికి ఎదురుచూస్తున్నానని స్టాలిన్ బిజెపియేతర పార్టీల పాలనలో ఉన్న కేరళ, జార్ఖండ్, హిమాచల్‌ప్రదేశ్, కర్ణాటక, తెలంగాణ, పశ్చిమ బెంగాల్, పంజాబ్, జమ్ముకాశ్మీర్ సిఎంలకు రాసిన లేఖలో పేర్కొన్నారు.

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం గవర్నర్లను ప్రతిపక్ష పాలిత రాష్ట్రాల్లో పాలనను అడ్డుకోవడానికి, బిల్లులకు అనుమతించడంలో విపరీతమైన జాప్యం చేస్తున్నారని విమర్శించారు. చెల్లుబాటయ్యే రాజ్యాంగ లేదా చట్టపరమైన కారణాలు లేకుండానే అనుమతిని నిరాకరిస్తున్నారని తెలిపారు. సాధారణ ఫైళ్లు, సంతకం కోసం పంపిన ప్రభుత్వ ఆదేశాలను నిరవధికంగా నిలిపివేస్తున్నారని, ముఖ్యమైన పదవుల నియామకాల్లో జోక్యం చేసుకుంటున్నారని పేర్కొన్నారు. విద్యాసంస్థలను రాజకీయం చేయడానికి విశ్వ విద్యాలయాల ఛాన్సలర్‌గా గవర్నర్లు తమ పదవిని దుర్వినియోగం చేస్తున్నారని తెలిపారు. ఉన్నత రాజ్యాంగ పదవుల్లో ఉన్న వారు రాజ్యాంగ నైతికతకు అనుగుణంగా వ్యవహరిస్తారని విశ్వసించినందున రాజ్యాంగం కొన్ని అంశాలపై స్పష్టత ఇవ్వలేదనే అంశాన్ని వారు ఉపయోగించుకుంటున్నారని విమర్శించారు. సిఎంలంతా సమన్వయంతో చట్టపరమైన వ్యూహాన్ని రూపొందించాలని ఆయన కోరారు. ప్రతిపక్షపాలిత రాష్ట్రాలు ఆమోదించే బిల్లులను అడ్డుకునేందుకు లేదా ఆలస్యం చేసేందుకు కేంద్రం గవర్నర్‌లను ఉపయోగించిన తీరుకు మనమంతా సాక్షులమని లేఖలో పేర్కొన్నారు. రాష్ట్ర క్యాబినెట్ సలహామేరకే గవర్నర్ వ్యవహరించాలని, బిల్లులకు ఆమోదం తెలిపే విషయంలో నిరవధికంగా జాప్యం చేయరాదని సుప్రీంకోర్టు స్పష్టం చేసిందని స్టాలిన్ తెలిపారు.. ఈ తీర్పు రాజ్యాంగ పరిధిలో ముఖ్యమంత్రుల పాత్రను, బాధ్యతలను నిర్వర్తించే రాష్ట్ర ప్రభుత్వాలపై కేంద్ర ప్రభుత్వం అనవసరంగా జోక్యం చేసుకోకుండా అడ్డుకుంటుందని తెలిపారు. రాజ్యాంగ నైతికతను కేంద్రం దుర్వినియోగం చేస్తుందని చెప్పారు. సుప్రీంకోర్టు ఇచ్చిన స్పష్టమైన తీర్పుపై ప్రెసిడెన్షియల్ రిఫరెన్స్ కోరడం అప్రజాస్వామిక చర్య అని స్టాలిన్ పేర్కొన్నారు. తమిళనాడు కేసులో ఇచ్చిన సుప్రీంకోర్టు చారిత్రాత్మక తీర్పు తన రాష్ట్రానికే మాత్రమే కాకుండా అన్ని రాష్ట్రాలకు సంబంధించినదని అన్నారు. ఈ తీర్పు రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్రపాలిత ప్రాంతాల మధ్య సమాఖ్య నిర్మాణాన్ని, అధికారాన్ని సమర్థిస్తుందని, దీంతో ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన రాష్ట్ర అసెంబ్లీలు రూపొందించిన బిల్లులను కేంద్రం నియమించిన గవర్నర్ అడ్డుకోవడాన్ని నిరోధించవచ్చని లేఖలో పేర్కొన్నారు.

పిఎస్‌ఎల్‌వి సి61 ప్రయోగం విఫలం..

- మూడవ దశలో సాంకేతిక లోపం...

ప్రజాశక్తి-సూళ్లూరుపేట (తిరుపతి జిల్లా)




తిరుపతి జిల్లాలోని సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ నుంచి ఆదివారం ఉదయం 5.59 గంటలకు నిర్వహించిన పిఎస్‌ఎల్‌వి-సి61 ప్రయోగం విఫలమైనట్లు ఇస్రో ఛైర్మన్ వి నారాయణన్ ప్రకటించారు. పిఎస్‌ఎల్‌వి రాకెట్ సాయంతో ఇఒఎస్ 09 శాటిలైట్‌ను భూమికి 529 కిలోమీటర్ల ఎత్తులో సన్ సింక్రోనస్ పోలార్ ఆర్బిట్‌లో ప్రవేశ పెట్టాల్సి ఉంది. ఇందుకోసం ఈ రాకెట్ 17 నిమిషాల 39 సెకన్ల పాటు నాలుగు దశల్లో రాకెట్ ప్రయాణించాల్సి ఉంది. మొదటి, రెండు దశల వరకు దీని ప్రయాణం సాఫీగానే సాగింది. మూడో దశలోనే సాంకేతిక సమస్య తలెత్తడంతో రాకెట్ నిర్దేశిత మార్గంలో కాకుండా మరో మార్గంలో ప్రయాణించడం మొదలు పెట్టింది. ఇందులో లోపం ఎక్కడ తలెత్తిందన్న వివరాలను విశ్లేషణ తర్వాత వెల్లడిస్తామని ఇస్రో ఛైర్మన్ తెలిపారు.



చారులత, జాశ్రిత



మనీశ్వరి



ఉదయ్

కారు డోర్ లాక్

ఊపిరాడక నలుగురు చిన్నారులు మృతి

ప్రజాశక్తి- కంటోన్మెంట్ (విజయనగరం జిల్లా)

విజయనగరం మండలం ద్వారపూడి గ్రామంలో ఆదివారం తీవ్ర విషాదకర సంఘటన చోటుచేసుకుంది. కారు డోర్ లాక్ కావడంతో ఊపిరాడక నలుగురు చిన్నారులు మరణించారు. గ్రామస్తుల కథనం ప్రకారం... విజయనగరం మండలం ద్వారపూడి గ్రామానికి చెందిన కంది మనీశ్వరి (6), బూర్లి చారులత (7), బూర్లి జాశ్రిత (8), మంగి ఉదయ్ (7) ఆదివారం ఉదయం ఆడుకునేందుకు ఇళ్ల నుంచి బయటకు వెళ్లారు. గ్రామంలో నీళ్ల ట్యాంకు వద్ద ఆగి ఉన్న కారు డోరు తీసి సరదాగా లోపలికి వెళ్లి కూర్చున్నారు. ఇంతలో కారు డోర్ లాక్ పడడంతో అందులో చిక్కుకుపోయారు. పిల్లలు ఎంతసేపటికీ ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు వారి కోసం వెతికినా కనిపించలేదు. కారులోని చిన్నారులను స్థానికులు చూసి అద్దాలు పగలుకొట్టి వారిని బయటకు తీశారు. అప్పటికే నలుగురూ మృతి చెందారు. మృతుల్లో చారులత, జాశ్రిత అక్కచెల్లెళ్లు. చిన్నారుల తల్లిదండ్రులు రోజువారీ కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఒకేసారి నలుగురు చిన్నారుల మృతితో ఆ గ్రామస్తులు శోకసంద్రంలో మునిగిపోయారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం విజయనగరం ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి పోలీసులు తరలించారు. విజయనగరం రూరల్ ఎస్ఐ వి.అశోక్ కుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆపరేషన్ సిందూర్‌పై పోస్ట్ పెట్టిన అశోకా యూనివర్సిటీ ప్రొఫెసర్ అరెస్ట్

న్యాయం, శాంతి కోరుకునే వారే లక్ష్యంగా అరెస్టులు : సిపిఎం



పానిపట్ : విద్వేష వ్యాఖ్యలు చేసిన బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ నేతలు, మంత్రులు స్వేచ్ఛగా తిరుగుతుండగా.. హింసను వ్యతిరేకిస్తూ పోస్టు చేసిన ప్రొఫెసర్‌ను అరెస్టు చేయడం చర్చనీయాంశమైంది. 'ఆపరేషన్ సిందూర్'పై సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టిన అశోకా యూనివర్సిటీ అసోసియేట్ ప్రొఫెసర్ అలీఖాన్ మహ్మూదాబాద్‌ను హర్యానా పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. బిజెపి యువ మోర్చా నాయకుడు, జతేరి గ్రామ సర్పంచ్ యోగేష్ జతేరి, హర్యానా మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ రేణు భాటియా ఫిర్యాదు మేరకు అలీఖాన్‌ను ఢిల్లీలో అదుపులోకి తీసుకున్నామని హర్యానాలోని రాయ్ (సోనిపట్) అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ (ఎసిపి) రాయ్ అజీత్ సింగ్ తెలిపారు. ఆయనపై రాయ్ పోలీస్ స్టేషన్‌లో రెండు ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయని పేర్కొన్నారు. కోర్టులో హాజరు పరిచామని, ఐదు రోజుల రిమాండ్ విధించారని తెలిపారు. సోనీపట్‌లోని అశోకా యూనివర్సిటీలో రాజనీతి శాస్త్ర విభాగాధిపతిగా అలీఖాన్ వ్యవహరిస్తున్నారు.

అలీఖాన్ వ్యాఖ్యలు ఇవీ

ఆపరేషన్ సిందూర్ గురించి మీడియా సమావేశాల్లో వివరించిన కల్నల్ సోఫియా ఖురేషీ, వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్‌లకు సంబంధించి సోషల్ మీడియాలో అలీఖాన్ పోస్టు చేశారు. "సోఫియా ఖురేషీ, వ్యోమికా సింగ్‌లు జరిగింది జరిగినట్టుగా మీడియాకు చెప్పలేదు. కానీ దేశ ప్రజలు కోరుకున్నది చెప్పారు. ప్రభుత్వం తరపున మాట్లాడుతున్న వారు క్షేత్రస్థాయిలో జరిగిన నిజాలను మాత్రమే చెప్పాలి. లేదంటే అది వంచనే" అని ఆ పోస్టులో పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యలపై హర్యానా రాష్ట్ర మహిళా కమిషన్ నోటీసులు పంపింది. "సోఫియా ఖురేషీ, వ్యోమికా సింగ్‌లను చూసి మేం గర్విస్తున్నాం. వారికి మా సలాం. వాళ్లపై అలీఖాన్ వ్యాఖ్యలు అభ్యంతరకరంగా ఉన్నాయి. ఆపరేషన్ సిందూర్ గురించి తప్పుడు మాటలు మాట్లాడటం సరికాదు. ఈ తప్పు చేసినందుకు అలీఖాన్ ఈ రోజే కమిషన్ ఎదుట హాజరై క్షమాపణ చెప్పాలి" అని మిగతా 5లో

బావురుమంటోన్న 'బర్లీ' రైతు

- కొనుగోలుదారుల కోసం ఎదురుచూపులు
- తెగనమ్ముకోవాల్సిన దుస్థితి

ప్రజాశక్తి- ఒంగోలు బ్యూరో



కొనుగోలు చేసే వారు లేక బ్లాక్ బర్లీ పొగాకు రైతులు బావురుమంటున్నారు. కొనుగోలుదారుల కోసం ఎదురు చూస్తున్నారు. వారు నిర్ణయించిన ధరకు తెగనమ్ముకోవాల్సి వస్తోంది. దీంతో, రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. పొగాకుపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గురువారం సమీక్ష చేశారు. పొగాకు పంటను కొనుగోలు చేయాలని, గిట్టుబాటు ధరలు వచ్చేలా చూడాలని అధికారులను ఆదేశించారు. బర్లీ పొగాకుకు క్వింటాలుకు రూ.12,500 ధర కల్పించాలని నిర్దేశించారు. అయినా, ధరలో మార్పులేదు. వర్జీనియా పొగాకును రైతులు వేలం కేంద్రాలకు తెస్తే ఎంతోకొంతకు కొంటున్నారు. బర్లీ పొగాకును ఇతర పంటల మాదిరిగానే రైతులు ఇళ్ల వద్దనే అమ్ముకోవాల్సి వస్తోంది. పందిళ్లలో ఆరపెట్టారు. వ్యాపారులు వస్తేనే దాన్ని తీసి ప్రాసెస్ చేస్తున్నారు. ఈ పొగాకును కొనేందుకు వ్యాపారులు ముందుకు రావడం లేదు. దీంతో, రైతులు ఆందోళనతో రోడ్డెక్కుతున్నారు. ఈ పొగాకును ప్రకాశం జిల్లాలోని ఉత్తర ప్రాంతం, బాపట్ల, గుంటూరు జిల్లాల్లో 96 వేల ఎకరాల్లో సాగు చేశారు. గతేడాది క్వింటాలుకు రూ.18 వేలు ధర పలికింది ఇండియన్ టుబాకో కంపెనీ (ఐటిసి)తోపాటు ఇతర కంపెనీలూ కొన్నాయి. దీంతో, ఈ ఏడాది సాగు విస్తీర్ణం పెరిగింది. ఇప్పుడు ఈ పొగాకు పంట ఎక్కువగా ఉందనే కారణంతోపాటు ఎగుమతులు లేవనే పేరుతో కొనుగోళ్లు ఆపేశారు. దీంతో, క్వింటాలు ధర రూ.8 వేలకు పడిపోయింది. రైతులు ఎకరాకు లక్ష దాకా పెట్టుబడి పెట్టారు. వాతావరణం అనుకూలంగా లేనందున దిగుబడి తగ్గింది. అకాల వర్షాలూ పొగాకు సాగును కోలుకోలేని దెబ్బతీశాయి. ఎకరాకు పది క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. కనీసం రూ.15 వేలకు కొంటేనే పెట్టుబడి ఖర్చయినా వస్తుందని రైతులు అంటున్నారు.

వ్యాపారుల సిండికేట్‌తో వర్జీనియా పొగాకు రైతులకూ తప్పని కష్టాలు

వర్జీనియా పొగాకు పండించిన రైతులకూ ఈ ఏడాది కష్టాలు తప్పడం లేదు. వేలం కేంద్రాల్లో కొనుగోలు చేస్తున్నా ధర గిట్టుబాటు కావడం లేదు. వ్యాపారులు సిండికేట్ అవుతున్నారు. కిలో పొగాకు గరిష్ట ధర రూ.280 కనిష్ట ధర రూ.200 మాత్రమే ఇస్తున్నారు. రైతులకు గిట్టుబాటు కావడం లేదు. ధరలు పెంచాలని రైతులు కోరుతుంటే పొగాకు నాణ్యత లేదంటూ వ్యాపారులు సాకులు చెప్తున్నారు. రోజూ వేలం కేంద్రాలకు వస్తోన్న పొగాకులో 25 శాతంపైగా బేళ్లను కొనకుండా .తిరస్కరిస్తున్నారు. వేలం ప్రారంభమై రెండు నెలలవుతోంది. వర్జీనియా పొగాకు మన రాష్ట్రంతోపాటు ,కర్ణాటకలోనూ పండిస్తున్నారు. మన రాష్ట్రంలో ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లోనే ఎక్కువగా సాగవుతోంది ఈ ఏడాది రాష్ట్రంలో 140 మిలియన్ కిలోలకు అనుమతి ఇచ్చారు. ఎకరాకు లక్షన్నరకుపైగా పెట్టుబడి పెట్టారు. కౌలు రైతులకు కౌలు రూపంలో మరో రూ.25 వేలు అదనంగా భారం పెరిగింది. గరిష్ట ధర కిలోకు రూ.300లకుపైగానే ఆశించారు. దక్షిణాది నల్లరేగడి నేలల్లో పండించిన వర్జీనియా పొగాకును శుక్రవారం నాటికి 1,35,58,599 కిలోలు కొనుగోలు చేశారు. ఇప్పటి వరకూ సగటు ధర రూ.254,75 మాత్రమే ఉంది. శుక్రవారం నాటి మిగతా 5లో

మాజీ ఎంపి నందిగం సురేష్ అరెస్ట్

ప్రజాశక్తి- తుళ్లూరు (గుంటూరు జిల్లా)

వైసిపి మాజీ ఎంపీ నందిగం సురేష్‌ను గుంటూరు జిల్లా తుళ్లూరు పోలీసులు ఆదివారం అరెస్ట్ చేశారు. దీనిపై డిఎస్‌పి మురళీకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. ఉద్దండరాయునిపాలేనికి చెందిన ఇసుకపల్లి రాజు అనే వ్యక్తి గత శనివారం రాత్రి నందిగం సురేష్ సొంతూరైన తుళ్లూరు మండలం గ్రామంలోని బొడ్డురాయి సెంటర్ వద్ద నిలబడి ఉన్నారు. సురేష్‌కు చెందిన కారు వేగంగా వచ్చి తాకడంతో ఆయన కింద పడిపోయారు. అంతటితో ఆగకుండా రాజును సురేష్, ఆయన సోదరుడు, మరికొందరు కొట్టి తీవ్రంగా గాయపరిచారు. ఇంటికి బలవంతంగా బైక్‌పై తీసుకెళ్లి ఇంటి మెట్లపై మరోసారి కొట్టారు. పాత కక్షల నేపథ్యంలోనే ఈ దాడి జరిగింది. రాజు ఫిర్యాదు మేరకు సురేష్‌తోపాటు మరో 11 మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఇప్పటికే సురేష్‌పై ఒక హత్య కేసుతోపాటు 12 కేసులు ఉన్నాయని, కండిషన్ బెయిల్‌పై ఉన్నారని డిఎస్‌పి తెలిపారు. సురేష్‌ను అరెస్ట్ చేశామని, మిగిలిన వారినీ అరెస్ట్ చేస్తామని చెప్పారు.



'సంఘం శరణం గచ్ఛామి' నాటకంలో ఒక దృశ్యం



అంబేద్కర్ జీవిత చరిత్రను మైక్రో ఆర్ట్‌లో రూపొందించిన యువ కళాకారిణి మహితను అభినందిస్తున్న వి శ్రీనివాసరావు, అంద్ర మాల్యాద్రి తదితరులు

అంబేద్కర్ స్ఫూర్తితో కుల నిర్మూలనకు ఉద్యమాలు

పివికెసిటి కార్యదర్శి వి శ్రీనివాసరావు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

డాక్టర్ బిఆర్ అంబేద్కర్ స్ఫూర్తితో దీర్ఘకాలిక కుల నిర్మూలనకు, వివక్షకు వ్యతిరేక ఉద్యమాలను నిర్మించాల్సిన అవసరం ఉందని పూలే అంబేద్కర్ విజ్ఞాన కేంద్రం చారిటబుల్ ట్రస్ట్ (పివికెసిటి) కార్యదర్శి వి శ్రీనివాసరావు తెలిపారు. అందులో భాగంగా కెవిపిఎస్, డిఎస్ఎంఎం లాంటి సంస్థలు, ఇతర సంఘాలు, వ్యక్తులు కుల వివక్షపై పోరాటాలు చేస్తున్నట్లు చెప్పారు. విజయవాడలోని ఎంబివికెలో కెవిపిఎస్, పివికెసిటి ఆధ్వర్యంలో సామాజిక చైతన్య సాంస్కృతిక యాత్రల ముగింపు సందర్భంగా అభ్యుదయ ఆర్ట్స్ అకాడమీచే, అంబేద్కర్ జీవిత చరిత్రపై రూపొందించిన కళారూపం 'సంఘం శరణం గచ్ఛామి' నాటకం ఆదివారం ప్రదర్శించారు. ఈ సందర్భంగా వి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ఈ నాటకం కుల వివక్షకు వ్యతిరేకంగా పోరాడటానికి రాష్ట్ర ప్రజలకు స్ఫూర్తినిస్తుందని ఆశిస్తున్నట్లు చెప్పారు. చారిత్రకంగా కొన్ని వందల ఏళ్ల కిందట నుంచి కుల వివక్షపై అనేక మంది సవాలు చేస్తూ వచ్చారని, అనేక ఉద్యమాలు జరిగాయని, త్యాగాలు చేశారని చెప్పారు. ఆధునిక కాలంలో కుల వ్యవస్థకు వ్యతిరేకంగా మహాత్మా జ్యోతిరావు పూలే దంపతులు తిరుబాటు చేశారని తెలిపారు. సామాజిక అంతరాలు నిర్మూలించాలని ఆలోచన చేసిన క్రమంలో విద్యతోనే ఈ సామాజిక అంతరాలు నిర్మూలించడం సాధ్యమని భావించి ఎన్నో అవమానాలు ఎదుర్కొని పెద్ద ఉద్యమం చేశారన్నారు. ఆ స్ఫూర్తితో తదనంతర కాలంలో బిఆర్ అంబేద్కర్ తన జీవితంలో అనేక అవమానాలు ఎదుర్కొన్న సైతం ఉన్నత విద్యలను అభ్యసించి, అనేక మందిని కూడగట్టి పలు పోరాటాలు, తిరుగుబాట్లు చేశారన్నారు. చివరకు రాజ్యాంగాన్ని కూడా ఒక సాధనంగా చేసుకుని ఈ సామాజిక ఆర్థిక అసమానతలు నిర్మూలించి, ఉత్తమ సమాజాన్ని నిర్మించాలనే లక్ష్యంతో పని చేశారన్నారు. ఇప్పటికీ కుల వివక్ష ఏదో ఒక రూపంలో ప్రజల్ని పీడిస్తూనే ఉందని తెలిపారు. చాలా చోట్ల వామపక్ష పార్టీలు కుల నిర్మూలన పోరాటంలో అగ్రభాగంలో ఉంటూ సమాజంలో మార్పు కోసం ప్రయత్నం చేస్తున్నాయని చెప్పారు. ఇలాంటి పోరాటాలు అన్ని కలిసి ప్రవాహంలా మారితేనే ఈ కుల వ్యవస్థను నిర్మూలించడం సాధ్యమవు తుందని, సామాజిక సమానత్వం వస్తుందన్నారు. ఆ స్ఫూర్తిని రగిలించడానికి ఈ నాటకం దోహదపడుతుందని తెలిపారు. అభ్యుదయ ఆర్ట్స్ అకాడమీచే ప్రదర్శించబ డుతున్న నాటకాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్ళాలన్న లక్ష్యంతో కెవిపిఎస్, పూలే అంబేద్కర్ విజ్ఞాన కేంద్రం చారిటబుల్ ట్రస్ట్, అంబేద్కర్ ఆర్ట్స్ అకాడమీ ప్రయత్నాన్ని అభినందించారు. భవిష్యత్తులో నాటకాన్ని మరింత విస్తృతంగా ప్రజల్లోకి తీసుకువెళ్లాలని కోరారు. కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంద్ర మాల్యాద్రి మాట్లాడుతూ.. అంబేద్కర్ 134వ జయంతి సందర్భంగా ఏప్రిల్ నుంచి రాష్ట్ర వ్యాప్తంగా పలు పట్టణాలు, గ్రామాల్లో ఈ నాటక ప్రదర్శనలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. విజయ వాడలో చివరి కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు. తొలుత అంబేద్కర్ చిత్రపటానికి పూలమా లలు వేసి నివాళులర్పించారు. అన్నం మహిత అనే యువతి అంబేద్కర్ జీవితాన్ని పెన్సిల్ లెడ్స్‌పై చెక్కి చిత్రపటం రూపొం దించగా, దీనిని ఈ సందర్భంగా వి.శ్రీనివాసరావు, తదితరులు పరిశీలించి యువతిని అభినందించారు. ఈ చిత్రపటాన్ని అంబేద్కర్ మనువడుకు అందించాలని భావి స్తున్నట్లు మహిత తెలిపారు. ఈ కార్య క్రమాన్ని ఎన్‌టిఆర్ జిల్లా ఎస్ఎస్ఎ పిడి జి.మహేశ్వరరావు, బి.ఆర్ అంబేద్కర్ గురుకులాల సంయుక్త కార్యదర్శి సంజీవరావు, జిఎస్ఆర్ పోలవరపు కళా సమితి అధ్యక్షులు గోళ్ల నారాయణరావు, ఐఎఎస్ అకాడమి డైరెక్టర్ మన్నం రాజారావు, అంబేద్కర్ మిషన్ అధ్యక్షులు గంజి రామారావు, రిటైర్డు డిఇ వరప్రసాద్, ఆర్‌టిసి డిఇ రాధాకృష్ణ, సామాజిక కార్యకర్త కృష్ణ, మాతంగి రత్నకమల్, కెవిపిఎస్ ఎన్‌టిఆర్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్య దర్శులు జి క్రాంతికుమార్, జి నటరాజ్, కెవిపిఎస్ రాష్ట్ర నాయకులు చింతల శ్రీనివాస్, అరుణమ్మ పాల్గొన్నారు.

స్టాఫ్ నర్సులకు రక్షణ కల్పించాలి

- ఎపి స్టేట్ గవర్నమెంట్ కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సెస్ యూనియన్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాత్రి వేళల్లో విధులు నిర్వహించే స్టాఫ్ నర్సులకు రక్షణ కల్పించాలని ప్రభుత్వాన్ని ఎపి స్టేట్ గవర్నమెంట్ కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సస్ యూనియన్ రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు యూనియన్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు ఎవి నాగేశ్వరరావు, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డి దయామణి, జి భవాని ఆదివారం ప్రకటన విడుదల చేశారు. చిత్తూరు జిల్లా ఐరాల పిహెచ్‌సిలో మే 14న రాత్రి వేళ విధులు నిర్వహిస్తున్న స్టాఫ్ నర్సు శకుంతలపై జనసేన నాయకులు దాడి చేయడం అమానుషమని పేర్కొన్నారు. రోగిని ఆస్పత్రిలోకి తీసుకురాకుండానే కారు వద్దకు వెళ్లి చూడాలని కోరగా, మానవతా దృక్పథంతో శకుంతల కారు వద్దకు వెళ్లి సమస్య తెలుసుకుని, ఇంజక్షన్ ఇచ్చేందుకు ఆస్పత్రిలోకి వచ్చి సిరెంజ్ లోడ్ చేస్తున్న సమయంలో శకుంతల, ఆమె భర్తపై జనసేన నాయకులు దాడి చేశారని తెలిపారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అంతర్జాతీయ నర్సుల దినోత్సవం సందర్భంగా ఈ నెల 12న నర్సుల సేవలను గుర్తించి నర్సులను అభినందించగా, ఆ పార్టీ నాయకులు విధి నిర్వహణలో ఉన్న నర్సులపై దాడికి పాల్పడం సరైన చర్య కాదని పేర్కొన్నారు. దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే అనేక చోట్ల రాత్రి వేళల్లో విధులు నిర్వహిస్తున్న స్టాఫ్ నర్సులపై దాడులు జరుగుతున్నాయని తెలిపారు. ఈ విషయాన్ని గతంలో వైద్యారోగ్యశాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకొచ్చినట్లు చెప్పారు. ఇప్పటికైనా రాత్రి వేళల్లో విధులు నిర్వహించే స్టాఫ్ నర్సులకు భద్రత కల్పించాలని కోరారు. చిత్తూరులో దాడికి గురైన స్టాఫ్ నర్సుకు రక్షణ కల్పించి, దాడికి పాల్పడిన వారిపై కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.



మాట్లాడుతున్న ఆర్.నారాయణమూర్తి

రంగస్థల కళాకారులను ప్రోత్సహించాలి

- సినీ నటుడు ఆర్.నారాయణమూర్తి

ప్రజాశక్తి - లింగసముద్రం (పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా)

కళాకారులకు 'రంగస్థలం' అమ్మఒడి లాంటిదని సినీ నటుడు ఆర్.నారాయణమూర్తి తెలిపారు. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా లింగసముద్రం మండలం పెద్దపవనిలో పావని ఆర్ట్స్ ఆధ్వర్యాన ఎం.రాఘవేంద్రరావు స్మారక నాటక కళాపరిషత్ నిర్వహించిన ఉభయ తెలుగు రాష్ట్రాల నాటిక పోటీల బహుమతుల ప్రదానోత్సవం ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నారాయణమూర్తి హాజరై మాట్లాడారు. రంగస్థల కళాకారులను ప్రోత్సహించినప్పుడే నాటకాలు మనుగడలో ఉంటాయని తెలిపారు. నేటి తరం యువత వాటి పట్ల ఆసక్తి చూపే విధంగా నాటికలు ప్రదర్శించాలన్నారు. ఈ సందర్భంగా ఎం.రాఘవేంద్రరావు గొప్పతనాన్ని కొనియాడారు. అటువంటి గొప్ప కళాకారుడి శిష్యుడుగా, ఆయన సాంస్కృతిక వారసుడిగా మలిశెట్టి నాగేశ్వరరావు కొనసాగడం అభినందనీయమని పేర్కొన్నారు. నాటిక పోటీల కోసం ఆయన చేస్తున్న కృషిని కొనియాడారు. అనంతరం నాటిక పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. నాలుగు రోజులపాటు జరిగిన ఈ పోటీల్లో ఉత్తమ ప్రదర్శనగా అమరావతి ఆర్ట్స్ గుంటూరు వారి చిగురు మేఘం, ద్వితీయ ఉత్తమ ప్రదర్శనగా సౌజన్య కళా స్రవంతి విశాఖపట్నం వారి దేవరాగం, తృతీయ ఉత్తమ ప్రదర్శనగా గోవాడ క్రియేషన్స్ వారి అమ్మ చెక్కిన బొమ్మ నాటికలు నిలిచాయి. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పర్యాటక సంస్థ చైర్మన్ డాక్టర్ నూకసాని బాలాజీ, నాటక, సినీ రచయిత జలదంకి సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..
స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ,
ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ,
అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి,
గుంటూరు జిల్లా - 522 501కు కానీ
editorprajasakthi@gmail.comకు
పంపవచ్చు.

నేటి నుంచి ఇఎపిసెట్

- తొలి రెండు రోజులు అగ్రికల్చర్ పరీక్ష

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మా ఉమ్మడి ప్రవేశ పరీక్ష (ఇఎపిసెట్) సోమవారం నుంచి ప్రారంభం కానుంది. ఈ నెల 27 వరకు ఈ పరీక్షలు రోజుకు రెండు పూటలా జరగనున్నాయి. ఉదయం 9 నుంచి 12 గంటలకు మొదటి సెషన్, మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు రెండో సెషన్ పరీక్షలు జరగనున్నాయి. ఉమ్మడి ప్రవేశ పరీక్ష (సెట్స్)కు హాజరయ్యే విద్యార్థులు పరీక్ష సమయం దాటి ఒక్క నిమిషం ఆలస్యంగా వచ్చినా అనుమతించబోమని ఉన్నత విద్యామండలి ఇప్పటికే ప్రకటించింది. దీంతో విద్యార్థులు పరీక్ష సమయానికి ముందుగానే చేరుకోవాలి. రాష్ట్ర వ్యాప్తంగా 3,61,536 మంది ఈ పరీక్షకు దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో ఇంజినీరింగ్‌కు 2,79,700 మంది, అగ్రికల్చర్, ఫార్మాకు 80,924 మంది, రెండిటికీ కలిపి 912 మంది దరఖాస్తు చేసుకున్నారు. జెఎన్‌టియు అనంతపూర్ పరీక్షలకు సంబంధించిన ఏర్పాట్లను పూర్తిచేసింది. సోమ, మంగళవారాల్లో అగ్రికల్చర్, ఫార్మా ప్రవేశ పరీక్ష విద్యార్థులకు జరగనుంది. ఈ నెల 21 నుంచి 27 వరకు ఇంజినీరింగ్ ప్రవేశ పరీక్ష జరగనుంది. మొత్తం 145 పరీక్ష కేంద్రాలను విద్యార్థుల కోసం ఏర్పాటు చేశారు.

దౌత్యపరంగా పాక్‌ను ఎండగట్టాలి : నారాయణ

ప్రజాశక్తి తిరుపతి సిటీ

దౌత్యపరంగా పాక్‌ను ఎండగట్టే ప్రయత్నం చేయాలని సిపిఐ జాతీయ కార్యదర్శి కె నారాయణ అన్నారు. తిరుపతి కచ్చపి ఆడిటోరియంలో ఆదివారం విలేకరుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రాజ్యసభ సభ్యులు సంతోష్ కుమార్, సిపిఐ జాతీయ కార్యదర్శి కె నారాయణ మాట్లాడుతూ ఆపరేషన్ సంధూర్‌పై కేంద్రం అనేక ప్రశ్నలకు జవాబు చెప్పాల్సి ఉందన్నారు. ఉన్నఫలంగా ఆ దేశం ప్రకటనతో సీజ్ ఫైర్‌కు కేంద్రం అమోదించడం వెనుక అనేక అనుమానాలు ఉన్నాయన్నారు. ఉగ్రమూకలకు మతం, మానవత్వం, సిద్ధాంతం వంటివేమీ ఉండవని, వారిని పూర్తిస్థాయిలో అరికట్టే చర్యలు చేపట్టాలని అన్నారు. ఉగ్రమూకల వ్యవహారంలో పాక్ అనుసరిస్తున్న తీరును ప్రపంచ దేశాలకు వివరించే క్రమంగా కేంద్రం ప్రకటించిన ఏడు కమిటీల్లో బిజెపి ఏకపక్షంగా నిర్ణయం తీసుకుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీల ప్రమేయం లేకుండా సభ్యులను ఎంపిక చేయడాన్ని ఖండించారు. తొలినాళ్ల నుంచి దేశ కోసం చేస్తున్న పోరాటంలో కమ్యూనిస్టుల పాత్రను ఈ సందర్భంగా గుర్తు చేశారు. స్వాతంత్ర్య ఉద్యమం నాటి నుంచి ఇప్పటి వరకు కమ్యూనిస్టు పార్టీలు అంతర్గత ప్రజాస్వామ్య పరిరక్షణకు కృషి చేస్తున్నాయన్నారు. ఇకనైనా దేశంలోని అన్ని పార్టీలను కలుపుకొని విదేశీ సమస్యలపరంగా చర్చలు జరిపి ప్రజాస్వామ్య పరిరక్షణకు కృషి చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పి హరినాథ రెడ్డి, సిపిఐ జిల్లా కార్యదర్శ పి మురళి, ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్య మండలి రాష్ట్ర అధ్యక్షులు చిన్నం పెంచులయ్య, సిపిఐ నగర కార్యదర్శ జె విశ్వనాథం పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నరసింహారావు

జులైలో భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర మహాసభ

ప్రజాశక్తి-గుంటూరు

భవన, ఇతర నిర్మాణ కార్మిక సంఘం (సిఐటియు) రాష్ట్ర మహాసభ జులై 23, 24వ తేదీల్లో గుంటూరులో నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.వి నరసింహారావు తెలిపారు. పాత గుంటూరులోని సిఐటియు జిల్లా కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. భవన నిర్మాణ సంక్షేమ బోర్డును పునరుద్ధరిస్తామని, కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేస్తామని ఎన్నికలకు ముందు టిడిపి మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ ఇంత వరకు నెరవేర్చలేదన్నారు. ఇప్పటికైనా సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. సంక్షేమ బోర్డు పునరుద్ధరించాలని కోరుతూ దశలవారీ ఆందోళనలకు ప్రణాళిక రూపొందిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం ఇదే పద్ధతిలో వ్యవహరిస్తే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. గుంటూరులో జరగనున్న రాష్ట్ర మహాసభను విజయవంతం చేయాలని కోరారు. సమావేశానికి బి.సత్యనారాయణ అధ్యక్షత వహించగా యూనియన్ జిల్లా కార్యదర్శి దండా లక్ష్మీనారాయణ, సిఐటియు జిల్లా అధ్యక్షులు బి.లక్ష్మణరావు, తదితరులు పాల్గొన్నారు.

రేషనలైజేషన్‌తో పని ఒత్తిడి

- ఎపి విఆర్ఒల సంఘం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

గ్రామ, వార్డు సచివాలయాల్లో ఉన్న ప్రస్తుతం 14 వేల మంది విఆర్ఒలు ఉండగా, రేషనలైజేషన్ వల్ల ఆ సంఖ్య 7,500కు చేరుతుందని, దీనివల్ల సచివాలయాల్లో విఆర్ఒలపై పనిఒత్తిడి పెరుగుతుందని ఎపి గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం తెలిపింది. ఈ మేరకు సంఘం రాష్ట్ర, అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు భూపతిరాజు రవీంద్రరాజు, ఎం అప్పలనాయుడు ఆదివారం ప్రకటన విడుదల చేశారు. గ్రామ, వార్డు సచివాలయాల వ్యవస్థ రాకు ముందు నుంచి గ్రామ రెవెన్యూ అధికారుల వ్యవస్థ కొనసాగుతుందని, రేషనలైజేషన్ విషయాన్ని రెవెన్యూశాఖలోని సిసిఎల్ఎ, రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శికి సమాచారం ఇవ్వకుండా నిర్ణయం వెల్లడించడం సరైంది కాదని అన్నారు. గ్రామ రెవెన్యూ అధికారుల సంఘంతో చర్చించి ఉద్యోగోన్నతులు కల్పించిన అనంతరమే ఏ నిర్ణయమైనా తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. జిఓ 4పై ప్రభుత్వం పునరాలోచించాలని కోరారు. సచివాలయాల హేతుబద్ధీకరణలో భాగంగా ఒక సచివాలయానికి విఆర్ఒ, మరో సచివాలయానికి సర్వేయర్‌ను కేటాయించడం సరైన విధానం కాదని పేర్కొన్నారు. సంఘంలో చర్చించిన అనంతరం ఈ విషయంలో తదుపరి కార్యాచరణ ప్రకటిస్తామని తెలిపారు.

గుల్జార్ ఘటనపై చంద్రబాబు, జగన్, పవన్ దిగ్భ్రాంతి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

హైదరాబాద్‌లోని చార్మినార్ పరిధి గుల్జార్ హౌస్‌లో జరిగిన అగ్ని ప్రమాదంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. పలువురు దుర్మరణం పాలవడం తనను తీవ్ర దిగ్భ్రాంతి కలిగించిందని ఆదివారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ కూడా ఈ ఘటనపై దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

విద్యాశాఖ కార్యాలయాల ముట్టడిని జయప్రదం చేయండి : ఎస్‌టిఎ

ప్రజాశక్తి-అమరావతి

ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యాన జరగనున్న విద్యాశాఖ కార్యాలయాల ముట్టడిని జయప్రదం చేయాలని స్కూల్ టీచర్స్ అసోసియేషన్ కోరింది. ఈ నెల 21న డిఇఒ కార్యాలయాల వద్ద, 23న విద్యాశాఖ డైరెక్టరేట్ కార్యాలయాల వద్ద జరిగే ఈ కార్యక్రమాల్లో ఉపాధ్యాయులందరూ అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె శ్రీనివాసులు, టి చందనరావు ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. తొమ్మిది రకాల పాఠశాలల వ్యవస్థ గందరగోళంగా ఉందని, విద్యాశాఖ కొత్తగా ఏర్పాటు చేస్తున్న పాఠశాలల పునర్వ్యవస్థీకరణ విధానాన్ని అనేక మంది విద్యార్థుల తల్లిదండ్రులు వ్యతిరేకిస్తున్నారని తెలిపారు. పాత పద్ధతిలో ఉన్న ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల వ్యవస్థలను కొనసాగించాలని కోరారు.

ఉక్కు సమ్మె జయప్రదానికి బైక్ ర్యాలీలు



బైకు ర్యాలీని ఉద్దేశించి మాట్లాడుతున్న సిహెచ్.నర్సింగరావు

ప్రజాశక్తి - గాజువాక, ఉక్కునగరం (విశాఖపట్నం)

వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణను, కార్మికుల తొలగింపులను వ్యతిరేకిస్తూ.. కార్మిక సంఘాల నాయకులకు షోకాజ్ నోటీసులు ఇవ్వడం, సస్పెన్షన్లు విధించడం వంటి నిరంకుశ విధానాలను ఖండిస్తూ ఈ నెల 20 నుంచి స్టీల్ ప్లాంట్‌లో జరిగే కాంట్రాక్టు కార్మికుల నిరవధిక సమ్మెను, 20న జరిగే కాంట్రాక్టు, పర్మినెంట్ కార్మికుల సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ ఉక్కు నిర్వాసిత కాలనీల్లో అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యాన ఆదివారం బైకు ర్యాలీలు నిర్వహించారు. పెదగంట్యాడ జంక్షన్ వద్ద బయలుదేరిన ఓ బైక్ ర్యాలీ అయ్యన్నపాలెం, సిద్దేశ్వరం, కోనవారిపాలెం, అయ్యన్నపాలెం, యాతపాలెం మీదుగా తిరిగి పెదగంట్యాడ జంక్షన్‌కు చేరుకుంది. మరోవైపు అగనంపూడి, దిబ్బపాలెం, కొండయ్యవలస, బిసి కాలనీ, డొంకాడ, వడ్లపూడి, రాసాలమ్మ కాలనీ, కూర్మన్నపాలెం ప్రాంతాల్లోనూ బైకు ర్యాలీలు సాగాయి. పెదగంట్యాడ ప్రాంతంలో జరిగిన కార్యక్రమాన్ని ఉద్దేశించి సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు మాట్లాడుతూ.. సమ్మెలో పర్మినెంట్, కాంట్రాక్టు కార్మికులంతా పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం నిరంకుశంగా వ్యవహరిస్తోందన్నారు. కార్మికులను తొలగించడమే కాకుండా సమావేశం నిర్వహించారన్న కారణంతో గత 40 సంవత్సరాల్లో ఎన్నడూ లేని విధంగా కార్మికులకు షోకాజ్ నోటీసులు ఇవ్వడం దారుణమన్నారు. ఐఎన్‌టియుసి నాయకులు ఎం రాజశేఖర్ మాట్లాడుతూ.. కార్మికులు నిర్బంధాన్ని ఎదిరించి సమ్మెలో పాల్గొంటేనే భవిష్యత్తు బాగుంటుందని తెలిపారు. స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) ప్రధాన కార్యదర్శి యు.రామస్వామి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ఆదేశాలతో ఉక్కు యాజమాన్యం విశాఖపట్నం స్టీల్ ప్లాంట్‌లో అప్రజాస్వామిక చర్యలకు పాల్పడుతోందన్నారు. విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి చైర్మన్ ఎం.జగ్గునాయుడు మాట్లాడుతూ ఉక్కు కార్మికుల సమ్మెకు సంపూర్ణ మద్దతు తెలియజేస్తున్నామన్నారు. కార్మికుల హక్కులను కాలరాస్తే సహించేది లేదని హెచ్చరించారు. బైకు ర్యాలీల్లో స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయీస్ యూనియన్ గౌరవాధ్యక్షులు జె.అయోధ్యరామ్, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్, సీనియర్ నాయకులు ఎన్.రామారావు, శ్రీనివాసరాజు, ఎఐటియుసి నాయకులు డి.ఆదినారాయణ, వైఎస్ఆర్‌టియుసి నాయకులు పిట్టా రెడ్డి, పరదేశి, హెచ్ఎంఎస్ నాయకులు దొమ్మేట అప్పారావు, గణపతిరెడ్డి, స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్టు లేబర్ యూనియన్ నాయకులు నమ్మి రమణ, జి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

స్టీల్ ప్లాంట్ బ్లాస్ట్ ఫర్నేస్ -2లో టిఎల్‌సి లాడెల్‌కు రంధ్రం

- రూ.కోట్ల విలువైన హాట్ మెటల్ నేలపాలు

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)

వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌లోని బ్లాస్ట్ ఫర్నేస్ -2లో టిఎల్‌సి లాడెల్‌కు ఆదివారం రంధ్రం పడడంతో కోట్లాది రూపాయల విలువైన వందలాది టన్నుల హాట్ మెటల్ నేలపాలైంది. ఎలక్ట్రికల్ కేబుళ్లు కాలిపోయాయి. కొంతసేపు ఉత్పత్తికి అంతరాయం ఏర్పడింది. సకాలంలో టిఎల్‌సి లాడెల్ నిర్వహణ చేపట్టకపోవడం, నాణ్యతా లోపం వల్ల ఈ ప్రమాదం జరిగిందని కార్మికులు చెబుతున్నారు. లాడిల్‌కు మరమ్మతులు చేసే ఆర్ఇడి డిపార్టుమెంట్ కార్మికులను తగ్గించి ఆ పనిని కాంట్రాక్టర్లకు అప్పగించడం ప్రమాదానికి కారణమని పేర్కొంటున్నారు. గతంలో ఈ విధంగా జరిగినప్పుడు కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని అనేకసార్లు స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) యాజమాన్యానికి తెలియజేసినప్పటికీ ఎటువంటి చర్యలూ చేపట్టలేదని సంఘం ప్రధాన కార్యదర్శి యు.రామస్వామి, అధ్యక్షులు వైటి.దాస్, గౌరవాధ్యక్షులు అయోధ్యరామ్ గుర్తు చేశారు. భవిష్యత్తులో ఇటువంటివి జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఓ ప్రకటనలో కోరారు.

ఏలూరు జిల్లాలో విషాదం

- జల్లేరు జలాశయంలో మునిగి అన్నదమ్ములు మృతి

ప్రజాశక్తి - బుట్టాయగూడెం (ఏలూరు జిల్లా)



షేక్ సిద్దిక్, షేక్ అబ్దుల్ (ఫైల్)

ఏలూరు జిల్లా బుట్టాయగూడెంలో విషాదం చోటుచేసుకుంది. జల్లేరు జలాశంలో ప్రమాదవశాత్తు మునిగి ఇద్దరు అన్నదమ్ములు మృతి చెందారు. ఈ సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెంకు చెందిన షేక్ అన్వర్, షేక్ పర్వీన్ దంపతులకు షేక్ అబ్దుల్ (10), షేక్ సిద్దిక్ (7) సంతానం. పర్వీన్ తన ఇద్దరు పిల్లలతోపాటు చెల్లెళ్లు షేక్ నగీనా, షేక్ నూర్‌తో కలిసి ఆదివారం జంగారెడ్డిగూడెంలోని బంధువుల ఇంటికి వచ్చారు. అక్కడ నుంచి దొరమామిడి సమీపంలోని జల్లేరు జలాశయం వద్ద సరదాగా గడిపేందుకు వెళ్లారు. డ్యామ్ వద్ద అందరూ కూర్చొని ఉండగా చిన్నారులు నీటిలోకి దిగి మునిగిపోయారు. దీంతో పిల్లలను కాపాడేందుకు తల్లి పర్వీన్, పిన్ని నగీనా నీటిలోకి దిగారు. అప్పటికే పిల్లలిద్దరూ నీటిలో మునిగిపోయారు. జలాశయం వద్ద ఉన్న స్థానికులు గమనించి పర్వీన్, నగీనాను ఒడ్డుకు చేర్చి, పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ దుర్గామహేశ్వరరావు, తన సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని గాలింపు చర్యలు చేపట్టారు. చేపలు పట్టే వల సాయంతో చిన్నారుల మృతదేహాలు బయటకు తీశారు. మృత్యువులోనూ ఒకరి చేతిని ఒకరు పట్టుకుని ఉండడాన్ని చూసి తల్లి పర్వీన్ కన్నీరుమున్నీరయ్యారు. చిన్నారుల మృతదేహాలను బుట్టాయగూడెంలోని ప్రభుత్వ అస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

చిన్నారుల మృతి పట్ల సిఎం విచారం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విజయనగరం, చిత్తూరు జిల్లాలో జరిగిన వేర్వేరు ఘటనల్లో ఏడుగురు చిన్నారులు ప్రాణాలు కోల్పోవడంపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఒకేరోజు రెండు ప్రాంతాల్లో జరిగిన రెండు ప్రమాదాల్లో ఏకంగా ఏడుగురు పసిబిడ్డలు దూరమవ్వడం తనను తీవ్రంగా కలిచివేసిందని ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

చిత్తూరు జిల్లా, కుప్పం మండలం, దేవరాజపురం గ్రామానికి చెందిన ముగ్గురు పిల్లలు ఆడుకుంటూ నీటి కుంటలో పడి ప్రాణాలు కోల్పోయిన ఘటనపై సిఎం విచారం వ్యక్తం చేశారు. బిడ్డల మృతితో తీవ్ర శోకంలో ఉన్న వారి తల్లిదండ్రులకు సానుభూతి తెలిపారు.

విజయనగరం జిల్లా, ద్వారపూడి గ్రామంలో కారు డోర్లు లాక్ పడిన సంఘటనలో నలుగురు చిన్నారులు చనిపోవడంపై సిఎం చంద్రబాబు ఆవేదన వ్యక్తం చేశారు.

ఆ ఘటన తనను తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసిందన్నారు. ఈ మేరకు ఆయన విచారం వ్యక్తం చేశారు. ప్రభుత్వ పరంగా బాధిత కుటుంబాలను ఆదుకుంటామని హామీ ఇచ్చారు.

ఫ్రీహోల్డ్ భూమికి నకిలీ పత్రాలు

- 18 మంది అరెస్టు

ప్రజాశక్తి- పెద్దదోర్నాల (ప్రకాశం జిల్లా)

ఫ్రీహోల్డ్ భూమికి నకిలీ పత్రాలు సృష్టించి రూ.70 లక్షలకు విక్రయించిన ముగ్గురు వ్యక్తులను, అందుకు సహకరించిన 15 మంది రైతులను అరెస్టు చేసినట్లు పెద్దదోర్నాల ఎస్ఐ పి.మహేష్ తెలిపారు. ఆదివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఇందుకు సంబంధించిన వివరాలను ఆయన వెల్లడించారు. ఆయన కథనం ప్రకారం... పెద్దదోర్నాల మండలం కడపరాజుపల్లి గ్రామంలో 73 ఎకరాల ఫ్రీహోల్డ్ భూమికి నకిలీ పత్రాలు సృష్టించి విక్రయించినట్లు గతంలో గ్రామస్తులు జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియాకు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు తహశీల్దార్ శాంతి విచారణ చేపట్టారు. 1985లో ఎన్ఎస్‌పి కాలువ నిర్మాణంలో భూములు కోల్పోయిన రైతులకు ప్రభుత్వం 85 ఎకరాల భూమిని ఇచ్చింది. ఒంగోలు అనుసూయమ్మ, ఆయన బావ గొంగటి పుల్లారెడ్డి ఆ భూములపై కన్నేశారు.

వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణం ప్రారంభం కాగానే భూములకు ధర పలకడంతో ఆ భూమి తమదంటూ వారు భూమిలోకి వచ్చారు. ఫారెస్టు అధికారులు అది ఫారెస్టు భూమి అని అడ్డగించారు. ఈ క్రమంలో 2005లో పుల్లారెడ్డి ఆ భూములు తమవంటూ లోకాయుక్తలో కేసు వేశారు. 2006లో కేసు గెలిచారు. ఎన్ఎస్‌పి భూములు కోల్పోయినప్పుడు ప్రభుత్వం ఇచ్చిన పట్టాలను తమ వద్ద ఉంచుకొని 2020లో పుల్లారెడ్డి వేరే ప్రాంతం వారికి విక్రయించేందుకు అగ్రిమెంట్ చేశారు. అగ్రిమెంట్ చేసుకున్న వారు ఆ భూమిలోకి రాలేదు. ఆ భూములు 2023లో ఫ్రీహోల్డ్ అయ్యాయి. దీంతో, పుల్లారెడ్డి మ్యాచింగ్ ఆధార్‌తో చందవరం, వీరభద్రాపురం, గోళ్లవిడిపి, యర్రగొండపాలెం గ్రామాల్లోని 15 మంది రైతుల పేరుతో నకిలీ పట్టాలు సృష్టించారు. వీరభద్రాపురానికి చెందిన అంకన్న ద్వారా ఒక్కో రైతుకు రూ.30 వేలు ఇప్పించి పామూరుకు చెందిన నరసింహారావు, ప్రశాంతికి రూ.70 లక్షలకు విక్రయించారు. ఈ వ్యవహారంలో పుల్లారెడ్డి కుమారుడు ప్రభాకర్‌రెడ్డి కీలకంగా వ్యవహరించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు తహశీల్దారు విచారణ జరిపి ఎస్ఐకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి నిందితులు పుల్లారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, అంకన్న, చందవరం, వీరభద్రాపురం, గోళ్లవిడిపి, యర్రగొండపాలెం గ్రామాలకు చెందిన మరో 15 మంది రైతులను అరెస్టు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

బావిలోకి దూసుకెళ్లిన కారు

- కర్ణాటక వాసులు ముగ్గురు మృతి

ప్రజాశక్తి-పీలేరు (అన్నమయ్య జిల్లా)

ఓ కారు వ్యవసాయ బావిలోకి దూసుకెళ్లిన ప్రమాదంలో ముగ్గురు మృతి చెందారు. మరో ఇద్దరు గాయపడ్డారు. ఈ ఘటన అన్నమయ్య జిల్లా పీలేరు-సదుం మార్గంలో ఆదివారం చోటు చేసుకుంది. సిఐ తెలిపిన వివరాల మేరకు.. కర్ణాటక రాష్ట్రంలోని చిక్కబళ్లాపూర్ జిల్లా చింతామణి కోలార్ ప్రాంతాలకు చెందిన ఎల్ లోకేష్ (36), సిఎం శివానంద (44), ఎన్ చలపతి (48), సివి సునీల్, జి తిప్పారెడ్డి కలిసి పీలేరులో ఓ శుభకార్యానికి క్యాటరింగ్ పనిపై కారులో బయలుదేరారు. ఆదివారం తెల్లవారుజామున పీలేరు మండలం బాలంవారిపల్లి పంచాయతీ కురవపల్లి సమీపంలోని ఓ మలుపులో ఉన్న వ్యవసాయ బావిలోకి కారు అదుపు తప్పి దూసుకెళ్లింది. పీలేరు సిఐ యుగంధర్, ఎస్ఐలు, పోలీసు సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకుని గ్రామస్తుల సహకారంతో నీరు తోడి, బావిలో నుంచి కారును వెలికి తీశారు. ఈ ఘటనలో లోకేష్, శివానంద, చలపతి మృతి చెందారు. సునీల్, తిప్పారెడ్డి ప్రమాదం నుంచి బయటపడ్డారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను బంధువులకు అప్పగించారు. ఘటన స్థలానికి ఎమ్మెల్యే కిషోర్‌కుమార్‌రెడ్డి చేరుకుని మృతదేహాలను వారి స్వస్థలాలకు తరలించేందుకు ఆర్థిక సాయం అందించారు.

సిట్ విచారణతో జగన్ గుండెల్లో గుబులు

- మంత్రి కొల్లు రవీంద్ర

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా)

ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా గత ఐదేళ్లలో రాష్ట్రంలో మద్యం కుంభకోణం జరిగిందని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. కృష్ణా జిల్లా మచిలీపట్నంలోని టిడిపి కార్యాలయంలో ఆయన ఆదివారం విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ.. ప్రజల ఆరోగ్యాన్ని, ప్రాణాలను హరించి జగన్‌మోహన్‌రెడ్డి తన ఖజానా నింపుకున్నారని, ఈ దోపిడీ మొత్తం సిట్ విచారణలో బయటకు రావడంతో నిందారోపణలకు తెరలేపారని విమర్శించారు. ప్రజలు ఛీత్కరించినా జగన్‌లో మార్పు రాలేదన్నారు. ఆధారాలతో సహా దొరికిపోయిన కేసులో ప్రజలను మభ్యపెట్టేందుకు తన అవినీతి పత్రికను వాడుకుంటున్నారని విమర్శించారు. మద్యం పాలసీల అమలులో తప్పిదాలు జరిగాయంటూ.. పేర్ని నాని మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన మద్యం కుంభకోణంపై సిట్ విచారణలో అక్రమాలన్నీ బయటపడుతున్నాయని తెలిపారు. కేసుల చొప్పున డిస్టలరీల నుండి కమీషన్లు దండుకుని, జాతీయ, అంతర్జాతీయ మద్యం బ్రాండ్లను తరిమేసి తమకు కమీషన్లు ఇచ్చే కల్తీ బ్రాండ్లకు మాత్రమే రాష్ట్రంలో అనుమతించారన్నారు. వాటిని మాత్రమే షాపుల్లో అందుబాటులో ఉంచారని తెలిపారు. ఈ అక్రమాలన్నీ పరిశీలించిన తర్వాతే సిట్ అరెస్టులు చేస్తోందన్నారు. ఇప్పటికైనా పేర్ని నాని మాట్లాడే ముందు ఆలోచించుకుని మాట్లాడాలని, లేకుంటే బందరు ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని మంత్రి కొల్లు రవీంద్ర హెచ్చరించారు.

ఆదివాసీలకు అన్యాయం చేయొద్దు

- ఏజెన్సీ ప్రాంత టీచర్ పోస్టులను వారితోనే భర్తీ చేయాలి : అప్పలనర్స

ప్రజాశక్తి - రాజవొమ్మంగి, పాడేరు టౌన్ (అల్లూరి జిల్లా)

ఉద్యోగాల కల్పనలో ఆదివాసీలకు అన్యాయం చేయొద్దని, ఏజెన్సీ ప్రాంత టీచర్ పోస్టులను గిరిజనులతోనే భర్తీ చేయాలని ఆదివాసీ స్పెషల్ డిఎస్‌సి సాధన కమిటీ సలహాదారు పి అప్పలనర్స డిమాండ్ చేశారు. ఈ నెల 20న జరిగే కేబినెట్ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వం ఈ విషయమై సానుకూల నిర్ణయం తీసుకోవాలని కోరారు. అల్లూరి జిల్లా రాజవొమ్మంగి మండలంలోని ఆర్ అండ్ బి అతిథి గృహం వద్ద ఆదివారం ఆదివాసీ స్పెషల్ డిఎస్‌సి సాధన కమిటీ అనుబంధ సంఘాల సమావేశం జరిగింది. ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోతా రామారావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా అప్పలనర్స హాజరై మాట్లాడారు. ఇటీవల ఏజెన్సీ ప్రాంతాల్లో ఉద్యోగాలను స్థానిక ఆదివాసీలతోనే భర్తీ చేస్తామని సిఎం చంద్రబాబు ప్రకటించడం ఆదివాసీ స్పెషల్ డిఎస్‌సి సాధన కమిటీ పోరాటం ద్వారానే సాధ్యమైందన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అప్పలనర్స

అడ్వకేట్ జనరల్ ఫైనల్ లీగల్ ఒపీనియన్ ఇచ్చినప్పటికీ నూరు శాతం ఉపాధ్యాయ పోస్టుల్లో ఎస్‌టిలకు రిజర్వేషన్ ఉత్తర్వులుపై ప్రభుత్వం జాప్యం చేయడం సరికాదన్నారు. మెగా డిఎస్‌సి నుంచి ఏజెన్సీ ప్రాంత టీచర్ పోస్టులకు మినహాయింపు ఇచ్చి ఆదివాసీ స్పెషల్ డిఎస్‌సి నిర్వహించడానికి ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆదివాసీ చైతన్య సంఘం జిల్లా నాయకులు వెదుల్ల లచ్చిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ వైఖరి ఆదివాసీలకు అన్యాయం చేసేదిగా ఉందన్నారు. కార్యక్రమంలో ఆదివాసీ నాయకులు వంతు బాలకృష్ణ, కొండ్ల సూరిబాబు, గంపా నాగరాజు, ఎంపిపి గోము వెంకటలక్ష్మి, వజ్రపు అప్పారావు, సర్పంచులు దాసరి నాగేశ్వరరావు, ఎస్ చంద్రుడు, భూసరి సత్తిబాబు, కుంజం జగన్నాథం, బి.రామకృష్ణ, పెద్ద సంఖ్యలో గిరిజనులు పాల్గొన్నారు.

నేటి రైల్ రోకో తాత్కాలిక వాయిదా

మెగా డిఎస్‌సిలో ఏజెన్సీ టీచర్ పోస్టులను మినహాయించాలని, ఆదివాసీ స్పెషల్ డిఎస్‌సి ప్రకటించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 19న తలపెట్టిన అరకు రైలు రోకోను తాత్కాలికంగా వాయిదా వేసినట్టు ఆదివాసీ స్పెషల్ డిఎస్‌సి సాధన కమిటీ ఆదివారం రాత్రి ఓ ప్రకటనలో తెలిపింది. సోమవారం రైలు రోకో నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం స్పందించి సాధన కమిటీ సమర్పించిన వినతిపత్రంపై అల్లూరి జిల్లా కలెక్టర్‌ను నివేదిక కోరింది. ఈ క్రమంలో తయారు చేసిన నివేదికపై అల్లూరి జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్, పాడేరు ఐటిడిఎ పిఒ అభిషేక్ గౌడ పాడేరు సబ్ కలెక్టర్ క్యాంపు ఆఫీసులో నివేదికలోని అంశాలపై చర్చించారు. అనంతరం ప్రభుత్వానికి పంపిన నివేదికలోని విషయాలను సాధన కమిటీ నాయకులకు తెలియజేశారు. ఈ నెల 20న జరిగే రాష్ట్ర కేబినెట్‌లో సానుకూల నిర్ణయం రావొచ్చని నాయకులకు తెలిపారు. దీంతో రైలురోకోను తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్టు ఆదివాసీ స్పెషల్ డిఎస్‌సి సాధన కమిటీ ప్రకటించింది.

జేమ్స్‌పై దాడిని ఖండించిన వైఎస్ జగన్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

తిరుపతిలో ఇంజినీరింగ్ దళిత విద్యార్థి జేమ్స్‌పై జరిగిన దాడిని వైసిపి అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీవ్రంగా ఖండించారు. రాష్ట్రంలో దిగజారిపోయిన శాంతిభద్రతలకు, దళితులపై తీవ్రమవుతున్న దాడులకు ఈ ఘటన ఒక ఉదాహరణ అని ఆదివారం ఎక్స్‌లో పేర్కొన్నారు. దళితులు, తమ గొంతు గట్టిగా వినిపించలేని వర్గాల వారికి రాష్ట్రంలో రక్షణ లేకుండా పోయిందని విమర్శించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, అధికార పార్టీ నాయకుల డైరెక్షన్‌లో కక్షసాధింపు చర్యల్లో మునిగితేలుతున్న పోలీస్ యంత్రాంగం.. పౌరులకు రక్షణ కల్పించాల్సిన బాధ్యతను పూర్తిగా విస్మరించడం వల్లే ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. ప్రతిరోజూ ఎక్కడో ఒకచోట దళితులపై దాడులు జరుగుతూనే ఉన్నాయని వివరించారు. పోలీస్ స్టేషన్లకు వెళ్తే న్యాయం జరుగుతుందన్న నమ్మకం పోవడమేకాదు, ఫిర్యాదుదారులపై ఎదురు కేసులు పెట్టడం పరిపాటిగా మారిందని విమర్శించారు. జేమ్స్‌పై దాడి ఘటనలో రాజకీయ జోక్యంతో కనీసం పోలీసులు ఫిర్యాదును కూడా స్వీకరించలేని పరిస్థితి అని పేర్కొన్నారు. ఘటనకు కారకులపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

కేసులు నమోదు చేయాలి: 'జేమ్స్' దాడి ఘటనపై కెవిపిఎస్ డిమాండ్

తిరుపతిలో దళిత విద్యార్థి జేమ్స్‌ను కిడ్నాప్ చేసి హత్యాయత్నానికి పాల్పడిన వారిపై కేసులు నమోదు చేయడంతోపాటు అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని కెవిపిఎస్ డిమాండ్ చేసింది. తిరుపతిలోని విద్యానికేతన్ ఇంజినీరింగ్ కళాశాలలో మూడో సంవత్సరం చదువుతున్న జేమ్స్‌ను చంపేందుకు ప్రయత్నించడం దారుణమైన చర్య అని ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రుయా ఆస్పత్రిలో చేరిన బాధిత విద్యార్థి జేమ్స్‌కు మెరుగైన వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. దాడికి పాల్పడ్డ రౌడీషీటర్ అండ్ గ్యాంగ్‌పై తిరుచానూరు పోలీసులు నామమాత్రపు కేసు నమోదు చేయడం సిగ్గుచేటని పేర్కొన్నారు. కులం పేరుతో దూషించి చంపేందుకు కుట్ర చేసిన వారిపై హత్యాయత్నం, ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

ప్రజాశక్తి-గుత్తి

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య చేసుకున్న సంఘటన అనంతపురం జిల్లా గుత్తి మండలం తొండపాడు గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు... తొండపాడు గ్రామానికి చెందిన గొల్ల మహేంద్ర కుమార్ (40) తనకున్న భూమితో పాటు కౌలుకు భూమిని తీసుకుని వర్షాధారం పంటలుగా వేరుశగన, ఇతర పంటలను సాగు చేసేవారు. పంటల సాగు నిమిత్తం దాదాపు రూ.10 లక్షలు అప్పు చేశారు. పంటల దిగుబడి రాక చేసిన అప్పులు పెరిగిపోవడంతో మనస్తాపం చెందారు. చేసిన అప్పులు తీర్చే మార్గం లేక ఆదివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విజయనగరంలో జెవివి రాష్ట్ర మహాసభ

- సెప్టెంబర్‌లో నిర్వహిస్తాం : గేయానంద్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విజయనగరంలో ఈ ఏడాది సెప్టెంబర్‌లో జన విజ్ఞాన వేదిక (జెవివి) రాష్ట్ర మహాసభ నిర్వహిస్తున్నట్లు జెవివి రాష్ట్ర అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ గేయానంద్ ప్రకటించారు. విజయనగరం జిల్లా పరిషత్తు ప్రాంగణంలోని మినిస్టీరియల్ హాల్లో ఆదివారం జెవివి ఒక్క రోజు శిక్షణ తరగతులకు ఆయన హాజరై మీడియాతో మాట్లాడారు. జెవివిలో విజయనగరం జిల్లా ముఖ్యమైన పాత్ర పోషిస్తోందన్నారు. రానున్న రాష్ట్ర మహాసభ గుర్తుండిపోయే విధంగా పక్కా ప్రణాళికతో నిర్వహించాలని కోరారు. ఈ మహాసభతో రానున్న పదేళ్లపాటు ఉద్యమ ప్రభావం జిల్లాపై ఉండే విధంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. నేడు సమాజంలో శాస్త్రీయ భావజాలం కలిగిన వారి సంఖ్య పెరగాల్సిన అవసరం ఉందన్నారు. బాధ్యత లేకుండా, అశాస్త్రీయ భావజాలంతో ప్రస్తుత పాలకులు దేశాన్ని నడుపుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. స్వతంత్రత నిలుపుకున్న విదేశాంగ విధానం మనదని, కానీ నేడు మోడీ ప్రభుత్వం.. యుద్ధం ఆపానంటూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చెప్పుకునే స్థాయికి దిగజారిందని దుయ్యబట్టారు. రాజకీయ ప్రయోజనాల కోసం యుద్ధాలకు వెళ్తున్నారని విమర్శించారు. అధికారం కోసం మత విద్వేషాలు రెచ్చగొడుతున్నారని, ఇది సైన్స్‌ను దెబ్బతీసే చర్యని అన్నారు. ఈ నేపథ్యంలో దేశం కోసం మాట్లాడే వారి సంఖ్య పెంచుకోవాల్సిన అవసరం ఉందని, జెవివి లాంటి సంస్థలే అందులో కీలకంగా వ్యవహరించాలని తెలిపారు. జెవివి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుర్రా రామారావు మాట్లాడుతూ జెవివిని జిల్లాలో, రాష్ట్రంలో మరింత బలోపేతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సమతా విభాగం రాష్ట్ర కన్వీనర్ జి నిర్మల, రాష్ట్ర నాయకులు రాజగోపాల్, జెవివి జిల్లా గౌరవాధ్యక్షులు నీలయ్య, జిల్లా అధ్యక్షులు ఎంవిఎన్ వెంకటరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి రమణ ప్రభాత్, విశాఖ జిల్లా అధ్యక్షులు పరశురాం, పూర్వ రాష్ట్ర కార్యదర్శి మురళీధర్ తదితరులు పాల్గొన్నారు.



మురళీనాయక్ తల్లిదండ్రులతో మాట్లాడుతున్న మహారాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి సంజయ్ రాథోడ్

వీర జవానుకు మహారాష్ట్ర మంత్రి నివాళి

- తల్లిదండ్రులకు పరామర్శ

ప్రజాశక్తి-గోరంట్ల (శ్రీ సత్యసాయి జిల్లా)

ఇటీవల భారత్ - పాకిస్తాన్ కాల్పుల్లో జవాను మురళీనాయక్ మృతి చెందడంతో ఆయన తల్లిదండ్రులను మహారాష్ట్ర నీటి పారుదలశాఖ మంత్రి సంజయ్ రాథోడ్ పరామర్శించారు. శ్రీసత్యసాయి జిల్లా గోరంట్ల మండలం కల్లితండాకు మంత్రి సంజయ్ రాథోడ్ ఆదివారం వచ్చారు. బెంగుళూరు నుంచి కల్లితండాకు చేరుకున్న ఆయన నేరుగా మురళీనాయక్‌కు అంత్యక్రియలు నిర్వహించిన ప్రాంతానికి వెళ్లి నివాళులర్పించారు. అనంతరం మురళీ నాయక్ తల్లిదండ్రులు శంకర్ నాయక్, జ్యోతిబాయిలను పరామర్శించి ఓదార్చారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. పాకిస్తాన్ కాల్పుల్లో వీరమరణం పొందిన మురళీ నాయక్‌కు కేంద్ర ప్రభుత్వం పరమవీరచక్ర ఇవ్వాలని మహారాష్ట్ర ప్రభుత్వం తరపున డిమాండ్ చేస్తామని తెలిపారు. మురళీ నాయక్ కుటుంబానికి తమ రాష్ట్రం తరపున అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. ఆయన వెంట జడ్‌పిటిసి సభ్యులు జయరాం నాయక్, గ్రామ సర్పంచ్ వాసునాయక్, తదితరులు ఉన్నారు.

డిఎస్సీ ప్రత్యేకం-ఎస్ఎ/ఎస్జిటి



ఎ.ఉమామహేశ్వరరావు
ఎమ్మెస్సీ, బిఇడి, జీవశాస్త్రం సబ్జెక్టు నిపుణులు, తెనాలి.
సెల్ : 9985288150

వ్యాధి విజ్ఞాన శాస్త్రం



వ్యాధులు - ప్రాథమిక అంశాలు (బేసిక్ కాన్సెప్ట్స్ ఫర్ డిసీజెస్)

- దీని అధ్యయనం - **పాథాలజీ.**
- అంటువ్యాధుల అధ్యయనం - **ఎపిడెమియాలజీ.**
- వ్యాధి లక్షణాల అధ్యయనం - **సింప్టమాలజీ.**
- గాయాల అధ్యయనం - **ట్రైమటాలజీ.**
- వ్యాధి నిర్ధారణ - **డయాగ్నోసిస్.**
- వ్యాధి నిరోధక శక్తి / అసంక్రామ్యత అధ్యయనం - **ఇమ్యునాలజీ.**
- వ్యాధి నిరోధక శక్తిని పెంపొందించే కణాలు - **లింఫోసైట్లు.**
- ఇవి యాంటీబాడీస్ ను ఉత్పత్తి చేసి ఈ శక్తిని పెంచును.

వాక్సిన్ / టీకా :

- నిర్వీర్యం చెందిన (లేదా) క్రియారహిత సూక్ష్మజీవులు కల మందులనే 'వ్యాక్సిన్' అంటారు.
- ఇవి శరీరంలో యాంటీబాడీస్ ఉత్పత్తిని ప్రేరేపించి వ్యాధి నిరోధక శక్తిని కృత్రిమంగా పెంచుతాయి.
- ప్రపంచంలో మొదటిసారిగా కనుగొన్న వాక్సిన్ - **స్మాల్‌పాక్స్ (మశూచి)**
  దీనిని కనుగొన్నది - **ఎడ్వర్డ్ జెన్నర్ (1796).**
- ఇతనిని 'ఫాదర్ ఆఫ్ ఇమ్యూనిటీ' అంటారు.

1.వ్యాధి :

- సాధారణంగా జరిగే జీవక్రియలకు తాత్కాలికంగా గానీ, శాశ్వతంగా గాని అవరోధం ఏర్పడడాన్ని "వ్యాధి" అంటారు.

2. అంటువ్యాధి (కమ్యూనలకేబుల్ డిసీజ్) :

- ఒక ప్రదేశం నుండి మరొక ప్రదేశానికి లేదా ఒక వ్యక్తి నుండి మరొక వ్యక్తికి వ్యాప్తి చెందే వ్యాధులను 'అంటువ్యాధులు' అంటారు. **ఉదా :** బ్యాక్టీరియా, వైరస్ వ్యాధులు మొ॥

3.ఎండమిక్ వ్యాధి :

- ఒక నిర్దిష్ట ప్రదేశంలో గానీ, ఒక నిర్దిష్ట సమూహపు ప్రజల్లోగానీ తరుచుగా వ్యాప్తి చెందే వ్యాధి. ఉదా : మలేరియా,

4.ఎపిడమిక్ వ్యాధి (మహమ్మారి) :

- ఒక నిర్దిష్టమైన సమాజంలో, నిర్దిష్ట సమయంలో అత్యధిక ప్రజలు వ్యాధి భారినపడడం
  ఉదా : కలరా, తట్టు, అతినిద్ర వ్యాధి.

5. పాండమిక్ వ్యాధి:

దేశం మొత్తం గానీ, ప్రపంచమంతా గాని విస్తరించే వ్యాధి.

ఉదా : స్వైన్ ఫ్లూ, ఎబోలా.

6.వ్యాధి జనకం (పాతోజెన్) :

- వ్యాధిని కలిగించే జీవిని 'వ్యాధిజనకం'అంటారు.
  ఉదా : వైరస్, బ్యాక్టీరియా, ప్రోటోజోవా మొ॥

7.అతిథేయి (హోస్ట్) : వ్యాధిజనకం అభివృద్ధి చెందడానికి ఆవాసాన్ని కల్పించి నష్టపోయే జీవిని అతిథేయి అంటారు.

ఉదా : కలరాకు మానవుడు అతిథేయి, టైఫాయిడ్ - మానవుడు.

8. వ్యాధి జనకత్వం (పాతోజెనిసిటీ) : వ్యాధిజనకం అతిథేయిలోకి ప్రవేశించి స్థావరమేర్పరుచుకున్న తర్వాత ఆ రెండింటికి సంఘర్షణ జరిగి ఫలితంగా వ్యాధి లక్షణాలు బయట పడటాన్ని 'వ్యాధి జనకత్వం' అంటారు.

9. వాహకం (వెక్టార్) : వ్యాధి జనకాలను ఒక ప్రదేశం నుండి మరొక ప్రదేశం లోకి వ్యాప్తి చెందించే జీవులు "వాహకాలు".

ఉదా : మలేరియాను కలిగించే ప్లాస్మోడియంకు వాహకం ఆడ అనాఫిలస్ దోమ, డెంగ్యూను కలిగించే ఫ్లావివైరస్కు వాహకం ఆడ ఏడిస్ దోమ.

- వ్యాధి జనక జీవులను వాహకాలు తమ శరీరంలో ఉంచుకున్నా వాటికి ఎలాంటి అస్వస్థత కలగదు.

10. ఆశ్రయం (రిజర్వాయర్) : వాహకాలు అందుబాటులో లేనపుడు వ్యాధి జనకం తాత్కాలికంగా ఆవాసాన్ని పొందే జీవి..

ఉదా : మెదడువాపును కల్గించే ఆర్బోవైరస్ ఆశ్రయం - పంది, చికెన్‌గున్యాను కలిగించే ఆల్ఫావైరస్ ఆశ్రయం - కోతులు, చింపాంజీ.

11. న్యూనతా వ్యాధులు (డిఫ్లెన్సీ డిసీజెస్)

- పోషక పదార్థాల లోపం వల్ల కలిగే వ్యాధులు
- అయోడిన్ లోపం వల్ల - గాయిటర్.
- ప్రోటీన్స్ లోపం వల్ల - క్యాషియోర్కర్
- ప్రోటీన్, కేలరీలు రెండింటి లోపంవల్ల - మెరాస్మస్

12. జన్యుసంబంధ వ్యాధులు : ప్రపంచంలోని ప్రతిజీవిలోని లక్షణాన్ని ప్రభావితం చేసే ప్రమాణాన్ని 'జన్యువు' అంటారు.

ఉదా : జీవి పొడవు, రంగు మొ॥

- ఈ జన్యువులో ఉత్పరివర్తనం (మార్పు) కలగడం వల్ల అది ప్రభావితం చేసే లక్షణంలో కూడా మార్పు సంభవించి వ్యాధులు వచ్చును. వీటినే 'జన్య సంబంధ వ్యాధులు' అంటారు.
  ఉదా : హీమోఫీలియా, వర్ణాంధత్వం మొ॥

13.డీజెనరేటివ్ వ్యాధి :

- వయస్సు పెరగడం వల్ల వచ్చే వ్యాధులు.
  ఉదా : డయాబెటిస్, గుండెపోటు, ఆర్థరైటిస్ మొ॥

14. ఎలర్జీ :

- ఏదైనా ఒక జీవి / కారకం వల్ల శరీరం సున్నితంగా వ్యవహరించడాన్ని 'ఎలర్జీ' అంటారు.
- దీనికి కారణమయ్యే జీవిని కాని కారకాన్ని 'ఎలర్జిన్' అంటారు.
- కొంతమందికి వివిధ కూరగాయల వల్ల, సెంట్, గోర్లపెయింట్, మొక్కల పరాగరేణువుల వల్ల ఎలర్జీ కల్గుతుంది. ఉదా : పార్థీనియం (కాంగ్రెస్ గడ్డి) అనే మొక్క పరాగ రేణువుల వల్ల శ్వాస సంబంధ 'హేఫీవర్' అనే ఎలర్జీ కల్గుతుంది.

15. స్వల్పకాలిక వ్యాధి (అక్యూట్):

- ఇది స్వల్పకాలం మాత్రమే ఉండే తీవ్ర అస్వస్థత కల్గించడం. **ఉదా : సోర్ త్రోట్.**

16.దీర్ఘకాలిక వ్యాధి (క్రానిక్) :

- ఇది దీర్ఘకాలం ఉండి అస్వస్థత కల్గించును. **ఉదా : క్షయ.**

గాలి ద్వారా వ్యాప్తి చెందే వ్యాధులు :

ఇవి దగ్గినపుడు, తుమ్మినపుడు ఒక వ్యక్తి నుండి ఇంకొక వ్యక్తికి వ్యాప్తి చెందుతాయి. ఇవన్నీ శ్వాసవ్యవస్థ (ఊపిరితిత్తులు) పై ప్రభావం చూపుతాయి.

1.జలుబు (కోల్డ్)
2.ఆటలమ్మ (చికెన్‌పాక్స్)
3.ఫ్లూ (ఇన్‌ఫ్లూయెంజా)–1.బర్డ్‌ఫ్లూ 2.స్వైన్‌ఫ్లూ
4.మశూచి (స్మాల్‌పాక్స్)
5.తట్టు (మీస్‌లెస్)
6.న్యూమోనియా
7.డిఫ్తీరియా
8.పెర్టుసిస్ (కోరింతదగ్గు)
9.క్షయ (టిబి)
10.ఎస్ఎఆర్ఎస్
11.ఆంత్రాక్స్.

కలుషిత ఆహారం, నీటి ద్వారా వ్యాప్తి చెందే వ్యాధులు :

- వీటి ద్వారా వ్యాప్తి చెందే విధానాన్ని 'కంటామినేషన్' అంటారు.
- ఇవన్నీ జీర్ణవ్యవస్థకు సంబంధించినవి.
- వీటి ప్రభావం చిన్నపేగుపై ఉంటుంది.
- వీటిని నిర్మూలించాలంటే శుభ్రమైన ఆహారాన్ని కాచి చల్లార్చి వడపోయబడిన సురక్షిత నీటిని తీసుకోవాలి.
  వ్యాప్తి చెందే వ్యాధులు :

1.కలరా
2. టైఫాయిడ్
3.అమీబియాసిస్ (రక్త విరేచనాలు)
4. ఆస్కారియాసిస్
5.పోలియో (శిశుపక్షవాతం)
6. డయేరియా (అతిసారం)
7. హెపటైటిస్ (పచ్చ కామెర్లు)
8. మేడ్కో
9. డీసెంట్రీ
10.ఆంత్రాక్స్

దోమల ద్వారా వ్యాప్తి:



- వీటిని నిర్మూలించాలంటే పరిసరాలను శుభ్రంగా ఉంచాలి. నీరు నిల్వ ఉండరాదు.
- పొగ కొట్టాలి. (ఫ్యూమిగేషన్).
- దోమతెరలు వాడాలి.
  అదేవిధంగా పౌడర్‌ను (డిడిటి) చల్లాలి.

డిడిటి : డైక్లోరో డైఫినైల్ ట్రైక్లోరో ఈథేన్.

- ఇది ప్రపంచంలో మొదటి కీటకనాశిని
- దీనిని తయారుచేసింది 'పాల్ ముల్లర్' (1937).
- దీనివల్ల నేల కాలుష్యం పెరుగుతుంది. జంతువుల కేంద్ర నాడీ వ్యవస్థపై ప్రభావం చూపుతుంది. ప్రస్తుతం నిషేధించబడింది. మొదట యుఎస్ వారు 1972లో నిషేధించారు.

దోమ	జ్వరం
1.ఆడ ఎనాఫిలిస్	మలేరియా (చలిజ్వరం)
2.ఆడ క్యూలెక్స్	1.ఫైలేరియా (బోధకాలు) 2. జపనీస్ ఎన్సెఫలైటిస్ (మెదడువాపు)
3.ఆడ ఏడిస్	1. చికెన్ గున్యా 2.డెంగ్యూ

నోట్ : మగదోమల నోటిలో హనువులు, జంభికలు ఉండవు. అందువల్ల చెట్ల రసాలను పీల్చుతాయి. ఆడదోమలు గుడ్ల తయారీకి కావాల్సిన ప్రోటీన్లను 'రక్తం' త్రాగడం ద్వారా తయారు చేసుకుంటుంది.

ఈగల ద్వారా వ్యాప్తి:



- ఇవి ఆహారాన్ని కలుషితం చేస్తాయి.
  1.సీ-సీ ఈగ : అతినిద్రావ్యాధి
  2.సాండ్‌ఫ్లై: కాలా అజార్ (బ్లాక్‌ఫీవర్)
  3.రాట్ ఫ్లై : ప్లేగు
  4.కలరా
  5. టైఫాయిడ్
  6.డీసెంట్రీ
  7.పోలియో

పోషకాహార లోప వ్యాధులు :

ఈ వ్యాధులను 3 రకాలుగా వర్గీకరించొచ్చు

1. కేలరీ పోషకాహార లోపం : కార్బోహైడ్రేట్లు, కొవ్వుల లోపం వల్ల కలిగేది.
2. ప్రోటీన్ పోషకాహార లోపం : ప్రోటీన్ల లోపం వల్ల కలిగేది. ఉదా: కాసియోరీస్.
3. ప్రోటీన్- కేలరీ పోషకాహార లోపం: ప్రోటీన్లు, కార్బోహైడ్రేట్లు, కొవ్వుల లోపం వల్ల కలిగేది. ఉదా: మెరాస్మస్

1. క్వాషియార్కర్ :

క్వాషియార్కర్ అంటే ఆఫ్రికా భాషలో 'నిర్లక్ష్యం చేయబడిన శిశువు' (డిప్లేస్డ్ చైల్డ్) అని అర్థం.

- పుట్టిన తర్వాత తల్లి పాలివ్వడం మానెయ్యడం వల్ల వెంట్రుకలు ఎర్రగా, నీరు పేరుకుపోయి, బలహీనంగా మారతాయి. ఇది ముఖ్యంగా ప్రోటీన్ల లోప వ్యాధి.

2.మెరాస్మస్: సిపిఎఫ్ లోపం వల్ల కలిగే వ్యాధి. దీని వల్ల ఉండే శరీరబరువు కన్నా 40 శాతం తక్కువగా, చికాకుగా ఉంటారు. పక్కటెముకలు ప్రస్ఫుటంగా కనిపించడంతోపాటు చర్మం పొడిగా వేలాడుతూ ముడతలు పడి ఉంటుంది.

3. స్థూలకాయత్వం (ఒబేసిటీ) : శక్తినిచ్చే పదార్థాలైన పిండిపదార్థాలు, కొవ్వులను అధికంగా ఆహారంగా తీసుకొని పని తక్కువగా చేసే వ్యక్తులలో ఈ సమస్య కల్గుతుంది. దీనివల్ల మామూలు బరువు కన్నా పిల్లలు 20శాతం ఎక్కువ బరువును కలిగి ఉంటారు. ఇది ఒక వ్యాధికాదు. పోషకాహార సమస్య మాత్రమే.

దీని వలన నష్టాలు : హార్ట్ ఎటాక్, హైబీపీ, హెపటైటిస్ (పచ్చకామెర్లు)

హెల్మెంథిస్ వ్యాధులు :



1.టీనియాసిస్ : టీనియాసోలియం (బద్దెపురుగు) వలన కలుగును.

- ఇది పంది మాంసం (ఫోర్క్) ద్వారా మానవునిలోకి ప్రవేశించును.
  దీని ద్వారా అలసట, బలహీనత, జ్వరం కలుగును.

2. ఫైలేరియా / బోధకాలు (ఎలిఫెంటియాసిస్) :

- దీనిని కలిగించే జీవులు - ఉకరేరియా బ్రాంక్రాఫ్టి (ఇండియా), ఉకరేరియా మలాయి (మలేషియా),
- ఇది చేతులు, కాళ్ళలోని లింఫ్ / శోషరస గ్రంథులకు ఇన్ఫెక్షన్ కలిగించడం వల్ల ఆ భాగాలు ఏనుగు కాలు వలె మారును.
- **దీనికి ఇచ్చే మందు :** డిఇసి (డిఇథైల్ కార్బోమైజిన్)
- ఈ జీవి మైక్రోఫైలేరియా అనే లార్వాను ఉత్పత్తి చేస్తుంది. ఇవి శోత్పాదకం
- ఈ లార్వా మానవ శరీరం మొత్తం తిరిగి రావడానికి పట్టు కాలం 10 రోజులు.

లార్వా చలనం :

రక్తం (పేగు) - కాలేయం - గుండె- గొంతు - నోరు - గుండె **- కాలేయం.**

- ఈ లార్వా పగటి సమయంలో శరీర లోపలి రక్తనాళాల్లో, రాత్రి సమయంలో శరీరం బయటి రక్తనాళాల్లో ఉండడం వల్ల దోమలు కాటు వేసినప్పుడు దోమలోకి ప్రవేశించును.
- దోమ ఆహార నాళంలో ఈ లార్వాను ఆవరిస్తూ ఉండే మూడు తొడుగులు మూడు నిర్మోచనాలు వల్ల కోల్పోవును
  నోట్ : దోమకు మానవునికి సాంక్రమిక దశ **- మైక్రో ఫైలేరియా.**

3.అస్కారియాసిస్ : అస్కారిస్ (ఏలికపాము / నులిపురుగు) నట్టలు.

- ఇది పేగులో నివసించి రోజుకు 2 లక్షల గుడ్లను పెట్టడం వల్ల ఆహార రవాణాకు అడ్డుపడును. తద్వారా పోషకాహార లోపం కలుగును. ఇది ఎక్కువగా చిన్న పిల్లల్లో కనబడును.
  నోట్ 1.హెల్మెంథిస్ వ్యాధులకు యాంటీహాల్మెంతల్ ఔషధాలు వాడాలి.

రేపు : ఉష్ణమండల వ్యాధులు

వాక్సిన్ పేరు	వ్యాధి	కనుగొన్న శాస్త్రవేత్త
1.స్మాల్ పాక్స్	మశూచి	ఎడ్వర్డ్ జెన్నర్
2. బి.సి.జి (బాసిల్లస్ కాల్మెట్ గురైన్)	క్షయ (టిబి)	కాల్మెట్, గురైన్
3. పోలియో వాక్సిన్ (డ్రాప్స్)	పోలియో	సాబిన్
4. పోలియో వాక్సిన్ (ఇంజక్షన్)	పోలియో	జోనాస్ సాల్క్
5. తట్టు (మీసెల్స్)	తట్టు	జాన్ ఎండర్స్
6. సాన్‌వాక్ (సాన్‌వాక్)	హైపటైటిస్	శాంతాబయోటెక్ (హైదరాబాద్)
7. కలరా	కలరా	లూయూపాశ్చర్
8. ఆంత్రాక్స్	ఆంత్రాక్స్	లూయిపాశ్చర్
9. రేబీస్ (హైడ్రోఫోబ్లా)	రేబిస్	లూయి పాశ్చర్
10. డిపిటి	డిఫ్తీరియా, పెర్టుసిస్, టెటానస్	వాన్ బెల్మింగ్, కిటసాటో

ప్రజాశక్తి
www.prajasakti.com
facebook/prajasakti, twitter/prajasakti

అక్షరం

4 | విజయవాడ
సోమవారం 19 మే 2025

నూతన రాజకీయ సంస్కృతికి నిలువుటద్దం సుందరయ్య

వి.శ్రీనివాసరావు



నేడు సుందరయ్య వర్ధంతి

రాష్ట్రంలో అత్యంత ఆదర్శవంతమైన నాయకుల్లో అగ్రగామి పుచ్చలపల్లి సుందరయ్య. రాజకీయ విబేధాలతో నిమిత్తం లేకుండా ఆయనను అభిమానించేవారు రాష్ట్రంలో కమ్యూనిస్టు ఉద్యమంలోనూ, వెలుపల కోకొల్లలుగా ఉన్నారు. జాతీయ స్థాయిలో సైతం యవ్వనంలోనే ఉన్నత విలువలు పాటించి నెహ్రూ లాంటి వారి అభిమానాన్ని సైతం చూరగొన్న వ్యక్తి. తనతో రాజకీయంగా విబేధించేవారిని సైతం ఆయన గౌరవించేవారు. తెలంగాణా రైతాంగ సాయుధ పోరాటానికి ప్రత్యక్ష సారధ్యం వహించిన సుందరయ్య భారతదేశ విముక్తికి మార్గం చూపారు. సిద్ధాంతాన్ని ఆచరణతో మేళవించగలిగిన ఆయన శక్తి సామర్థ్యాలను గుర్తించిన సిపిఐ(యం) ప్రథమ ప్రధాన కార్యదర్శిగా ఆయన్ను ఎన్నుకున్నది. భ్రష్టు పట్టిన నేటి రాజకీయ వ్యవస్థలో ఉన్నత విలువలు గల సుందరయ్య గారి లాంటివారు మరలా ఎదిగివస్తేనే వ్యవస్థ ప్రక్షాళన అవుతుంది. కమ్యూనిస్టు ఉద్యమం, వర్గ పోరాటాలు మాత్రమే అలాంటి వ్యక్తుల్ని సృష్టించగలుగుతాయి. సంక్షోభంలో కూరుకుపోతున్న పెట్టుబడిదారీ వ్యవస్థ ఫలితంగానే రాజకీయ విలువలు సైతం దిగజారిపోతున్నాయి. కమ్యూనిస్టు ఉద్యమం బలహీనపడిన నేపథ్యంలో అత్యంత లాభదాయకమైన వ్యాపారంగా రాజకీయాలు మారిపోయాయి. సమాజాన్ని ఎదుర్కొంటున్న ఈ పెడధోరణులు కమ్యూనిస్టు ఉద్యమాల్లోకి సైతం ప్రవేశించాయి. అటువంటి ధోరణుల్ని చూసి, బూర్జువా పార్టీలకు, కమ్యూనిస్టు పార్టీలకు తేడా లేదని పార్టీ అభిమానులు కొందరు బాధపడుతున్నారు. సోవియట్ పతనానంతరం ప్రపంచవ్యాపితంగా కమ్యూనిస్టు ఉద్యమం బలహీనపడడం, వర్గ పోరాటాలు వెనుకపట్టు పట్టటంతో సమాజంలో సైద్ధాంతిక క్షీణత ఏర్పడింది. మార్కెట్ ఆలోచన విధానం, అస్తిత్వ రాజకీయాలు, మతోన్మాదం, ఫాసిస్టు ధోరణులు పెరుగుతున్నాయి. లౌకిక, ప్రజాతంత్ర పార్టీలను సైతం ఇవి ఆవహించాయి. ఫలితంగా మతోన్మాద రాజకీయాలు పుంజుకుంటున్నాయి. కార్పొరేట్ దోపిడీకి దానిని సాధనంగా వాడుకుంటున్నారు. మోడీ అధికారంలోకి వచ్చాక కార్పొరేట్ మతోన్మాద అపవిత్ర కూటమి రాజ్యమేలుతున్నది. క్రమంగా ప్రజాస్వామిక హక్కులు, పార్లమెంటరీ వ్యవస్థ బలహీనపడుతున్నాయి. రాజ్యాంగంపైనే దాడి జరుగుతున్నది. సుప్రీం కోర్టు పరిధిని సైతం ప్రభుత్వమే ప్రశ్నిస్తున్న స్థితి నెలకొన్నది. అమెరికన్ సామ్రాజ్యవాదానికి దేశ అంతర్గత వ్యవహారాల్లో బహిరంగంగా జోక్యం చేసుకునే దమ్ము వచ్చింది. పెహల్గాం ఘటన అనంతరం ఆపరేషన్ సింధూర అకస్మాత్‌గా ఉపసంహరించుకోవడం వెనుక ట్రంప్ హస్తం ఉందన్నది బహిరంగ రహస్యమే! యుద్ధోన్మాదాన్ని రెచ్చగొట్టింది వారే, అమెరికా హుకుంలకు లొంగిపోయిందీ వారే!

నిబద్ధత కలిగిన అసాధారణ వ్యక్తిత్వం

200 సంవత్సరాల బ్రిటిష్ వలస పాలనకు వ్యతిరేకంగా సాగిన పోరాట ఫలితంగా మనం స్వాతంత్ర్యాన్ని సంపాదించుకున్నాం. ఆ పోరాట విలువల్లోనుంచే సుందరయ్య లాంటి మహనీయులు రాజకీయాల్లో అడుగు పెట్టారు. సమాజం కోసం త్యాగం చేయటం; ప్రజల పట్ల నమ్రత, నమ్మకం, పోరాటాల పట్ల నిబద్ధత, మార్క్సిస్టు సిద్ధాంతం పట్ల అచంచల విశ్వాసం ఆయన వ్యక్తిత్వాన్ని రూపుదిద్దాయి. ఆయనలాగే స్వాతంత్ర్యోద్యమంలో జవహర్‌లాల్ నెహ్రూ, సుభాష్ చంద్రబోస్, జయప్రకాష్ నారాయణ, భగత్‌సింగ్, రవీంద్రనాథ్ ఠాగూర్ లాంటి అనేకమంది సోషలిస్టు సోవియట్ యూనియన్‌తో ప్రభావితమయ్యారు. సుందరయ్య, ఇఎంఎస్, చండ్ర రాజేశ్వరరావు లాంటి వారు కమ్యూనిస్టు పార్టీలో ప్రవేశించారు. కాంగ్రెస్ పార్టీ సైతం సోషలిజాన్ని లక్ష్యంగా ప్రకటించుకుంది. రాజ్యాంగ పీఠికలో అది అంతర్భాగమైంది. స్వాతంత్ర్యోద్యమంతో ఏమాత్రం సంబంధం లేని బిజెపి ఆనాటి విలువలను తిరోగమనం పట్టిస్తున్నది. స్వాతంత్ర్యోద్యమానికి వెన్నుపోటు పొడిచిన ఆర్‌ఎస్‌ఎస్ నడిపే బిజెపికి స్వాతంత్ర్యోద్యమ నాయకులన్నా, కమ్యూనిస్టు పార్టీలన్నా జెర్రెలు పాకినట్టుంటుంది. చరిత్రను వక్రీకరించడం ద్వారా మతోన్మాద విలువలను కొత్త తరంపై రుద్దుతున్నది. స్వాతంత్ర్యానంతరం నిర్మించిన పెట్టుబడిదారీ వ్యవస్థ సమాజంలో అసమానత్వాన్ని పెంచింది. ఫలితంగా పెల్లుబికిన అసంతృప్తిలోనుంచి మతోన్మాదంలాంటి విషబీజాలు పుట్టుకొచ్చాయి. కమ్యూనిస్టు ఉద్యమం బలహీనపడిన స్థితిలో ప్రత్యామ్నాయం కోసం చూసే కొత్త తరం మతోన్మాదం వైపు మొగ్గు చూపింది. దాని దుష్ఫలితాలను నేడు దేశం అనుభవిస్తున్నది. మోడీపై నమ్మకంతో ఓట్లేసిన నవతరం ఓటర్లలో క్రమంగా విశ్వాసం సన్నగిల్లుతోంది. దానిని పునరుద్ధరించుకోడానికి మోడీ నానా తంటాలు పడుతున్న సమయంలో ఉగ్రవాదులు పెహల్గాంలో దాడి చేసి, మతోన్మాదులకు ఒక ఆయుధాన్ని అందించారు. దేశంలో హిందూ- ముస్లిం విభజన తీసుకురావాలనుకున్న ఉగ్రవాదుల కుట్రలకు మతోన్మాదం ఆజ్యం పోస్తున్నది. ఈ స్థితిలో మత సామరస్యం, దేశ సమైక్యతను కాపాడుకోవడం దేశం ముందున్న అత్యంత ప్రాధాన్యత కలిగిన రాజకీయ కర్తవ్యం అవుతుంది.

సోషలిజంతోనే నూతన సమాజం


రాజకీయ విలువలు దిగజారిపోయి కుళ్లి కంపుకొడుతున్న వ్యవస్థకు నూతన రాజకీయ విలువలు కలిగిన సమ సమాజ స్థాపనే ప్రత్యామ్నాయం అవుతుంది. అలాంటి వ్యవస్థ సోషలిజంతోనే సాధ్యం. పెట్టుబడిదారీ వ్యవస్థ సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్న స్థితిలో యువతరం సోషలిజం వైపు మరోసారి దృష్టి సారిస్తున్నది. సామ్రాజ్యవాద దిగ్గజం అమెరికాలో సైతం యువత అభ్యుదయ రాజకీయాల దిశగా ఆలోచన మళ్లిస్తున్నది. ఒకప్పుడు కమ్యూనిజాన్ని పాతాళంలోకి తొక్కిపడేశామని అమెరికా ఏక ఛత్రాధిపత్యానికి తిరుగులేదని నమ్మిన పాలకులు నేడు ఆ అమెరికా చేతిలోనే పరాభవానికి గురవుతుండగా, మనదేశంలోని యువత సైతం పునరాలోచనలో పడుతోంది. కమ్యూనిస్టులే తమకు ప్రధాన శత్రువులని ట్రంప్ ప్రకటించడం మారుతున్న పరిస్థితులకు అద్దం పడుతున్నది. ఈ స్థితిలో నేడున్న ఈ వ్యవస్థను ఈ రూపంలో ఇంకా ఎంతో కాలం కొనసాగించలేరు. దానిని మార్చడానికి యువతరాన్ని కదిలించాల్సిన బాధ్యత వామపక్ష, ప్రజాతంత్ర ఉద్యమాలపైనే ఉంది. సుందరయ్య స్ఫూర్తి అందుకు దోహదం చేస్తుందనడంలో సందేహం లేదు.

సుందరయ్యగారితో నా పరిచయం

1975 ఎమర్జెన్సీకి ముందు విద్యార్థి ఉద్యమాల ద్వారా రాజకీయాలకు పరిచయమైన తొలి రోజుల్లో సుందరయ్య పేరును నేను మొదటిసారి విన్నాను. ఆయనకన్నా ముందు వారి సోదరుడు డా॥ పుచ్చలపల్లి రామచంద్రారెడ్డి (రామ్) పేరుతో నాకు పరిచయం ఏర్పడింది. మా నాన్న ఆయన దగ్గరే శిష్యరికం చేసి ఆర్‌ఎంపి డాక్టర్‌గా ప్రాక్టీస్ చేశారు. ఆ సమయంలోనే డా॥ రామ్ గురించి వింటుండేవాడిని. నెల్లూరు జిల్లాలో విద్యార్థి, యువజనోద్యమాల్లో పనిచేస్తుండగా సుందరయ్య సభలకు, సమావేశాలకు హాజరయ్యేవాడిని. మా సహచరులు చెప్పే మాటల ద్వారా ఆయన ఉన్నత విలువలు అర్థమయ్యేవి. ఎమర్జెన్సీ అనంతరం 1977 ఎన్నికల్లో ఇందిరాగాంధీ ఓడిపోయిన తరువాత నాలాంటి యువతీయువకులకు రాజకీయ తరగతులు నిర్వహించారు. నెల్లూరులో జరిగిన అలాంటి స్కూలుకు నేను హాజరయ్యాను. అందులో ఒకరోజు సుందరయ్య గారి క్లాసు కూడా ఉన్నది. అప్పుడు కూడా వినడం తప్ప ఆయనతో పరిచయం లేదు. నెల్లూరు జిల్లా డివైఎఫ్ఐ కార్యదర్శిగా ఉండగా, 1984 జనవరిలో ఒకానొకరోజు కా॥ మధు ఓ ఉత్తరాన్ని తీసుకొని జక్కా వెంకయ్య గారిని కలిసి నన్ను పిలిపించారు. ఆ సందర్భంగా సుందరయ్య గారు రాసిన ఉత్తరాన్ని చూపెట్టి నన్ను యువజన సంఘం రాష్ట్ర కేంద్రానికి రమ్మని కోరారు. నేను అనేక శషభిషల మధ్య చివరకు అంగీకరించాను. మార్చిలో విజయవాడ వచ్చాక మొదటిసారి ఆయనతో కలిసి మాట్లాడడం జరిగింది. యువజనోద్యమ డైరెక్షన్ ఎలా ఉండాలో ఆయన నాకు సూచించారు. ఒకటి రెండుసార్లు మా సబ్ కమిటీకి కూడా ఆయన హాజరయ్యారు. ఆరు నెలల తరువాత ఆయన సూచనలను అమలు జరపడానికి కా॥ కొరటాల గారి సలహా మేరకు రాష్ట్ర కార్యవర్గ సమావేశానికి ఆయనను ఆహ్వానించాను. అక్కడ ఆయనిచ్చిన డైరెక్షన్ ఇప్పటికీ మార్గదర్శకంగా ఉంటుంది. ఆ ఉపన్యాసాన్ని ఆయన మరణానంతరం పుస్తకంగా ప్రచురించాం. ఒకరోజు ఆయన నన్ను పిలిచి, 'నువ్వు చైనాకు వెళ్ళాలి. పార్టీ కేంద్ర కమిటీ యువజన, విద్యార్థి ప్రతినిధివర్గాన్ని పంపిస్తుంది. 15 రోజుల్లోగా పాస్‌పోర్టు సంపాదించి నాకు చూపెట్టాలి.' అని ఆదేశించారు. నేటి పార్టీ ప్రధాన కార్యదర్శి, నాటి డివైఎఫ్ఐ అఖిల భారత అధ్యక్షుడిగా ఉన్న కా॥ ఎం.ఎ.బేబి సారథ్యంలో 1985 మే మొదటివారంలో ఐదుగురం చైనా సందర్శనకు వెళ్ళాం. ఆ సమయంలో సుందరయ్య అనారోగ్యంతో మద్రాసు అపోలో ఆస్పత్రిలో ఉన్నారు. నేనక్కడ ఉండగానే ఆయన మరణవార్త విన్నాను. నేను తిరిగి వెళ్ళిపోవాలని భావించాను. బేబి ఫోనులో కా॥ మాకినేని బసవపున్నయ్యను సంప్రదించగా, ఇప్పుడు వచ్చినా చేయగలిగిందేమీ లేదు.. సందర్శన పూర్తి చేసుకొని రమ్మని ఆయన చెప్పారు. అలా నేను సుందరయ్య గారి అంతిమయాత్రలో పాల్గొనే అవకాశాన్ని కోల్పోయాను. కొన్ని లక్షలమంది ప్రజానీకం కృష్ణానది ఒడ్డున ఆయనకు వీడ్కోలు పలకడం ఆంధ్రప్రదేశ్ రాజకీయ చరిత్రలోనే అపూర్వమైన ఘట్టం. మద్రాస్ నుంచి విజయవాడకు తీసుకొచ్చే దారిలో అడుగడుగునా జనం ఆయన పార్థివ దేహానికి నీరాజనాలు అర్పించారు. అలా కమ్యూనిస్టు ఉద్యమం మహా శిఖరాన్ని కోల్పోయింది. ఈరోజు ఆయన మనముందు సజీవంగా లేకపోయినా వారు నిర్మించిన ఉద్యమం, చూపించిన బాట, నెలకొల్పిన విలువలు సజీవంగా ఉన్నాయి. ఆ బాటలో కమ్యూనిస్టు ఉద్యమం పురోగమించడానికి సరికొత్త నేపథ్యం ఏర్పడుతోంది. రాష్ట్రంలో బలమైన కమ్యూనిస్టు ఉద్యమాన్ని పునర్నిర్మించడమే సుందరయ్యకు మనం అర్పించగలిగే నివాళి. విజన్ 2020, 2047ల గురించి మాట్లాడే నాయకులు 1946లోనే 'విశాలాంధ్రలో ప్రజారాజ్యం' పేరుతో సుందరయ్య రాసిన ప్రణాళికను చదివితే కమ్యూనిస్టుల దీర్ఘ దష్టి, విజన్ అర్థమవుతుంది. కార్పొరేట్ విజన్లకు భిన్నమైన శ్రామిక వర్గాల విజన్ అది. అది మాత్రమే అసమానతల్లేని సమాజాన్ని నిర్మించగలుగుతుంది.

మాతృభాషలోనే బోధన, పాలన సాగాలి

భాషకు, జాతుల సమస్యకు మధ్యవున్న సంబంధాలపైనా; కేంద్రానికి, రాష్ట్రాలకు మధ్య ఉండాల్సిన సంబంధాలపైనా; భాషా సమస్య సక్రమ పరిష్కారానికి తీసుకోవల్సిన చర్యల పైనా భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) వైఖరి గురించి సుందరయ్య గారు 1965లో ఒక వ్యాసం రాశారు. ఇది 'పీపుల్స్ డెమోక్రసీ' పత్రికలో ప్రచురితమైంది. ఈ అంశాలపై చర్చ ఇప్పటికీ ఉన్నందున అవగాహన కోసం దానిని క్లుప్తీకరించి పున:ముద్రిస్తున్నాం. - ఎడిటర్)



హిందీని బలవంతంగా రుద్దడానికి వ్యతిరేకంగా 1965 జనవరి, ఫిబ్రవరి మాసాల్లో తమిళనాడులో బ్రహ్మాండమైన ప్రజా ఉద్యమం పెల్లుబికింది. కేంద్ర ప్రభుత్వం కనీసం భారత రాజ్యాంగంలో నిర్దేశించిన లక్ష్యాల మేరకైనా ప్రాంతీయ భాషలను వృద్ధి చేయకుండా- 1965 జనవరి 26 నుంచి కేంద్ర ప్రభుత్వ పరిపాలనా వ్యవహారాలు హిందీలోనే జరుపబడతాయని ప్రకటించింది. ఇది చాలా తొందరపాటు చర్యని, దీనిని అమలు జరపకుండా వాయిదా వేయాలని తమిళనాడు ప్రజలు చేసిన విజ్ఞప్తిని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెడచెవిన పెట్టాయి. దీంతో, గత్యంతరం లేక రిపబ్లిక్ దినోత్సవాన్ని విచారదినంగా జరిపేందుకు నల్ల జెండాలు ఎగురవేయాలని నిశ్చయించుకున్నారు. దీంతో, వందలాది మంది డిఎంకె నాయకులను, ఇతర ప్రముఖులను జనవరి 26కు ముందే భారత రక్షణ నిబంధనల కింద కేంద్ర ప్రభుత్వం డిటెయిన్ చేసింది. ప్రజలపై లాఠీచార్జీలు, బాష్పవాయు ప్రయోగాలు, కాల్పులు దారుణంగా జరిపించారు. సుమారు 49 మంది ప్రాణాలు బలిగొన్నారు. వేలమందిని నిర్బంధించారు. అయినా ప్రజలు జంకలేదు. పట్టణ విద్యార్థులు, గ్రామీణ రైతాంగ, కార్మికవర్గం మహాప్రవాహంలా కదిలారు. ఈ ఉద్యమం కేరళ, మైసూరు, ఆంధ్ర, బెంగాల్, ఒరిస్సా, అస్సాం, త్రిపుర తదితర రాష్ట్రాలకు కూడా పాకింది.

ఈ సమస్యపై మార్క్సిస్టు పార్టీ ఏ వైఖరి తీసుకోవాలనేది ప్రధాన సమస్యగా మన ముందుకు వచ్చింది. ఇది కేవలం కేంద్రంలో ఏ భాషలో పరిపాలనా వ్యవహారాలు సాగించాలనే పరిమిత సమస్యగా లేదు. రాష్ట్రాల యెడల, రాష్ట్ర భాషల యెడల కేంద్ర ప్రభుత్వం యొక్క మొత్తం పరిపాలనా విధానంతో ముడిపడి ఉంది. భారత రాజ్యాంగం రూపొందించేటప్పుడు మన దేశం రాష్ట్రాల సమాఖ్యగా ఉండాలని నిర్ణయించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల బాధ్యతలు, అధికారాలు నిర్ణయించారు. ఏయే సమస్యలు కేంద్రం నిర్వహించాలో, చట్టాలు చేయాలో ఒక జాబితా పెట్టారు. రాష్ట్రాలకు మరొక జాబితా పెట్టారు. రాష్ట్రాల జాబితాలో వాటిని కూడా అత్యవసర పరిస్థితులు వచ్చినపుడుగాని, పార్లమెంటులో మూడింట రెండొంతుల మెజార్టీచే నిర్ణయించినపుడుగాని కేంద్రం తీసుకోవచ్చు. వ్యవసాయం, భూమి మీద పన్ను, అమ్మకం పన్నులు వేయడం వరకు రాష్ట్రాలకు అధికారం వుంది. మిగతా అన్ని రకాల పన్నులకు కేంద్రానికే అధికారం. ఆదాయ వనరులన్నీ కేంద్రం చేతిలోనే వుంచబడ్డాయి. చివరకు విద్యా, వైద్యం మీద కూడా కేంద్రానికే అధికారం ఉండేటట్లు ఆలిండియా ఉద్యోగ బృందాన్ని తయారు చేశారు. పేరు ఫెడరల్ రాజ్యంగా చెప్పబడుతున్నప్పటికీ వాస్తవంలో రాష్ట్రాలకు నామమాత్రపు అధికారమే వుంది. ఇది మిగతా భాషాజాతుల రాష్ట్రాల అభివృద్ధికి తీవ్ర ఆటంకం.

భాషా రాష్ట్రాలకై పోరాటం

స్వాతంత్ర్యోద్యమ రోజుల్లో కాంగ్రెసు నాయకత్వం జాతుల స్వపరిపాలన ఉంటుందని, మాతృభాషలోనే విద్యాబోధన ఉంటుందని వాగ్దానం చేసింది. స్వాతంత్ర్యానంతరం మొండిచేయి చూపింది. ఫలితంగా భాషా రాష్ట్రాల కోసం ఎన్నో పోరాటాలు, త్యాగాలూ చేయవలసి వచ్చింది. ఆంధ్రలో ఈ ఉద్యమం బలోపేతంగా పెరిగి నిరవధిక నిరాహార దీక్ష పూనిన శ్రీపొట్టి శ్రీరాములుగారి మరణంతో ఉచ్చస్థాయి నందుకొని ప్రభుత్వాన్ని స్తంభింపచేసిన తర్వాతనే గత్యంతరం లేక ఆంధ్రరాష్ట్రాన్ని ఏర్పరుస్తూ, మొత్తం రాష్ట్రాలు భాషా ప్రయుక్తంగా విభజించటానికి భాషారాష్ట్రాల కమీషన్‌ను నియమించింది. అప్పటికీ భాషా రాష్ట్రాలపై తనకుండే వ్యతిరేకతను అనేక కుత్సితాలతో బయటపెట్టుకుంది. వీటికి వ్యతిరేకంగా ఎన్నో పోరాటాలు, ఆందోళనలు చేయవలసి వచ్చింది.

బహుజాతులుగల దేశమిది

ఇండియా బహుజాతులు గల దేశం. అన్ని జాతుల ప్రజల (నేషనాలిటీస్) అభివృద్ధితోనే ఇండియా అభివృద్ధి ముడిపడివుందని కాంగ్రెసు నాయకులు చూడటం లేదు. హిందీ భాషను ఒక్కదానినే ప్రధాన రాజభాషగా, అధికార భాషగా చేయాలని నిర్ణయించారు. తద్వారా గుత్తపెట్టుబడిదారీ నాయకత్వం – కేంద్రాధికారం రాష్ట్రాలను మరింత నామమాత్రం చేయటం జరుగుతుంది. ఇందులో భాగంగానే హిందీని బలవంతంగా రుద్దబూనుకున్నారు. కేంద్ర పాలన, పార్లమెంటు, సుప్రీం కోర్టు, హైకోర్టులు, విశ్వవిద్యాలయాలు ... వీటన్నిటిలోనూ హిందీయే ఉండాలనేది వాళ్ళ ప్లాను. 1949లో కేంద్రంలో అధికార భాషగా హిందీ ఉండాలి అనే నిర్ణయాన్ని రాజ్యాంగ నిర్ణయసభలో కాంగ్రెసు పార్టీ ఒక ఓటు మెజార్టీ నిర్ణయించి, హిందీ భాషను దేశంలోని తదితర భాషా రాష్ట్రాల మీద రుద్దటానికి పూనుకున్నారనే విషయం కూడా మనం మరచిపోరాదు.

ఒక జాతి బూర్జువాజీ మిగతా జాతులపై ఆధిపత్యం చెలాయించాలని వాంఛించడం ఆ వర్గ సహజ లక్షణం. హిందీని బలవంతంగా రుద్దాలనేవారిలో ఈ ఉద్దేశమే ఉంది. భారతదేశంలో బొంబాయి, కలకత్తా నగరాల తర్వాత పారిశ్రామికంగా అభివృద్ధి అయిన రాష్ట్రం మదరాసు. బడా బూర్జువా వర్గానికి, స్థానిక బూర్జువా వర్గానికి మధ్యనున్న వైరుధ్యాలు మద్రాసులో మరింత ఎక్కువగా బయటపడుతున్నాయి. మదరాసు రాష్ట్ర బూర్జువాజీలో ఒక భాగం ద్రవిడ మున్నేట్ర కజగంలో ఉంది. తమ రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధి జరగటం లేదని, ఉత్తరాదివారే అన్నీ కాజేస్తున్నారని ఆందోళన చేస్తూ ఉంటారు. ఈ వెలుగులో పరిశీలించినపుడు అభివృద్ధి చెందిన తమిళ బూర్జువాజీ కేంద్రాన్ని ఎదుర్కోవటానికి ఈ ఉద్యమాన్ని బలపరుస్తూ ఉంది. డి.ఎం.కె. హిందీని బలవంతంగా రుద్దడాన్ని వ్యతిరేకిస్తూ, అన్ని భాషలు అభివృద్ధి కావాలని కోరితే దానిని దేశ విచ్ఛిన్నతని మితవాద కమ్యూనిస్టులు అంటారు. కాదనీ, అది అభివృద్ధికర ఉద్యమమని మనమంటాము.

ఆంధ్రలోనే ప్రారంభించాల్సింది!

ఈ ఉద్యమం కాంగ్రెసు భాషా విధానానికి వ్యతిరేకంగా ప్రజాతంత్ర కోరికపై వచ్చింది. అసలు ఈ సమస్యను ఆంధ్రలో మనమే తీసుకొని ఉద్యమం నిర్మించి వుండాల్సింది. రాష్ట్రంలో ఉన్న కేంద్రప్రభుత్వ శాఖలో పనిచేసే వారు కూడా హిందీ నేర్చుకోవాలని ఆర్డరు వుంది. 1962లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఒక ఆర్డరు జారీ చేసింది. దాని ప్రకారం బంట్రోతు కూడా మూడేళ్లలో హిందీని విధిగా నేర్చుకోకుంటే ఇంక్రిమెంట్లు ఆపేస్తారట. దీనివల్ల తమ పోలీసు డిపార్టుమెంటులో చిక్కులేర్పడే పరిస్థితి ఉంటుందని ఇనస్పెక్టరు జనరల్ ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేసుకోగా, ఆ డిపార్టుమెంటును మినహాయించారు. ఈ ఆర్డరు రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల గూర్చి చేశారు. దీనికి వ్యతిరేకంగా మనం కదలలేదు. హిందీని హైస్కూళ్ళలో నిర్బంధంగా ప్రవేశ పెట్టి, హిందీలో ప్యాస్ అయితేనే పై తరగతికి పంపుతామని, ఎస్.ఎస్.ఎల్.సి.లో 15 శాతం మార్కులు వస్తేనే కాలేజీలో చదువు కొనసాగడానికి వీలుంటుందని ప్రభుత్వం అమలు చేస్తున్నప్పుడు – దీనికి వ్యతిరేకంగా కూడా మనము కదలలేదు. ఇప్పుడు మద్రాసులో జరిగినందుకైనా మనం సంతోషించాలి. ఈ ప్రభావంతోనైనా నెల్లూరు, చిత్తూరు, రాయలసీమ జిల్లాలు కదిలాయి. త్రిపుర, బెంగాల్, అస్సాం, కేరళ, మైసూరు, మహారాష్ట్రల్లోకూడా వ్యాపించింది. హిందీని బలవంతంగా రుద్దరాదని, మాతృభాషల్లోనే పరిపాలన, విద్యాబోధన జరగాలని కొన్ని రాష్ట్రశాసన సభలు గూడా తీర్మానించాయి. దాదాపు హిందీయేతర రాష్ట్రాల ప్రభుత్వ నాయకులు కూడా ఇలాంటి ప్రకటనలు చేశారు. ఈ సమస్యపై కేంద్రమంత్రివర్గం సంక్షోభంలో పడింది. ఇద్దరు మంత్రులు రాజీనామా చేశారు. చివరకు ప్రజాభిప్రాయాన్ని పాటిస్తామని కేంద్ర ప్రభుత్వం చెప్పుకోవలసి వచ్చింది. కాని, దీని పరిష్కారానికి కేంద్రం పూనుకొనేటట్టులేదు. ఇటీవల కాంగ్రెస్ కార్యవర్గం చేసిన తీర్మానం కూడా హిందీని బలవంతంగా రుద్దే విధంగా పూర్వపు పంథాలోనే వుంది.

త్రిభాషా సూత్రం

త్రిభాషా సూత్రం అంటే ఏమిటి? బాలబాలికలకు విద్యాబోధన మాతృభాషలో జరిపినా, ఇంగ్లీషు, హిందీ భాషలను కూడా స్కూళ్ళలోనూ, కాలేజీలలోనూ నిర్బంధంగా నేర్పాలి. దీనివలన, ఒక పక్క మూడు భాషలు నేర్చుకోవటం పిల్లలకు కష్టంగా వుంటుంది. మరొకపక్క ఆచరణలో మాతృభాష కన్నా, హిందీయే ప్రధాన భాషగా ప్రోత్సహింపబడుతుంది. ఈ అవగాహన వుండబట్టే విశ్వవిద్యాలయాల్లో మాతృభాషలో బోధనా ఏర్పాట్లు చేయలేదు. మాతృభాషను 1970 నుంచి పరిపాలన భాషగా చేస్తామని, విశ్వవిద్యాలయాల్లో మాతృభాషలో 1966 నుంచి బోధించి ఆ ప్యాసైన వారికే ప్రభుత్వ వుద్యోగాలుంటాయని ప్రకటిస్తేగాని విశ్వవిద్యాలయాలు కదలవు.

హిందీ రాకుండా రైల్వే, తంతి తపాలా మున్నగు కేంద్ర ప్రభుత్వ సర్వీసులు ఎలా నిర్వహించగలరని ఒక వాదన. ఈ సర్వీసులలో పనిచేసే ఉద్యోగులు మన రాష్ట్రంలో వుండేవారికి హిందీ అవసరమేముంది? తెలుగు భాషలోనే నిర్వహించవచ్చు. అలాగే అన్ని రాష్ట్రాల్లోనూ చేయవచ్చు. హిందీ అధికార భాషగా లేనిదే దేశ పరిపాలన సాగదని, అది దేశ విచ్ఛిత్తికి జాతి విచ్ఛిత్తికి దారితీస్తుందని కొందరు వాదిస్తారు. కేంద్రంలో 14 భాషలు పాలనా భాషలుగా ఉండలేవని, హిందీ మెజారిటీ ప్రజల (20 కోట్ల ప్రజల) భాషయని, కనుక హిందీయే పాలక అధికార భాషగా వుండాలని వాదిస్తారు. భారతజాతి అనే పదం రాజకీయార్థంలో సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటంలో వాడబడింది. వాస్తవిక అర్థంలో భారతదేశం బహుభాషలు, బహుజాతులు గల దేశం.

భాషా కమిషన్‌కు మన నివేదిక

1956 భాషా కమిషన్‌కు మన పార్టీ కేంద్ర కమిటీ అనేక చర్చల అనంతరం ఒక నివేదికను అందించాము. పార్లమెంటులో అన్ని భాషలు వుపయోగించాలని, రిపోర్టులు, సమాధానాలు కూడా అన్ని భాషల్లో ఉండాలని, కేంద్రప్రభుత్వ చట్టాలు అన్ని భాషల్లోను వుండాలని, సుప్రీంకోర్టులో కూడా అన్ని భాషల్లో మాట్లాడే హక్కుతో బాటు జడ్జిమెంట్లు కూడా (తర్జుమాలైనా) అన్ని భాషల్లో వుండాలని సూచించాము. రాష్ట్ర పాలనా వ్యవహారాలు, హైకోర్టుతో సహా అన్ని స్థాయిల్లోనూ, విశ్వవిద్యాలయాలతో సహా అన్ని స్థాయిల్లోను ఆ రాష్ట్ర భాషల్లోనే జరగాలని చెప్పాము. వివిధ రాష్ట్ర ప్రభుత్వాల ప్రజల మధ్య ఉత్తర ప్రత్యుత్తరాలు ఇతర వ్యవహారాలకు (కరస్పాండెన్సు కోసం) హిందీని లింకు భాషగా ప్రోత్సహించాలని, అంతవరకూ ఇంగ్లీషు కొనసాగాలని కూడా చెప్పాము.

మన పార్టీ కార్యక్రమంలో ఇలా చెప్పాము : "ప్రజలకు విద్యాసంస్థల్లో తమ తమ మాతృభాషల్లోనే విద్యాబోధన జరిగే హక్కు వుండాలి. ఆయా రాష్ట్రాల్లో ఆయా జాతీయ భాషయే ప్రభుత్వ సంస్థలలోనూ, పబ్లిక్ సంస్థలలోనూ భాషగా వుండటమేగాక, పరిపాలనా భాషగా వుండాలి. అత్యంత ఉన్నత తరగతుల వరకూ విద్యాలయాల్లో బోధనాభాషగా ఆ ప్రాంతీయ జాతీయభాషే వుండాలి. అవసరమైనచోట్ల ఒక ప్రాంతం యొక్క గాని, ఒక అల్పసంఖ్యాక వర్గం యొక్క గాని భాష కూడా ఆ రాష్ట్ర జాతీయ భాషతోపాటు అదనంగా ఉపయోగించబడాలి. అఖిల భారత భాషగా హిందీ వినియోగాన్ని నిర్బంధం చేయరాదు. అయితే వివిధ రాష్ట్రాల ప్రజల మధ్య ఉపయోగం కోసం హిందీని వాడాలి. ఆ రాష్ట్రాల్లో పరిపాలనా భాషగా ఇంగ్లీషు స్థానే ప్రాంతీయ భాషలను, కేంద్రంలో ఇంగ్లీషు స్థానే హిందీని ప్రవేశపెట్టాలనే సూత్రానికి కట్టుబడి వుండాలి. రాష్ట్రాల్లో ఇంగ్లీషు నుంచి ప్రాంతీయ భాషలకు మారినప్పుడే కేంద్రంలో ఇంగ్లీషు నుంచి హిందీకి మారడం సాధ్యమవుతుంది. ప్రభుత్వ భాషగా ఇంగ్లీషు స్థానే హిందీని ప్రవేశపెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం తీసుకొనే చర్యలతోపాటు రాష్ట్రాల్లో కూడా ప్రాంతీయ భాషలను ప్రవేశపెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం అన్ని విధాలా సహాయపడాలి. అదే సమయంలో కేంద్రంలో ఇంగ్లీషు నుంచి హిందీకి ఎంతకాలంలో మారాలన్న విషయాన్ని హిందీయేతర భాషలు మాట్లాడే ప్రజల సమ్మతిపైన నిర్ణయించాలి. ఈ పరివర్తన దశలో ఇంగ్లీషుకు తోటి పాలనా భాష హోదాను కల్పించాలి. పార్లమెంటులోనూ, కేంద్ర పరిపాలనా వ్యవహారాల్లోను అన్ని జాతీయ భాషల సమానత్వాన్ని గుర్తించాలి."

"పార్లమెంటు సభ్యులు ఏ జాతీయ భాషలో మాట్లాడటానికైనా హక్కు కలిగి ఉంటారు. వెంటనే వారి ప్రసంగాలను ఇతర భాషల్లో అనువదింప చేయాలి. అన్ని చట్టాలు, ప్రభుత్వ ఆర్డర్లు తీర్మానాలు అన్ని జాతీయ భాషల్లోనూ ప్రచురించబడాలి. ఉర్దూ భాషకూ, దాని లిపికి రక్షణ యివ్వాలి."

మద్రాసులో వచ్చిన హిందీ వ్యతిరేక ఉద్యమం ఈ సమస్య పట్ల మన మొత్తం అవగాహనను లోతుగా ఆలోచించడానికి పురిగొల్పింది.

పూలను ఖైదుచేసే చోట

నాకు గొణుగుడు వినిపిస్తోంది
బహుశా అవి నాలోపలి
లోతైన స్రోతలివి కావచ్చు
ఒక్క ఆకాశంకింద ఉన్నవారిని
ఒక్కభూమి ఎలా వేరు చేస్తుందని కావచ్చు
గుండెల్లో విస్తరిస్తున్న ఎడారి గురించి
మొలుస్తున్న ముళ్ళ మొక్కల గూర్చి కావచ్చు

అంతర్గత ప్రపంచమొక బొరియ
డెలిసియస్లీ డార్క్
ఏదో ఉంది,
నన్ను గుడ్డు లోపలి
పక్షిపిల్లలా పొడుస్తోంది
మాటలు అర్థం కోల్పోతే
గాయాలు మేల్కొంటాయి
మీరు దుఃఖిస్తే... కన్నీరు
నేను దుఃఖిస్తే... కవిత్వం

కవితలు.. నోటి బీగాలు పగలగొడతాయి
మారుమూల నిజాల్ని,
పక్షికళ్ళలోని శాంతిని బట్టబయలు చేస్తాయి
కవితలు.. కార్మికుల, కర్షకుల
కూలీల దగ్గర తచ్చాడుతుంటాయి
పస్తుల పొట్ట ముందు మోకరిల్లుతాయి
ఎవరైనా వారి మీద రాయి విసిర్తే
విసిరినవారిపైకి తేనెటీగల్లా తిరగబడతాయి
ఇంకా కవితలు
ఎర్ర పూలనీ ఖైదు చేసే చోట
ధిక్కార గస్తీ కాస్తాయి
తొక్కిసలాటకు జనం బలికావొద్దని
ప్రగతిశీల దివిటీలవుతాయి

రక్తాన్ని రగిలించే వాక్యాల్ని
బహిష్కరిస్తారు పెత్తందార్లు.
అయినా రాస్తాం
పీడన శృతి మించినపుడు
కవులు పద్యాల్ని పురమాయిస్తారు.

– శాంతయోగి యోగానంద
96522 71520

ఆకలి యుద్ధం

మంచికో, చెడ్డకో
సాగుతున్న యుద్ధాలు ఆగుతుంటాయి
నిధులూ, ఆయుధాలు నిశీధిలో ప్రవహిస్తున్నా
పెద్దన్న నీతి బోధలతో
పురవీధులు ప్రకాశిస్తాయి
శాంతి కపోతాల డ్రోన్లు విహరిస్తాయి
కాసేపైనా కాల్పుల విరమణ
ఎంత రమణీయం?
కొద్దిగానైనా తుపాకులు
బుద్ధిగా కునుకు తీయడం
ఎంత కమనీయం?

అయితే
ఎన్నడూ ఆగని యుద్ధం
ఎవ్వడూ ఆపని యుద్ధం
భూమిపై ఆకలి యుద్ధం
విశ్వనరుడి ఆకలి మంటలు,
ఆరని మంటలు.
లోక వీరులంతా ఏకమై
ఆకలి యుద్ధ విరమణ చేస్తే,
ఆఖరి వరస మనిషికీ,
భూతల స్వర్గానికి సంకల్పిస్తే,
ఎంత బాగుంటుంది!

– డా.డి.వి.జి. శంకరరావు, మాజీ ఎంపీ,
94408 36931

23న గస్సాల్ కథల సంపుటి ఆవిష్కరణ సభ

కె.ఆనందాచారి కథల సంపుటి గస్సాల్ మరికొన్ని కథలు ఆవిష్కరణ సభ రవీంద్ర భారతిలో 23-05-25 శుక్రవారం సాయంత్రం 5.30 గంటలకు తెలంగాణ సాహితి ఆధ్వర్యంలో జరగనుంది. ఈ సభలో పెద్దింటి అశోక్ కుమార్, డా.ఏనుగు నర్సింహారెడ్డి, మామిడి హరికృష్ణ, వేముల శ్రీనివాస్, ప్రసేన్, డా.నామోజు బాలాచారి, మువ్వా శ్రీనివాసరావు, ఆర్.సీతారాం, వల్లాభాపురం జనార్ధన, నస్రీన్ ఖాన్, చరణ్ పరిమి, సాయి వంశీ, తంగిరాల చక్రవర్తి పాల్గొంటారు.

– తెలంగాణ సాహితి

25న 'దుఃఖం పండుతున్న నేల' ఆవిష్కరణ

మల్లెతీగ సాహిత్య సేవాసంస్థ ఆధ్వర్యంలో మే 25న ఆదివారం ఉదయం 10 గంటలకు విజయవాడ-గవర్నర్ పేటలోని బాలోత్సవ్ భవన్లో కంఠ బంగార్రాజు రచించిన 'దుఃఖం పండుతున్న నేల' కవితా సంపుటిని ప్రజా వాగ్గేయకారుడు, ఎమ్మెల్సీ గోరటి వెంకన్న ఆవిష్కరిస్తారు. రసరాజు, బి.ప్రసాదమూర్తి, బిక్కి కృష్ణ, కోయి కోటేశ్వరరావు, ఘంటశాల నిర్మల, లోసారి సుధాకర్, జెల్ది విద్యాధరరావు పాల్గొంటారు.

– కలిమిశ్రీ, అధ్యక్షుడు, మల్లెతీగ సాహిత్య సేవాసంస్థ

25న అన్నవరం దేవేందర్‌తో 'కవిసంధి'

మే 25వ తేదీ ఆదివారం సాయంత్రం 6 గంటలకు కరీంనగర్‌లోని ఫిల్మ్ భవన్ ఏసి హాల్‌లో ప్రముఖ కవి అన్నవరం దేవేందర్ 'కవి సంధి' కార్యక్రమం జరుగుతుంది. కేంద్ర సాహిత్య అకాడమి ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమంలో తన సాహిత్య జీవన యాత్రను అన్నవరం దేవేందర్ వివరించి కవితా పఠనం చేస్తారు. అనంతరం ప్రశ్నలు సమాధానాల సెషన్ ఉంటుంది. ఈ కార్యక్రమాన్ని కేంద్ర సాహిత్య అకాడమి సభ్యులు ప్రసేన్ పర్యవేక్షిస్తారు.

– డాక్టర్ సి.మృణాళిని
కన్వీనర్, తెలుగు సలహా మండలి, సాహిత్య అకాడమీ

అయస్కాంత క్షేత్రం

ప్రేమపూర్వకమైన
ఒక హిందూ లోకమున్నట్లే
ఒక ముస్లిం ప్రపంచం కూడా ఉంది ఈ భూమ్మీద
అటు వైపు ఇటు వైపు
ఆ రెండు హృదయాలు మమేకమై
ఒక సమ్మేళనమై ఒక శాంతి సమూహమై
ఏ కంచెలూ లేని ఏ సరిహద్దు రేఖలూ లేని
ఏ రణన్నినాదం లేని
రంజానుగాది పండగై విలసిల్లే
విశ్వ శ్రేయస్సనే వేకువనూ వెన్నెలనూ కోరే
ఒక సుక్రియ సంప్రదాయం కూడా ఉంది ఈ నేలమీద –

హోలి సందడిలో
హరివిల్లు రంగులై చిరునవ్వులై
అటు ఆత్మలూ ఇటు అంతరంగాలూ
అవిభాజ్యాలై మానవీయమైన
పూ పరిమళాలు వెదజల్లే
భిన్న ధవాల కలయికల
ఒక అయస్కాంత క్షేత్రం కూడా ఉంది ఈ పథ్వి మీద –

మానవత్వం లేని ముదురు మతోన్మాది
వాడెవడైనా
మనుషుల్ని చంపుతాడు
వాడే అసలైన లోక కంటకుడు
ప్రజా పీడకుడు ...
వాడి చావు వాంఛించడం ముమ్మాటికి క్షేమదాయకమే.
నూటికి నూరు పాళ్లు ఆ చావు సమంజసమే!

పుట్టిన రోజో అది పెళ్లి రోజో
మరో సుదినమో ... అది ఏదైనా
తన స్వగృహానికి స్వాగతించి
పిండి వంటలు పసందుగా వడ్డించే ఒక హిందువైనా...
లేదా
తన స్వీయ లోగిల్లోకి ఆహ్వానించి
బిరియాని కొసరి కొసరి తినిపించే ఒక ముస్లిమైన
బతకటానికి సంపూర్ణమైనవాడు
తాను ఈ పుడమి మీద
జీవించటానికి నిజమైనవాడు

మనుషులు సృష్టించుకున్న మత గ్రంథం
క్షుద్ర శక్తియై ఉగ్ర రూపమై
కరుణలేని మారణహోమం చేస్తున్నప్పుడు
రెండు కులాంతర ప్రేమ పక్షులు
అమలిన కావ్యం అద్భుతంగా రాస్తుంటాయి
ఏ పర్వత లోయలోనో
ఏ నిర్భయ ప్రదేశంలోనో ...

అప్పుడు పేలాల్సింది తుపాకీ తూటా కాదు
ఫిరంగుల శబ్దం కాదు
క్షిపణుల వినాశనం కాదు
అప్పుడు వారిరువురి తలల మీద
పుష్ప వర్షం కురవాలి
చిటపట చినుకుల్లో వాళ్ళు
చిగురించే లతలై వికసించాలి
వాళ్లునిండు నూరేళ్లు జీవించి తీరాలి
ఉగ్రుడూ క్షుద్రుడూ
మనిషితనం ముందు ఎప్పుడో ఓడిపోయారు
ఆయుధం ఆవిరయ్యే రోజున
ఆధునిక హంతకులు అంతమయ్యే రోజున
మనుషులు గెలిచినట్లు
మనుషులు గెలుస్తున్నట్లు
మనుషులు గెలుస్తారు గెలుస్తారు

– రవి నన్నపనేని
91821 81390

ముస్లింలపై 184 విద్వేష దాడులు

- యుపిలో అత్యధికం
- ఎపిసిఆర్ నివేదిక వెల్లడి

దేశంలో ఎలాంటి ఉగ్రదాడి జరిగినా.. కేంద్రంలోని మోడీ సర్కారు ఆ ఘటనను రాజకీయంగా తమకు అనుకూలంగా మలుచుకుంటున్నది. ప్రజలను భావోద్వేగ ప్రపంచంలోకి తీసుకెళ్తూ తన వైఫల్యాలను కప్పిపుచ్చుకుంటున్నది. పుల్వామా దాడి నుంచి నిన్నటి పహల్గాం ఘటన వరకు ఇదే తంతు కనిపిస్తున్నది. దేశవ్యాప్తంగా బిజెపి, దాని అనుబంధ శక్తులు, సంస్థలు, నాయకులు, కార్యకర్తలు జరిపే దాడులు, బెదిరింపులకు ముస్లింలు బలవుతున్నారు. తాజా నివేదిక ఒకటి ఈ విషయాన్ని వెల్లడించింది.

న్యూఢిల్లీ : పహల్గాం ఉగ్రదాడి అనంతరం దేశంలో ముస్లింలు.. సంఘ్ పరివారానికి టార్గెట్‌గా మారారు. వారిని లక్ష్యంగా చేసుకుంటూ దాడులు, బెదిరింపులు పెరిగిపోయాయి. ఏప్రిల్ 11 నుంచి మే 8 వరకు భారత్‌లో మొత్తం 180కి పైగా ముస్లిం వ్యతిరేక ద్వేషపూరిత సంఘటనలు చోటుచేసుకున్నాయి. ఈ ఘటనలలో 300 మందికి పైగా ప్రజలు భౌతికంగా, మానసికంగా ప్రభావితమయ్యారు. యుపి నుంచే ఎక్కువ ఘటనలు నమోదు కావటం ఆందోళనకరం. అసోసియేషన్ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ సివిల్ రైట్స్ (ఎపిసిఆర్) నివేదిక ఈ విషయాన్ని వెల్లడించింది.

ఈ నివేదిక ప్రకారం.. ముస్లింలే టార్గెట్‌గా 184 ద్వేషపూరిత ఘటనలు చోటుచేసుకున్నాయి. ఇందులో పహల్గాం ఉగ్రదాడి తర్వాత 106 ఘటనలు చోటుచేసుకున్నాయి. ఈ ఘటనల్లో 316 మంది శారీరకంగా, మానసికంగా గాయాలను అనుభవించారు. ఈ దాడులు యాదృచ్ఛికంగా జరగలేదు. ఈ ఘటనలు అత్యధికంగా యుపి నుంచి 43 నమోదయ్యాయి. ఆ తర్వాతి స్థానాల్లోనూ బిజెపి పాలిత రాష్ట్రాలే ఉన్నాయి. మహారాష్ట్ర, ఉత్తరాఖండ్, మధ్యప్రదేశ్ ఉన్నాయి.

యుపిలో స్కూల్ విద్యార్థిపై దాడి

యోగి పరిపాలిస్తున్న యుపిలో అయితే కఠిన పరిస్థితులే ఉన్నాయి. బిజెపి పరివారం తీవ్రంగా రెచ్చిపోయింది. 15 ఏళ్ల ముస్లిం బాలుడు స్కూల్ నుంచి తిరిగి వస్తున్న సమయంలో హిందూత్వ మూక ఆయనపై దాడి చేసింది. ఆ బాలుడి చేత పాకిస్తాన్ జెండాపై బలవంతంగా మూత్ర విసర్జన చేయించింది. అలీఘర్‌లో ఈ ఘటన చోటుచేసుకున్నది.

మధ్యప్రదేశ్‌లో హెడ్ కానిస్టేబుల్‌పై..

మధ్యప్రదేశ్ కూడా ఇందుకు ఏ మాత్రమూ తీసిపోలేదు. ఏకంగా ముస్లిం మతానికి చెందిన ఒక పోలీసు పైనే దాడికి దిగిన ఘటన భోపాల్‌లో గతనెల 26న నమోదైంది. మద్యం మత్తులో ఉన్న హిందూత్వ కార్యకర్తలు రైల్వే హెడ్ కానిస్టేబుల్ నాజర్ దౌలత్‌పై దారుణంగా దాడి చేశారు. హిందూత్వ కార్యకర్తలు రైల్వే స్టేషన్ ఆవరణలో ఒక కార్‌లో తెల్లవారు జామున మద్యం సేవిస్తుండటాన్ని గమనించిన హెడ్ కానిస్టేబుల్.. వారిని అక్కడి నుంచి వెళ్లిపోవాలని చెప్పాడు. హెడ్ కానిస్టేబుల్ పేరు చివరన 'ఖాన్' అనే పేరును గమనించిన హిందూత్వ కార్యకర్తలు ఈ దారుణానికి దిగారు.



విద్యార్థులను బహిష్కరించాలని అల్టిమేటం

చండీగఢ్, ఉత్తరాఖండ్, హిమాచల్‌ప్రదేశ్‌లోని హాస్టళ్లలో కూడా కాశ్మీరీ ముస్లిం విద్యార్థులను లక్ష్యంగా చేసుకుంటూ దాడులు జరిగాయి. డెహ్రాడూన్‌లో అయితే హిందూత్వ కార్యకర్తలు.. కాశ్మీరీ విద్యార్థులను బహిష్కరించాలంటూ అల్టిమేటం జారీ చేయటం గమనార్హం. అంతేకాదు.. పలు కాలేజీలకు లిఖితపూర్వక బెదిరింపులు కూడా పంపినట్టు ఆరోపణలు ఉన్నాయి. ఇక కాశ్మీర్ నుంచి వచ్చి వ్యాపారం చేసేవారిని ముస్లింలను టార్గెట్ చేసుకుంటూ జరిగిన దాడులకు సంబంధించిన వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. ముస్సోరీలో ఇద్దరు కాశ్మీరీ శాలువా విక్రేతలపై బజరంగ్‌దళ్ కార్యకర్తలు దాడికి దిగారు. కాశ్మీరీ శాలువా విక్రేతల బృందాన్ని రాత్రిపూటే ఖాళీ చేయాలంటూ ఆదేశించటంతో వారు రూ.12 లక్షల విలువైన సరుకు వదిలిపెట్టి వెళ్లాల్సి వచ్చింది.

రెచ్చిపోయిన బిజెపి ఎమ్మెల్యే

రాజస్థాన్‌లో అధికార బిజెపి ఎమ్మెల్యే అయితే తన బాధ్యతను మరిచి ప్రవర్తించారు. బాల్‌ముకుంద్ ఆచార్య ఒక ర్యాలీలో మసీదును ధ్వంసం చేశారు. ఉత్తరాఖండ్‌లో హిందూత్వ శక్తులు మసీదుపై రాళ్లతో దాడి చేశాయి. ఇక సుప్రీంకోర్టు మార్గదర్శకాలను ఉల్లంఘిస్తూ మరీ కాశ్మీర్‌లో అనుమానిత ఉగ్రవాదుల ఇళ్లను అధికార యంత్రాంగాలు కూల్చి వేయటం ఆందోళనకరం. దేశవ్యాప్తంగా హిందూత్వ శక్తుల దాడులతో ముస్లిం సమాజం భయాందోళనలో జీవిస్తున్నది. రక్షణ కల్పించాల్సిన ప్రభుత్వాలు మాత్రం ఏమీ పట్టనట్టుగా వ్యవహరిస్తున్నాయని మైనారిటీ సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

17 మంది ఎంపిలకు సంసద్ రత్న అవార్డులు

న్యూఢిల్లీ : భర్తృహరి మహతాబ్, రవి కిషన్‌తో సహా మొత్తం 17 మంది పార్లమెంట్ సభ్యులకు సంసద్ రత్న అవార్డులు ప్రకటించారు. రెండు పార్లమెంట్ స్టాండింగ్ కమిటీలు కూడా ఈ అవార్డుకు ఎంపికయ్యాయి. పార్లమెంట్‌లో చేసిన కృషికి గానూ ఎంపిలకు ఈ అవార్డులను ప్రదానం చేస్తారు. ప్రైమ్ పాయింట్ ఫౌండేషన్ ఈ అవార్డులను ఏర్పాటు చేసింది. వెనుకబడిన తరగతుల జాతీయ కమిషన్ (ఎన్‌సిబిసి) చైర్మన్ హన్స్‌రాజ్ అహిర్ నేతృత్వంలోని జ్యూరీ కమిటీ అవార్డు గ్రహీతలను ఎంపిక చేసింది. భర్తృహరి మహతాబ్, సుప్రియా సులే (ఎన్‌సిపి-ఎస్‌పి), ఎన్‌కె ప్రేమచంద్రన్ (ఆర్‌ఎస్‌పి), శ్రీరంగ్ అప్ప బర్నే (శివసేన)లను అవార్డుకు ఎంపిక చేశారు. ఈ నలుగురు ఎంపిలు 16, 17వ లోక్‌సభల్లో అత్యుత్తమ ప్రదర్శన కనబర్చారని, ప్రస్తుత పదవీ కాలంలోనూ అదే పనితీరును కొనసాగిస్తున్నారని ప్రైమ్ పాయింట్ ఫౌండేషన్ ఒక ప్రకటనలో తెలిపింది. స్మితా వాగ్ (బిజెపి), అర్వింద్ సవంత్ (శివసేన - యుబిటి), నరేష్ గణపతి మహస్కే (శివసేన), వర్షా గైక్వాడ్ (కాంగ్రెస్), మేధా కులకర్ణి (బిజెపి), ప్రవీణ్ పటేల్ (బిజెపి), రవి కిషన్ (బిజెపి), నిశీకాంత్ దూబే (బిజెపి), విద్యుత్ బరన్ మహతో (బిజెపి), పిపి చౌదరీ (బిజెపి), మదన్ రాథోడ్ (బిజెపి), సిఎన్ అన్నాదురై (డిఎంకె), దిలిప్ సైకియా (బిజెపి) అవార్డు గ్రహీతల్లో ఉన్నారు. ఆర్థికం, వ్యవసాయంపై రెండు స్టాండింగ్ కమిటీలను కూడా అవార్డుకు ఎంపిక చేశారు. ఆర్థికంపై స్టాండింగ్ కమిటీకి భర్తృహరి మహతాబ్ నేతృత్వం వహిస్తుండగా, వ్యవసాయంపై స్టాండింగ్ కమిటీకి చరణ్‌జిత్ సింగ్ చన్నీ (కాంగ్రెస్) అధ్యక్షత వహిస్తున్నారు.

సిపిఎం సీనియర్ నేత రఘుపాల్ కన్నుమూత

- పార్టీ, ట్రేడ్ యూనియన్ల బలోపేతంలో కీలక కృషి
- ఎంబి భవన్‌లో ఆయన భౌతికకాయంపై అరుణపతాకం కప్పిన జాన్‌వెస్లీ
- నివాళులు అర్పించిన సిపిఎం నేతలు
- బీబీనగర్ ఎయిమ్స్‌కు భౌతికకాయం అప్పగింత



రఘుపాల్ భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న జాన్‌వెస్లీ, ఎస్.వీరయ్య, తదితరులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సిపిఎం సీనియర్ నేత, హైదరాబాద్ నగర మాజీ కార్యదర్శి జి.రఘుపాల్ (83) ఆదివారం కన్నుమూశారు. ఆయన నాలుగు నెలలుగా ఊపిరితిత్తుల కేన్సర్‌తో బాధపడుతూ హైదరాబాద్‌లోని సిటీ న్యూరో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విషయం విదితమే. ఆయన ఆదివారం ఉదయం 10:15 గంటలకు తుదిశ్వాస విడిచారు. కుటుంబ సభ్యులు ఆయన కళ్లను ఎల్.వి.ప్రసాద్ ఆస్పత్రికి దానం చేశారు. ఆయన కోరిక మేరకు వైద్యపరిశోధనల నిమిత్తం బీబీనగర్ ఎయిమ్స్ మెడికల్ కళాశాలకు భౌతికకాయాన్ని అప్పగించారు. అంతకుముందు సిపిఎం, ఐప్సో, ప్రజాసంఘాల నాయకులు, కార్యకర్తలు, బంధువుల సందర్శనార్థం హైదరాబాద్‌లోని సిపిఎం రాష్ట్ర కార్యాలయం ఎంబి భవన్‌లో ఆయన భౌతికకాయాన్ని ఉంచారు. అక్కడ ఎస్‌వికె ట్రస్టు కమిటీ సభ్యులు బుచ్చిరెడ్డి అధ్యక్షతన సంతాప సభ నిర్వహించారు. రఘుపాల్ భౌతికకాయంపై సిపిఎం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ అరుణపతాకాన్ని కప్పారు. నివాళులర్పించిన వారిలో సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎస్.వీరయ్య, జ్యోతి, సీనియర్ నేతలు సారంపల్లి మల్లారెడ్డి, చెరుపల్లి సీతారాములు, పార్టీ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు చుక్క రాములు, బండారు రవికుమార్, సాగర్, అబ్బాస్, జహంగీర్, రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ డిజి నరసింహారావు, అఖిల భారత శాంతి సంఘీభావ సంఘం (ఐప్సో) జాతీయ అధ్యక్షులు, ఆప్ రాష్ట్ర కన్వీనర్ డిడ్డి సుధాకర్, సిపిఎం తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యులు ఎస్‌వి.రమ, భూపాల్, ఎస్‌వికె మేనేజింగ్ కమిటీ కార్యదర్శి ఎస్.వినయకుమార్, సిపిఎం హైదరాబాద్ సెంట్రల్, సౌత్, మేడ్చల్, రంగారెడ్డి, సిద్దిపేట, జనగామ జిల్లా నాయకులు, కుటుంబసభ్యులు పాల్గొన్నారు. అనంతరం పార్టీ శ్రేణులు అంతిమ వీడ్కోలు పలికాయి.

ఎయిమ్స్‌లో బివి రాఘవులు నివాళి

రఘుపాల్ భౌతికకాయానికి బీబీనగర్ ఎయిమ్స్‌లో సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి.రాఘవులు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పాలడుగు భాస్కర్, ఎమ్‌డి.జహంగీర్, తదితరులు నివాళి అర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. అనంతరం రఘుపాల్ మృతదేహాన్ని ఎయిమ్స్ ఆస్పత్రికి కుటుంబ సభ్యులు అందజేశారు.

రఘుపాల్ మృతి తీరని లోటు : ఆర్.అరుణ్‌కుమార్

సీనియర్ నాయకులు రఘుపాల్ మృతి పార్టీకి తీరని లోటు అని సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు ఆర్.అరుణ్‌కుమార్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఆయన మృతికి సంతాపం తెలిపారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

రఘుపాల్ మృతి బాధాకరం
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు

రఘుపాల్ మృతి పట్ల సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు సంతాపం తెలిపారు. రఘుపాల్ మృతి పార్టీకి తీరని లోటు అని ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వారి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. రఘుపాల్ బాల్యమంతా ఆయన తండ్రి గోపాల్‌రెడ్డితో అజ్ఞాతంలోనే గడిచిందని పేర్కొన్నారు. గోపాల్‌రెడ్డి తెలంగాణ సాయుధ పోరాటంలో పాల్గొని 1957లో జనగామ నియోజకవర్గ ఎమ్మెల్యేగా సేవలందించారని తెలిపారు. రఘుపాల్ వెటర్నరీ ఉద్యోగాన్ని వదులుకుని విప్లవోద్యమంలోకి వచ్చారన్నారు. 15 ఏళ్లపాటు సిపిఎం హైదరాబాద్ నగర కార్యదర్శిగా పనిచేశారని వివరించారు.

చురుగ్గా నైరుతి రుతుపవనాలు

- పది రోజులు ముందుగానే పలకరింపు..

న్యూఢిల్లీ / ప్రజాశక్తి-యంత్రాంగం : నైరుతి రుతుపవనాలు చురుగ్గా కదులుతున్నాయి. ఈ నైరుతి రుతుపవనాలు మరో 10 రోజుల్లో కేరళను తాకనున్నాయని భారత వాతావరణ శాఖ తెలిపింది. దేశవ్యాప్తంగా పలు చోట్ల భారీ వర్షాలు కురుస్తున్న విషయం తెలిసిందే. ఈ వర్ష ప్రభావం పై ఐఎండీ ఎప్పటికప్పుడు హెచ్చరికలు జారీ చేస్తూనే ఉంది. ఈ సమయంలో తాజాగా ఐఎండీ కీలక ప్రకటన చేసింది. నైరుతి రుతుపవనాలు మరో పది రోజుల్లో కేరళను తాకనున్నాయని భారత వాతావరణ శాఖ వెల్లడించింది. ఈ నెల 22న అండమాన్‌ను, 26న శ్రీలంకను తాకవచ్చని ముందుగా ఐఎండి అంచనా వేసింది. కానీ.. పది రోజుల ముందుగానే శ్రీలంకలోకి నైరుతి రుతుపవనాలు ప్రవేశించాయి. ప్రస్తుతం శ్రీలంక, అండమాన్‌లలో విస్తరించినట్టు తెలిపింది. ఈ క్రమంలో ఈ నెల 27వ తేదీ నాటికి కేరళను తాకే అవకాశం ఉన్నట్టు అంచనా. మరోవైపు పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది. రుతుపవనాలు మరో నాలుగైదు రోజుల్లో వేగంగా కదులుతాయని తెలిపింది.

మోస్తరు వాన
- పలుచోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం

నైరుతి రుతుపవనాల ప్రభావంతో రాష్ట్రంలో రెండు రోజులుగా వర్షాలు కురుస్తున్నాయి. ఈ క్రమంలో ఆదివారం పలు జిల్లాలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షం కురిసింది. ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురవడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. అనంతపురం జిల్లా కణేకల్లు మండలం రచ్చుమర్రి గ్రామంలో శనివారం రాత్రి కురిసిన వర్షానికి గ్రామానికి చెందిన హనుమంతప్ప పశువుల షెడ్డు పైకప్పు కూలింది. దీంతో దాని కింద ఉన్న మూడు పాడిగెదేలు మృతి చెందాయి. మరో రెండు గేదెలకు గాయాలయ్యాయి. ఈ ప్రమాదంలో దాదాపు రూ.4 లక్షల వరకు నష్టం వాటిల్లిందని బాధితుడు తెలిపారు. అల్లూరి జిల్లాలోని పెదబయలు, పాడేరు మండలాల్లో వర్షం కురిసింది. పెదబయలులో మోదకొండమ్మ జాతరకు వచ్చిన సందర్శకులు ఇబ్బందులు పడ్డారు. పలుచోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. వీధి కాలువలు పొంగాయి. చెత్తా చెదారంతో కూడిన నీరు రోడ్లపైకి చేరింది. కర్నూలు నగరంలో కురిసిన వర్షానికి చిత్తారి వీధికి చెందిన మునగల నాగమ్మ ఇంటి గోడ పడిపోయింది. కర్ణాటక ప్రాంతంలో కురిసిన వర్షపు నీరు తుంగభద్ర నదిలోకి వచ్చి చేరుతుంది. హగరి నది నిండు కుండలా ప్రవహిస్తోంది. హగరి నీటితో పాటు నది పైభాగంలో కురిసిన వర్షపు నీరు తుంగభద్ర నదిలో చేరడంతో జల కళ సంతరించుకుంది.

లష్కరే తోయిబా ఉగ్రవాది సైఫుల్లా హతం

ఇస్లామాబాద్: లష్కరే తోయిబా కీలక ఉగ్రవాది సైఫుల్లా పాకిస్తాన్‌లో హతమయ్యాడు. భారత్‌లోని నాగ్‌పూర్, రాంపూర్, బెంగళూరులో దాడులకు అతడే సూత్రధారి. పాక్‌లోని సింధ్ రాష్ట్రంలో గుర్తు తెలియని వ్యక్తులు జరిపిన కాల్పుల్లో సైఫుల్లా మరణించాడు. ఆపరేషన్ సిందూర్ తర్వాత పాక్ ప్రభుత్వం సైఫుల్లాకి భద్రత కల్పించింది.

వెకేషన్ బెంచ్‌కి సిజెఐ అధ్యక్షత

న్యూఢిల్లీ : సీనియర్ న్యాయమూర్తులు సహా భారత ప్రధాన న్యాయమూర్తి (సిజెఐ) వేసవి సెలవుల సమయంలో విచారణలు జరపరాదన్న సంప్రదాయానికి స్వస్తి పలికారు. దీనిపై సుప్రీంకోర్టు తాజాగా ఓ నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ నెల 26 నుండి జూలై 13 వరకూ సుప్రీంకోర్టుకు వేసవి సెలవులు. ఈ నెల 26 నుండి జూన్ 1వ తేదీ వరకూ న్యాయస్థానంలో విచారణకు హాజరవ్వాలని సిజెఐ నిర్ణయించారు. వేసవి సెలవులను 'పాక్షిక కోర్టు పని దినాలు'గా సుప్రీంకోర్టు పేర్కొంది. ఈ సమయంలో రెండు నుండి ఐదు వెకేషన్ బెంచ్‌లు పనిచేస్తాయని తెలిపింది. గతంలో వేసవి సెలవులలో రెండు వెకేషన్ బెంచ్‌లు మాత్రమే ఉండేవి. వీటిలో సీనియర్ న్యాయమూర్తులు ఉండే వారు కాదు. సిజెఐ గవాయ్ 26 బెంచ్‌లను నామినేట్ చేశారు. ఇవి వేసవి సెలవులలో వేర్వేరు తేదీలలో పనిచేస్తాయి. సెలవుల సమయంలో సుప్రీంకోర్టు రిజిస్ట్రీ తెరిచే ఉంటుంది.

బావురుమంటోన్న 'బర్లీ' రైతు

(మొదటి పేజీ తరువాయి)

సగటు ధర రూ.245.62 ఉంది. గత సగటు ధర కూడా రాలేదు. 1129 బేళ్లను కొనకుండా తిరస్కరించారు. తేలిక నేలల్లో పండించిన వర్జీనియా పొగాకును శుక్రవారం నాటికి 1,56,18,328 కిలోలు కొనుగోలు చేశారు. సగటు ధర రూ.258.63 ఉంది. శుక్రవారం సగటు ధర రూ.246.42కే పరిమితం అయ్యింది. 843 బేళ్లను కొనకుండా తిరస్కరించారు. వ్యాపారులు పది నుంచి 18 మంది మాత్రమే వేలంలో పాల్గొంటున్నారు.

ప్రభుత్వ రంగ సంస్థల ప్రవేశమే ప్రత్యామ్నాయం

వర్జీనియా పొగాకు వేలం కేంద్రాల్లోగానీ, బర్లీ పొగాకు మార్కెట్‌లోకిగానీ కేవలం వ్యాపారులపై ఆధారపడితే రైతులకు మేలు జరగదు. వేలల కేంద్రాల్లో పోటీ పెరగాలంటే ప్రభుత్వరంగ సంస్థలను దించడమే ఏకైక ప్రత్యామ్నాయం. గతంలో వ్యాపారులు కొనని సందర్భాల్లో పొగాకు ఉత్పత్తిదారుల సమాఖ్యకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు ఇచ్చి కొనుగోలు చేయించింది. అప్పుడు రైతులకు గిట్టుబాటు ధర వచ్చింది. సంక్షోభ సమయాల్లో పొగాకు బోర్డును, స్టేట్ ట్రేడింగ్ కార్పొరేషన్ (ఎస్‌టిసి)ను కూడా రంగంలోకి దిగి కొనుగోలు చేసిన సందర్భాలు గతంలో ఉన్నాయి. ఇప్పుడూ అదే విధంగా చేయాలని, గిట్టుబాటు ధర కల్పించాలని పొగాకు రైతులు కోరుతున్నారు.

హైదరాబాద్‌లో తీవ్ర విషాదం

(మొదటి పేజీ తరువాయి)

సిబ్బందికి సమాచారం అందింది. వెంటనే మొగల్‌పుర ఫైర్ స్టేషన్ సిబ్బంది 6.20 గంటలకల్లా ప్రమాదస్థలికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. మొత్తం 11 ఫైర్ ఇంజన్లు, ఒక రోబో, 70 మంది ఫైర్ సిబ్బంది మంటలు అదుపు చేసేందుకు తీవ్రంగా శ్రమించారు. ఫైర్ ఎగ్జిట్ లేకపోవడంతో ప్రమాద తీవ్రత పెరిగిందని అగ్నిమాపక శాఖ డిజి నాగిరెడ్డి తెలిపారు.

ఒక్కొక్కరికి రూ.5 లక్షల చొప్పున పరిహారం

ప్రమాదంలో మృతుల కుటుంబాలకు తెలంగాణ ప్రభుత్వం తరపున రూ.5 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ఇవ్వనున్నట్లు డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క ప్రకటించారు. మంత్రులు పొన్నం ప్రభాకర్, దామోదర్ రాజనర్సింహాతో కలిసి ఆయన ఘటనాస్థలిని పరిశీలించారు. ఇరుకైన మార్గంలో జి ప్లస్ 2 భవనానికి అధికారులు ఎలా అనుమతులు ఇచ్చారనే దానిపై ఆరా తీస్తున్నట్లు తెలిసింది.

అశోకా యూనివర్సిటీ ప్రొఫెసర్ అరెస్ట్

(మొదటి పేజీ తరువాయి)

పేర్కొంటూ ఈ నెల 12న అలీఖాన్‌కు రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రేణూ భాటియా నోటీసులు పంపారు.

నా వ్యాఖ్యలను వక్రీకరించారు : అలీఖాన్

మహిళా కమిషన్ నోటీసులపై వెంటనే స్పందించిన అలీఖాన్.. తన వ్యాఖ్యలకు రాష్ట్ర మహిళా కమిషన్ వక్రభాష్యం చెప్పిందని పేర్కొన్నారు. తన పోస్ట్ మహిళల హక్కులు లేదా చట్టాలకు ఎలా విరుద్ధమో సమన్లలో కమిషన్ పేర్కొనలేదని తెలిపారు. "మహిళా కమిషన్ నా వ్యాఖ్యలను తప్పుడు కోణంలో, తప్పుడు ఉద్దేశంతో చదివింది. వాటిని తప్పుగా అర్థం చేసుకుంది. వాటిపై ఏకపక్షంగా నిర్ణయం తీసుకుంది. నా మాటల్లోని అర్థాన్ని మార్చేందుకు యత్నించింది" అని పేర్కొంటూ అలీఖాన్ 'ఎక్స్' వేదికగా ఒక పోస్ట్ పెట్టారు. ఇది కొత్త రకమైన సెన్సార్ షిప్, హెరాస్మెంట్ అని, లేని వాటిని సమస్యలుగా చూపించారని పేర్కొన్నారు. తాను భారత సాయుధ దళాలను ప్రశంసించానని, కానీ హింసను విమర్శించానని తెలిపారు. 1200 మంది అకడమీషియన్లు, సామాజిక కార్యకర్తలు ప్రొఫెసర్‌కు మద్దతు తెలుపుతూ బహిరంగ లేఖ విడుదల చేశారు.

విద్వేషాన్ని వ్యతిరేకించిన వారి అరెస్టులు... ప్రోత్సహించే వారికి స్వేచ్ఛ : సిపిఎం

విద్వేషానికి వ్యతిరేకంగా సోషల్ మీడియాలో పోస్టు పెట్టిన ప్రొఫెసర్ అలీఖాన్ మహ్మూదాబాద్‌ను అరెస్టు చేయడాన్ని సిపిఎం తీవ్రంగా ఖండించింది. విద్వేషాన్ని ప్రేరేపించే బిజెపి మంత్రి విజయ్‌షా లాంటి వారు స్వేచ్ఛగా తిరుగుతున్నారని పేర్కొంది. న్యాయాన్ని, శాంతిని కోరుకునే వారు మోడీ భారత దేశంలో లక్ష్యంగా మారుతున్నారని విమర్శించింది. వెంటనే అలీఖాన్‌ను విడుదల చేయాలని డిమాండ్ చేసింది.

వేసవి విడిది



రెండు ప్రశ్నలు


చంద్రాపురం గ్రామంలో శారద అనే ముసలావిడ ఉంది. ఆమె మనుమరాలు కావ్య. కావ్యకు నానమ్మ అంటే చాలా ఇష్టం. కావ్యకు నానమ్మ ప్రతిరోజూ ఒక కథ చెబుతుంది. కానీ కావ్య మాత్రం కథలు వినదు. అయినా శారద మనుమరాలికి కథలు చెప్తుంది.

ఒకరోజు కావ్యను పిలిచి 'రెండు ప్రశ్నలకు సమాధానం చెప్పమం'ది శారద. 'ఓస్ అదెంత చెప్పేస్తాన'ని కావ్య అంది. 'ఈ ప్రపంచంలో దేనిని చూస్తే మనుషులు మారతార'ని నానమ్మ మొదటి ప్రశ్న అడిగింది. కావ్య ఠక్కున 'బంగారమ'ని సమాధానం చెప్పింది. నానమ్మ నవ్వుతూ 'ఎదుటి వ్యక్తుల స్వభావం మంచిగా ఉంటే ఎంత చెడ్డ వ్యక్తులైనా మారతారం'ది.

మళ్లీ నానమ్మ రెండో ప్రశ్న అడుగుతూ 'ప్రపంచంలో విలువైనది ఏది' అంది. అప్పుడు కావ్య బాగా ఆలోచించి మళ్ళీ 'బంగారం' అని సమాధానం ఇచ్చింది. నానమ్మ కావ్యను మొట్టికాయ వేస్తూ, 'మనుషులకు గుణం విలువైనది. మంచి గుణం ద్వారా ఏదైనా సంపాదించవచ్చు. అందులో బంగారం ఎంత' అని అంది. 'నానమ్మా ఇవన్నీ మేము చదువుకునే పుస్తకాలలో లేవు కదా' అని కావ్య ప్రశ్నించింది. 'బంగారు తల్లి ఇవన్నీ నీతి కథల ద్వారా తెలుస్తాయని నానమ్మ చెప్పింది. ఆ రోజు నుండి కావ్య, ప్రతిరోజూ నానమ్మ చెప్పే కథలు శ్రద్ధగా వింటుంది.



– గొల్ల నవ్య,
9వ తరగతి,
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల
హవేలి ఘనపూర్, జిల్లా : మెదక్,
96665 91708.



అమ్మానాన్నల ప్రేమ

అందరికీ ఉంటుంది ఆత్మస్థైర్యం
మా నాన్న అంటే నాకు ధైర్యం
పిల్లలు నాన్నకు కనురెప్పలు
రేయింబవళ్లు తాను పడతాడు తిప్పలు
మమ్మల్ని కొడతాడు అప్పుడప్పుడు
దగ్గరికి తీసుకుంటాడు ఎప్పుడూ
నాన్న ఉంచుతాడు సంతోషంగా
పెంచుతాడు క్రమశిక్షణగా
మా అమ్మ చేస్తుంది మాకోసం కష్టం
తనంటే మాకు చాలా ఇష్టం
మమ్మల్ని మోసింది తన కడుపులో
తాను ఉంటుంది మా మనసులో
మా అమ్మ ఒడిలో ఉంది వెచ్చదనం
తన చేతి వంటలో ఉంది కమ్మదనం
ప్రపంచం అన్నది పెద్దది
అమ్మానాన్నల ప్రేమ చాలా గొప్పది



– కె. వినీత్,
8వతరగతి,
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,
రాజగోపాల్ పేట,
నంగునూరు, సిద్ధిపేట జిల్లా.

బొమ్మల కొలువు




ఆర్.అభినయశ్రీ,
7వ తరగతి,
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,
రాజగోపాల్ పేట,
సిద్ధిపేట జిల్లా.





అక్షయ,
9వ తరగతి ,
జిల్లా పరిషత్ ఉన్నత
పాఠశాల
రాజగోపాల్ పేట,
సిద్ధిపేట జిల్లా



పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com 83329 25496

జీవన the family

JEEVANA

జీవన సౌరభం

జీవన సౌరభం :
ప్రవర్తన అద్దం లాంటిది. ప్రతి వ్యక్తి ప్రతిబింబం అందులో కనిపిస్తుంది.

చిరుధాన్యాలతో పెద్ద ప్రయోజనాలు



ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు ఇప్పుడు చాలామంది ఆహారంలో చిరుధాన్యాలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. రాగులు, సజ్జలు, జొన్నలు, కొర్రలు, ఊదలు, అండు కొర్ర, అరికెలు, సామలు వంటి చిరుధాన్యాలను ఆహారంగా తీసుకుంటున్నారు. వీటిలో విటమిన్లు, ఖనిజాలు, ప్రోటీన్, ఫైబర్ లాంటి పోషకాలు మెండుగా ఉంటాయి. చిరుధాన్యాలను తినడం వల్ల పలు వ్యాధులు దరిచేరవు. అయితే ఏయే చిరుధాన్యాలు ఏయే వ్యాధులను తగ్గిస్తాయో ఒకసారి చూద్దాం.

కొర్ర : నరాల బలహీనత, మానసిక వ్యాధులు, ఆర్థరైటిస్, పార్కిన్సన్, మూర్ఛ వ్యాధులను దూరం చేస్తాయి.

అరికెలు : రక్తహీనత, షుగర్, మలబద్ధకం, రక్తశుద్ధి, నిద్ర లేమి సమస్యలను దరి చేరనీయవు.

ఊదలు : లివర్ సమస్యలు, కిడ్నీ బలహీనత, అధిక కొలెస్ట్రాల్, కామెర్ల వంటి అనారోగ్య సమస్యలను తగ్గిస్తాయి.

సామలు : పీసీఓడీ, సంతానలేమి, అండాశయ సమస్యలు తగ్గిస్తాయి.

అండుకొర్ర : జీర్ణ సమస్యలు, రక్తపోటు, థైరాయిడ్, కంటి సంబంధిత సమస్యలను దూరం చేస్తాయి.

జొన్నలు : గుండె సంబంధిత వ్యాధులను దూరం చేస్తాయి. ఊబకాయం, షుగర్‌ను నియంత్రిస్తాయి.

సజ్జలు : ఆస్తమా, యాస్మా, ఇమ్యూనిటీ సమస్యలు, రక్తహీనతను దూరం చేస్తాయి.

రాగులు : ఎముకల బలం, కాల్షియం లోపం, డయాబెటిస్, బరువు పెరగడానికి ఉపయోగకరంగా ఉంటాయి.

సబ్జా గింజలతో అందం.. ఆరోగ్యం ...

వేసవిలో సబ్జా గింజలను రోజువారీ ఆహారంలో భాగం చేసుకుంటే బోలెడు ఉపయోగాలు ఉన్నాయి. శరీరం నుంచి టాక్సిన్స్‌ను బయటికి పంపడంలో ఇవి ఎంతో సాయపడతాయి. అందాన్ని కాపాడటంలో కూడా సబ్జా గింజలు ఉపయోగపడతాయి.



చర్మ సంబంధిత ఇన్ఫెక్షన్లు వచ్చినవారు క్రమం తప్పకుండా సబ్జా గింజలు ఆహారంగా తీసుకోవడం మంచిదంటున్నారు నిపుణులు. ఇందులోని యాంటీ బయోటిక్, యాంటీ ఫంగల్, యాంటీ మైక్రోబియల్ లక్షణాలు చర్మ ఇన్ఫెక్షన్‌కు కారణమయ్యే బ్యాక్టీరియా, ఇతర సూక్ష్మజీవుల పెరుగుదలను నిరోధించడంలో సహాయపడతాయి.

చర్మాన్ని కాంతివంతంగా మార్చేందుకు సబ్జా గింజల్లో ఉండే విటమిన్ ఇ సహాయపడుతుంది. అంతే కాకుండా ఈ గింజల్లో విటమిన్ ఎ, సి, పొటాషియం, మెగ్నీషియం, కాపర్ లాంటి పోషకాలు పుష్కలంగా ఉంటాయి, ఇవన్నీ చర్మ సౌందర్యాన్ని పెంచుతాయని, నిపుణులు చెబుతున్నారు.

మహిళలు 30 ఏళ్ళు రాగానే ఎదుర్కొనే సమస్యల్లో, చర్మం ముడతలు పడడం మొదటి సమస్య. దీనివల్ల చిన్న వయసులోనే వృద్ధాప్య ఛాయలు కనిపిస్తాయి. ఈ సమస్యకు మేలైన పరిష్కారం సబ్జా గింజల్లోని పోషకాలు. ఈ గింజలతో తయారు చేసిన ఫేస్‌ప్యాక్ వేసుకుంటే మంచి ఫలితం ఉంటుందని నిపుణులు తెలుపుతున్నారు.

ఫేస్ ప్యాక్ : చెంచా కొబ్బరి నూనెలో సరిపడినంత సబ్జా గింజల పొడిని కలుపుకుని ముఖానికి రాసుకోవాలి. ఆ తర్వాత గోరువెచ్చని నీటితో కడిగేసుకుంటే సరిపోతుంది.

తక్కువ క్యాలరీలు, అధిక ఫైబర్‌తో నిండిన సబ్జా గింజలు ఆకలిని నియంత్రిస్తాయి. ఫలితంగా బరువు తగ్గడంలో సాయపడతాయి. అలాగే సబ్జా గింజల్లో ఉండే యాంటి బయోటిక్, యాంటి ఫంగల్, యాంటి మైక్రోబియల్ లక్షణాలు.. చర్మం త్వరగా కోలుకోవడానికి తోడ్పడతాయి.

జుట్టుకు కూడా సబ్జా గింజలు మంచి పోషణ అందిస్తాయి. వీటిలో అధికంగా లభించే విటమిన్ కె, బీటా కెరోటిన్, ఇతర ప్రొటీన్లు.. జుట్టు, కుదుళ్లు దృఢంగా ఉండేలా చేస్తాయి. వీటిని క్రమం తప్పకుండా తీసుకుంటే.. జుట్టు రాలే సమస్య తగ్గుతుంది. అయితే సబ్జా గింజలు సహజసిద్ధమైనవే అయినా కొంతమందికి పడకపోవచ్చు. కాబట్టి వాటిని వాడే ముందు నిపుణుల సలహా తీసుకోవాలి.



ఐస్‌క్రీంతో తంటాలెన్నో..!

ఈ ఎండలకు చాలా మంది ఐస్ క్రీం తింటుంటారు. వయసుతో సంబంధం లేకుండా సీజన్‌తో పని లేకుండా కూడా లాగించేస్తారు. అయితే ఎంతగానో ఇష్టపడే ఈ ఐస్ క్రీం ఆరోగ్యానికి హాని కలిగిస్తుందని మీకు తెలుసా? ఐస్ క్రీం తినడం వల్ల పలు అనారోగ్య సమస్యలకు ఆహ్వానం పలుకుతున్నట్లే అంటున్నారు ఆరోగ్య నిపుణులు. ఐస్ క్రీం తయారీకి ఉపయోగించే పదార్థాలు, కల్తీ కారణంగా ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉందంటున్నారు.

బరువు పెరిగే అవకాశం : ఐస్ క్రీంలో అధిక చక్కెర, క్రీమ్ ఉంటాయి. దీన్ని ప్రతిరోజూ లేదా ఎక్కువ పరిమాణంలో తింటే బరువు పెరగడానికి దారితీస్తుందంటున్నారు. ముఖ్యంగా ఇప్పటికే బరువు తగ్గడానికి ప్రయత్నిస్తున్న వారికి ఇది మరిన్ని ఇబ్బందులను కలిగిస్తుంది.

దంతాలు క్షీణిస్తాయి : ఐస్ క్రీంలో ఎక్కువ చక్కెర ఉంటుంది. ఇది దంతాలకు హాని కలిగిస్తుంది. దీనివల్ల దంతక్షయం, నొప్పి వస్తుంది. ఐస్ క్రీం తిన్న తర్వాత నోరు శుభ్రం చేసుకోకపోతే, దంతాలు త్వరగా పాడవుతాయి.

జీర్ణక్రియలో ఇబ్బంది : చాలా మందికి పాల ఉత్పత్తులను జీర్ణం చేసుకోవడంలో ఇబ్బంది ఉంటుంది. ఐస్ క్రీం కూడా పాలతో తయారవుతుంది. కాబట్టి కొంతమందికి దీనిని తిన్న తర్వాత గ్యాస్, నొప్పి లేదా కడుపు ఉబ్బరం వంటి సమస్యలు వస్తాయి.

మొటిమల సమస్య : ఐస్ క్రీంలో ఉండే అధిక కొవ్వు, చక్కెర శరీరంలోని హార్మోన్లపై ప్రభావం చూపిస్తాయి. ఈ ప్రభావం ముఖం మీద కనిపిస్తుంది. మొటిమలు, చర్మ సంబంధిత ఎలర్జీలు వచ్చే ఛాన్స్ ఉంటుంది.

రక్తంలో చక్కెర పెరిగే ఛాన్స్ : ఐస్ క్రీంలో అధిక చక్కెర కారణంగా డయాబెటిస్ ఉన్నవారికి లేదా డయాబెటిస్ ప్రమాదం ఉన్నవారికి ఇది అస్సలు మంచిది కాదు. ఐస్ క్రీం రక్తంలో చక్కెర అకస్మాత్తుగా పెరగడానికి కారణమవుతుంది. దీనివల్ల అనారోగ్యానికి దారితీస్తుంది.

వినోద పరిశ్రమపై చర్చ, సమాలోచన

అధిక రెమ్యూనరేషన్, పైరసీ... ఓటీటీలు... డిజిటల్ ప్లాట్‌ఫాంలు.. థియేటర్లు మూతపడటం... గ్లోబల్ మార్కెట్ల తాకిడి... తదితర అనేక సమస్యలపై సినీరంగ ప్రముఖులు ఆందోళన వ్యక్తంచేశారు.



హాలీవుడ్ నుంచి టాలీవుడ్ వరకూ ప్రేక్షకులు థియేటర్లకు రావటం నానాటికీ తగ్గిపోతోంది. కర్ణుడి చావుకి సవాలక్ష కారణాలన్నట్లుగా సినిమా పరిశ్రమ సంక్షోభానికి అనేక కారణాలున్నాయి. ముంబై వేదికగా ఈనెల ఒకటి నుంచి నాలుగో తేదీ వరకూ నాలుగురోజులపాటు జరిగిన వేవ్స్–2025 (వరల్డ్ ఆడియో విజువల్ ఎంటర్‌టైన్మెంట్ సమ్మిట్)లో ఇదే విషయమై చాలా వాడీ వేడిగా చర్చలు జరిగాయి. ఆధునిక సాంకేతికత మంచిదే కానీ ఆ పేరుతో వచ్చిన పైరసీ, ఓటీటీలు చిత్ర పరిశ్రమను కూకటివేళ్లతో పెకిలించేలా ఉన్నాయనే ఆందోళన వ్యక్తమైంది. రెమ్యునరేషన్లపైన కూడా చర్చలు కొనసాగాయి. ఈ విషయాన్ని హాలీవుడ్ నుంచి బాలీవుడ్, టాలీవుడ్ వరకూ నటీనటులు, దర్శకులు, నిర్మాతలు నొక్కి వక్కాణించారు. అభ్యుదయం వైపు ఆలోచనలు ఉండే సినిమాలను తొక్కేస్తారా? అంటూ కొందరు దర్శకులు తిరుగుబాటు బావుటా ఎగరేశారు. ప్రశ్నిస్తే సినిమాల విడుదలకు ఆపేస్తారా? అంటూ మరికొందరు తమ మనసులోని అభిప్రాయాలను కుండబద్దలు కొట్టినట్లుగా చెప్పేశారు.

లక్ష్యమేమిటంటే..

భారతదేశ సృజనాత్మక ప్రతిభకు ప్రపంచ వేదికగా ఉపయోగపడుతుందనే లక్ష్యంతో ఆడియో విజువల్, ఎంటర్‌టైన్‌మెంట్ రంగంలో వివిధ దేశాల మధ్య సహకారం పెంపొందించే లక్ష్యంతో కేంద్రప్రభుత్వం ఈ సమ్మిట్‌ను ఏర్పాటుచేసింది. యానిమేషన్, గేమింగ్, వినోద సాంకేతికత, ప్రాంతీయ, ప్రధాన స్రవంతి సినిమాల్లో భారత దేశ పురోగతిని ప్రపంచ యువనికపై ప్రతిబింబించేలా తోడ్పాటును అందించాలనే లక్ష్యంతో చర్చలు సాగాయి. బ్రాడ్‌కాస్టింగ్, ప్రింట్‌మీడియా, టెలివిజన్, రేడియో, ఫిల్మ్, యానిమేషన్, విజువల్ ఎఫెక్ట్స్, గేమింగ్, కామిక్స్, సౌండ్ అండ్ మ్యూజిక్, అడ్వర్టైజింగ్, డిజిటల్ మీడియా, సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లు, జనరేటివ్ ఆగ్మెంటెడ్ రియాలిటీ, వర్చువల్ రియాలిటీ, ఎక్స్‌టెండెడ్ రియాలిటీ వంటి పరిశ్రమలకు, రంగాలకు చెందిన ప్రతినిధులు ఈ సమ్మిట్‌లో పాల్గొన్నారు. వినోదం, భారతీయ సినిమాలు, సంగీతం, నాటక కళలకు ప్రపంచస్థాయికి తీసుకెళ్లటం, ఫిల్మ్ టూరిజం, డిజిటల్ రంగాల్లో పెట్టుబడులు ఆకర్షించటం, కళలు, జానపద కళలకు అంతర్జాతీయ గుర్తించే లక్ష్యమని నిర్వాహకులు చెప్పినా టెక్నాలజీ మంచిదేగానీ...భూతమంటూ వక్తల్లో భయాందోళనలు సైతం వ్యక్తమయ్యాయి. చాలా విభాగాల్లో చర్చలు జరిగినా సినిమా పరిశ్రమ ప్రతినిధులు మాత్రం తమకు భవిష్యత్తు శూన్యంగా కనిపిస్తోందంటూ ఆవేదన వ్యక్తంచేశారు.

సవాళ్లను అధిగమించగలమా?

పైరసీ సమస్య ప్రపంచవ్యాప్తంగా కొనసాగుతోంది. డిజిటల్ ఫార్మాట్లు విస్తృతంగా పెరిగిన నేపథ్యంలో సినిమాలు విడుదలైన కొన్ని గంటల్లోనే పైరసీ వెబ్‌సైట్లలో అందుబాటులోకి వస్తున్నాయి. ఇది నిర్మాతలకు భారీ నష్టాన్ని కల్గిస్తోంది. థియేటర్లకు పోటీగా ఓటీటీ ప్లాట్‌ఫారమ్‌లు (అమెజాన్ ప్రైమ్, నెట్‌ఫ్లిక్స్, హాట్‌స్టార్ వంటివి) ఎక్కువగా వృద్ధి చెందుతున్నాయి. చిన్న సినిమాలు థియేటర్లకు వచ్చే అవకాశాలు తగ్గుతున్నాయి. సినిమా ప్రమోషన్ కోసం భారీ మొత్తం ఖర్చువుతోంది. ఇది చిన్న నిర్మాతలకు సమస్యగా మారింది. కరోనా ప్రభావం తర్వాత థియేటర్ అడ్డు తగ్గడం, ప్రేక్షకుల అలవాట్లు మారడం వంటి అంశాలు పరిశ్రమపై ప్రభావం చూపాయి. సాంకేతికత ఉన్నా కొన్ని దేశాల్లో అందుబాటులో లేకపోవటం వల్ల గ్లోబల్ మార్కెట్‌కు అనుగుణంగా సినిమాలు రావటం లేదు. పైగా హాలీవుడ్ వంటి పరిశ్రమల నుంచి సినిమాలు ఇతర దేశాల్లోని స్థానిక మార్కెట్లోకి చొచ్చుకొస్తున్నాయి. ఆయా రాష్ట్రాల్లో పెద్ద కథానాయకుల సినిమాలు భారీ కలెక్షన్లు సాధిస్తున్నా చిన్న సినిమాలు సరైన థియేటర్ స్పేస్ పొందలేకపోతున్నాయి. అందువల్ల ఓటీటీ ప్లాట్‌ఫారంలోకి ఇవి వెళ్లిపోతున్నాయి.

థియేటర్ల కొరతే పెద్ద సమస్య

దేశంలో ఆరు లక్షల వరకూ గ్రామాలున్నాయి. సమీపంలోని పట్టణాలు, నగరాలకు ప్రయాణాలు చేసి మరీ చూడాల్సి వస్తోంది. అక్కడ కూడా సింగిల్ స్క్రీన్స్ మూతపడుతూ మల్టీప్లెక్స్‌లుగా మారిపోతున్నాయి. అందువల్ల ప్రేక్షకుల్లో పెద్ద భాగం సినిమాలు చూడలేకపోతున్నారని బాలీవుడ్ కథానాయకులు అమీర్‌ఖాన్, షారూక్‌ఖాన్ ప్రస్తావించారు. మనదేశంలో 10 వేలు, అమెరికాలో 40 వేలు, చైనాలో 90 వేలు థియేటర్లు ఉన్నాయి. పెద్ద సినిమాలను సైతం 2 శాతం మంది మాత్రమే థియేటర్లలో చూస్తున్నారని వారి అభిప్రాయం. 'ప్రతి ఊరిలో చిన్న థియేటర్లు ఉండాలనీ, వాటిలో భాషతో సంబంధం లేకుండా భారతీయ చిత్రాలను ప్రదర్శించాలి. టికెట్ రేట్లు అందుబాటులో ఉండేలా చూసుకుంటే ఫుట్‌ఫాల్స్ పెరుగుతాయి. పుష్ప, ఆర్ఆర్ఆర్, కల్కి లాంటి పాన్ ఇండియా మూవీలకు ఓ రేంజ్‌లో టికెట్ ధరలను మేకర్లు పెంచారు. ఇదే ఫార్ములాను టైర్ 2 హీరోలకు కూడా అప్లై చేస్తున్నారు. హీరోల ఫాలోయింగ్‌ను దృష్టిలో పెట్టుకుని రేట్లు పెంచుకుంటే బాగుంటుంది. ఇష్టానుసారంగా టికెట్ రేట్లు పెంచితే జనం థియేటర్లకు వచ్చేందుకు ఇంట్రెస్ట్ చూపరు. టికెట్ ధర రూ.100లోపే ఉంటే హిట్టు, ఫ్లాపుతో సంబంధం లేకుండా జనాలు వచ్చే అవకాశం ఉంటుందని వారు స్పష్టంచేశారు. భారీ బడ్జెట్‌తో సినిమాను తెరకెక్కించిన నిర్మాతలు వారం, పది రోజుల్లో మొత్తం రాబట్టుకోవాలని ఆలోచిస్తున్నారని, అలాంటి వారికి ఇలాంటి విషయాలు నచ్చవంటూ చమత్కరించారు. ఈ విషయం ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశమైంది.





పంజాబ్ బల్లే బల్లే

ప్లే ఆఫ్స్ ముంగిట శ్రేయస్ సేన
రాజస్తాన్‌పై 10 పరుగులతో గెలుపు

పంజాబ్ బల్లే బల్లే. 2014 తర్వాత ఐపిఎల్‌లో తొలిసారి ప్లే ఆఫ్స్‌లో ఆ జట్టు బెర్త్ లాంఛనం చేసుకుంది. జైపూర్‌లో రాజస్తాన్ రాయల్స్‌పై 10 పరుగులతో గెలుపొందిన పంజాబ్ కింగ్స్.. గ్రూప్ దశలో 12 మ్యాచుల్లో 17 పాయింట్లు సాధించింది. ఆదివారం ఉత్కంఠ రేపిన మ్యాచ్‌లో నేహల్ వదేరా (70), శశాంక్ సింగ్ (59 నాటౌట్) అర్ధ సెంచరీలతో పంజాబ్ కింగ్స్ తొలుత 219/5 పరుగులు చేయగా..హర్‌ప్రీత్ బరార్ (3/22) మూడు వికెట్ల మెరుపులతో ఛేదనలో రాజస్తాన్ రాయల్స్ 209/7 పరుగులే చేసింది.



వధేరా (70)

జైపూర్ : పంజాబ్ కింగ్స్ జోరు కొనసాగించింది. ఢిల్లీ క్యాపిటల్స్‌తో ధర్మశాల మ్యాచ్ అర్ధాంతరంగా నిలిచిపోగా ఆందోళనకు గురైన పంజాబ్ కింగ్స్ ఆటగాళ్లు.. ఐపిఎల్ పున ప్రారంభంలో అదరగొట్టారు. ఆదివారం జైపూర్‌లో రాజస్తాన్ రాయల్స్‌పై 10 పరుగుల తేడాతో పంజాబ్ కింగ్స్ మెరుపు విజయం సాధించింది. ఈ గెలుపుతో 17 పాయింట్లతో ప్లే ఆఫ్స్‌లో శ్రేయస్ సేన బెర్త్ లాంఛనం చేసుకుంది. 2014 తర్వాత పంజాబ్ కింగ్స్ ఐపీఎల్ ప్లే ఆఫ్స్‌కు అర్హత సాధించటం ఇదే తొలిసారి కానుంది. పంజాబ్ కింగ్స్ పేసర్ హర్‌ప్రీత్ బరార్ (3/22) విజృంభణకు మార్కో జాన్సెన్ (2/41), అజ్మతుల్లా ఓవర్‌జాయ్ (2/44) జత కలవటంతో ఛేదనలో రాజస్తాన్ రాయల్స్‌కు ఓటమి తప్పలేదు. ధ్రువ్ జురెల్ (53, 31 బంతుల్లో 3 ఫోర్లు, 4 సిక్స్‌లు), యశస్వి జైస్వాల్ (50, 25 బంతుల్లో 9 ఫోర్లు, 1 సిక్స్) అర్ధ సెంచరీలతో మెరువగా.. వైభవ్ సూర్యవంశీ (40, 15 బంతుల్లో 4 ఫోర్లు, 4 సిక్స్‌లు) దంచికొట్టాడు. సంజు శాంసన్ (20), రియాన్ పరాగ్ (13), షిమ్రోన్ హెట్‌మయర్ (11) వైఫల్యంతో రాయల్స్ 20 ఓవర్లలో 7 వికెట్లకు 209 పరుగులే చేసింది. తొలుత బ్యాటింగ్ చేసిన పంజాబ్ కింగ్స్ 20 ఓవర్లలో 5 వికెట్లకు 219 పరుగులు చేసింది. నేహల్ వదేరా (70, 37 బంతుల్లో 5 ఫోర్లు, 5 సిక్స్‌లు), శశాంక్ సింగ్ (59 నాటౌట్, 30 బంతుల్లో 5 ఫోర్లు, 3 సిక్స్‌లు) అర్ధ సెంచరీలతో చె లరేగారు.

రాయల్స్ అదే తడబాటు : ఐపిఎల్18లో రాజస్తాన్ రాయల్స్ నిలకడగా రాణించినా ఆ జట్టును విజయాలు వరించలేదు. పంజాబ్ కింగ్స్‌తో ఛేదనను సైతం రాయల్స్ దూకుడుగా మొదలెట్టింది. ఓపెనర్లు యశస్వి జైస్వాల్ (50), వైభవ్ సూర్యవంశీ (40) తొలి వికెట్‌కు అదిరే ఆరంభం అందించారు. ఓపెనర్ల మెరుపులతో పవర్‌ప్లేలో రాయల్స్ 89/1 పరుగులు చేసింది. ఛేదనకు గట్టి పునాది పడినా.. గత మ్యాచుల తరహాలోనే మిడిల్, డెత్ ఓవర్లలో రాయల్స్ బోల్తా పడింది. యశస్వి జైస్వాల్ 9 ఫోర్లు, ఓ సిక్సర్‌తో 24 బంతుల్లోనే అర్ధ సెంచరీ సాధించాడు. సూర్యవంశీ సైతం ధనాధన్ జోరు చూపించాడు. 7.3 ఓవర్లలోనే 100 పరుగుల మార్క్ దాటిన రాయల్స్ ఆ తర్వాత ట్రాక్ తప్పింది. ఇంపాక్ట్ ప్లేయర్‌గా బంతి అందుకున్న హర్‌ప్రీత్ బరార్ (3/22) ఓపెనర్లు సహా రియాన్ పరాగ్ (13)ను సాగనంపి రాయల్స్‌ను దెబ్బకొట్టాడు. సంజు శాంసన్ (20) ఆశించిన ప్రదర్శన చేయలేదు. ధ్రువ్ జురెల్ (53) అర్ధ సెంచరీతో రాణించినా.. రన్‌రేట్‌కు తగినట్టు దూకుడుగా ఆడలేదు. షిమ్రోన్ హెట్‌మయర్ (11), శుభమ్ దూబె (7 నాటౌట్), వానిందు హసరంగ (0) విఫలం అయ్యారు. 20 ఓవర్లలో 7 వికెట్లకు 209 పరుగులే చేసిన రాయల్స్ 10 పరుగుల తేడాతో పరాజయం పాలైంది. పంజాబ్ కింగ్స్ బౌలర్లలో మార్కో జాన్సెన్ (2/41), అజ్మతుల్లా ఓవర్‌జాయ్ (2/44) రాణించారు.

సంక్షిప్త స్కోరు వివరాలు :

పంజాబ్ కింగ్స్ ఇన్నింగ్స్ : 219/5 (నెహల్ వదేరా 70, శశాంక్ సింగ్ 59 నాటౌట్, అజ్మతుల్లా 21 నాటౌట్, తుషార్ 2/37)

రాజస్తాన్ రాయల్స్ ఇన్నింగ్స్ : 209/7 (ధ్రువ్ జురెల్ 53, యశస్వి జైస్వాల్ 50, వైభవ్ సూర్యవంశీ 40, హర్‌ప్రీత్ బరార్ 3/22)

ప్లే ఆఫ్స్‌కు గుజరాత్

- ఢిల్లీపై ఘన విజయం



ఢిల్లీ : ఐపిఎల్‌లో గుజరాత్ జైత్రయాత్ర కొనసాగుతోంది. ఢిల్లీపై ఏకంగా 10 వికెట్ల తేడాతో గెలుపొందింది. ఈ సీజన్‌లో ప్లే ఆఫ్స్‌కు చేరిన తొలి జట్టుగా నిలిచింది. ఓపెనర్లు సాయి సుదర్శన్ (100), శుభ్‌మన్ గిల్ (93) తమ ఫామ్‌ను కొనసాగిస్తూ గుజరాత్‌కు ఘన విజయాన్ని అందించారు. ఈ ఓటమితో ఢిల్లీ తన ప్లే ఆఫ్స్ అవకాశాలను సంక్లిష్టంగా మార్చుకుంది. ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియంలో గుజరాత్ టైటాన్స్, ఢిల్లీ క్యాపిటల్స్ జట్లు ఆదివారం తలపడ్డాయి. టాస్ గెలిచిన గుజరాత్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్ బౌలింగ్ ఎంచుకున్నాడు. దీంతో ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు బ్యాటింగ్‌కు దిగింది. డుప్లెసిస్(5) త్వరగానే ఔటైనా మిగిలిన బ్యాటర్లు సమయోచితంగా రాణించారు. కెఎల్ రాహుల్ (112 నాటౌట్) సెంచరీ చేశాడు. రాహుల్‌తో అభిషేక్ పోరెల్ (30), అక్షర్ పటేల్ (25) కీలక భాగస్వామ్యాలు నెలకొల్పారు. చివర్లో ట్రిస్టన్ స్టబ్స్ (21) కూడా వేగంగా పరుగులు చేశాడు. దీంతో ఢిల్లీ నిర్ణీత 20 ఓవర్లలో మూడు వికెట్లు కోల్పోయి 199 పరుగులు చేసింది. గుజరాత్ బౌలర్లలో ప్రసిద్ధ్ కృష్ణ, అర్షద్ ఖాన్, సాయి కిశోర్ ఒక్కో వికెట్ దక్కించుకున్నారు.

200 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన గుజరాత్ సునాయాసంగా ఛేజింగ్‌ను పూర్తి చేసింది. ఓపెనర్లు సాయి సుదర్శన్ (108 నాటౌట్), శుభ్‌మన్ గిల్ (93 నాటౌట్) మరోసారి చెలరేగారు. ఢిల్లీ బౌలర్లకు ఎలాంటి అవకాశమూ ఇవ్వకుండా సునాయాసంగా పరుగులు చేశారు. ఢిల్లీ ఓపెనర్ సాయి సుదర్శన్ తన ఫామ్ కొనసాగిస్తూ మరో సెంచరీ చేశాడు. మరో ఎండ్‌లో గిల్ కూడా అద్భుతంగా ఆడాడు. దీంతో ఢిల్లీ నిర్దేశించిన లక్ష్యాన్ని గుజరాత్ 19 ఓవర్లలోనే పూర్తి చేసింది. ప్లే ఆఫ్స్ బెర్తును ఖాయం చేసుకుంది.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68